# జాతీయ స్వేచ్ఛ

పక్షపత్రిక

2020 సెప్టెంబర్ 1-30

వెల : రూ.30/-


## కోర్టు ధిక్కార నేరాలు ఇంకా అవసరమా ?

## నాటి ఇటలీ నేటి భారత్

## హిందూ రాజ్యాన్ని అంబేడ్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు?

## అఖండ హిందూ భారత్ - చరిత్రలో లేదు

## జీడీపీ భారీ పతనం : ఇది 'రాజకీయ-సామాజిక సంక్షోభం'గా మారనుందా

## "లాల్- నీల్ ఐక్యత కోసం" వాట్సప్ గ్రూపు "అవగాహనా పత్రం"

## సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్

## మూస ఆలోచనకి బద్ధ వ్యతిరేకి 'ఉసా'

## కొత్త సందర్భంలో కొత్త అధ్యయనం

## '1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు' ఇప్పుడెందుకు చదవాలి?

## గ్రాంసీ దృక్కోణంలో దళిత ఉద్యమం

## ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ ప్రయోగాలు

## ప్రత్యామ్నాయ రాజకీయానికి కొత్త దారి


23-24

జాతీయ **స్ఫూర్తి** పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2020 సెప్టెంబర్ 1-30 సంపుటి : 28 సంచిక : 23,24

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 30/- రూపాయలు

## ఈ సంచికలో...

4 కోర్టు ధిక్కార నేరాలు ఇంకా అవసరమా ? - మాడభూషి శ్రీధర్
5 నాటి ఇటలీ నేటి భారత్ - రామచంద్ర గుహ
7 హిందూ రాజ్యాన్ని అంబేద్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు? - డాక్టర్ సిద్ధార్థ్
8 హిందూ రాజ్యం అంటే ? - ప్రభాత్ పట్నాయక్
10 అఖండ హిందూ భారత్ – చరిత్రలో లేదు - డాక్టర్ దేవరాజు మహారాజు
12 జీడీపీ భారీ పతనం : ఇది 'రాజకీయ–సామాజిక సంక్షోభం'గా మారనుందా - డి.పాపారావు
16 జీడీపీ : ఎలా లెక్కకడతారు.. ఈ గణాంకాలు ఎందుకంత కీలకం - నిధి రాయ్
18 "లాల్– నీల్ ఐక్యత కోసం" వాట్సప్ గ్రూపు "అవగాహనా పత్రం"
20 సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్ - కా. రమాసుందరి
22 మూస ఆలోచనకి బద్ధ వ్యతిరేకి 'ఉసా' - పి.మురళికుమార్
25 కొత్త సందర్భంలో కొత్త అధ్యయనం - అవిజిత్ పాథక్
27 మరణాన్ని గౌరవించాలి - అవిజిత్ పాథక్
29 '1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాత ప్రతులు' ఇప్పుడెందుకు చదవాలి? (మొదటి భాగం)
36 '1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు' ఇప్పుడెందుకు చదవాలి? (రెండో భాగం) - మందలపర్తి కిషోర్
43 గ్రాంసీ దృక్కోణంలో దళిత ఉద్యమం
45 ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ ప్రయోగాలు ప్రత్యామ్నాయ రాజకీయానికి కొత్త దారి - రమేష్ చంద్ర భూపతిరాజు

# రాష్ట్రంలో మత రాజకీయం

**సంపాదకీయం**

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు కుల సమీకరణల రాజకీయం నడుస్తున్నది. ప్రధాన పాలకపక్షాలుగా వున్న వైసిపి, టిడిపిలు ఈ పద్ధతికి కొంత స్థిరత్వాన్ని తెచ్చిపెట్టారు. ఈ పార్టీలు ఇతర ఉపశ్రేణి కులాలను తమ ఓటు బ్యాంకులుగా మార్చుకోవడానికి అవసరమైన పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. ఉపశ్రేణి కులాల నాయకులను పార్టీలో, ప్రభుత్వ పదవులలో, నామినేటెడ్ పదవులలోకి ఆకర్షించి వారి ద్వారా ఉపశ్రేణి కులాల సమూహాలను ప్రభావితం చేస్తున్నారు. మరొకపక్క ఉపశ్రేణి కులాల పేదలను ఓటు బ్యాంకులుగా మార్చుకోడానికి కుల ప్రాతిపదిక గల పథకాలను, ప్రలోభాలను, రాయితీలను ప్రకటిస్తూ ప్రభుత్వ సొమ్ముతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇవన్నీ కుల సమీకరణల రాజకీయంలో భాగంగా సాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయంలో పట్టు సంపాదించుకోవడానికి రాష్ట్ర బిజెపి ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్రంలో బిజెపి విస్తరణకు చాలా అవరోధాలున్నాయి.

మొదటిది రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో ప్రత్యేక హోదాకు హామీ ఇచ్చి దానిని అమలు చేయకపోవడంతో రాష్ట్ర ప్రజల్ని బిజెపి మోసం చేసింది అన్న భావన తీవ్రంగా వుంది. అలాగే విభజన చట్టంలో హామీలను నెరవేర్చలేదన్న అసంతృప్తి ఉంది. ఈ నేపథ్యంలో బిజెపి రాష్ట్ర రాజకీయాలలో సాధారణ రాజకీయ పద్ధతులలో ప్రజల ముందుకు రావడం వారి మద్ధతు పొందడం సాధ్యం కాదని తెలిపోయింది.

రెండోది రాష్ట్రంలో కుల సమీకరణల రాజకీయం పాలక పార్టీల మధ్య స్థిరపడడంతో అదే తరహాలో కొత్తగా కులసమీకరణల రాజకీయం చెయ్యడానికి బిజెపికి తగిన జాగాలేదు.

పవన్‌కళ్యాణ్‌కి కులపరమైన ప్రభావం కొంత వున్నప్పటికీ ఇతర ఉపశ్రేణి కులాలను ఆకర్షించే స్థితి లేకుండా పోయింది. అందువల్ల పవన్‌తో జట్టు కట్టినా బిజెపికి అంతకు మించిన ప్రభావం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో బిజెపి మత రాజకీయం ద్వారా రాష్ట్ర రాజకీయాలని ప్రభావితం చేసి లబ్ధి పొందాలన్న వ్యూహాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తున్నది.

ఇటీవల అంతర్వేదిలో ఆలయ రథం తగలబడిపోయిన ఘటనను బిజెపి అంది పుచ్చుకుంది. ఆలయాలలో ఇలాంటి ఘటనలను అలాగే విగ్రహాల మీద దాడులను అందరూ వ్యతిరేకించాలి. ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్రంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. దోషుల్ని కఠినంగా శిక్షించాలి. అయితే బిజెపి ఈ సమస్యను రాష్ట్ర వ్యాపిత ఆందోళనకు సాధనం చేసుకుంది. ప్రజా సమస్యల మీద కాకుండా హిందువుల భావోద్రేకాల ద్వారా రాజకీయ లబ్ధి పొందాలన్న ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ క్రైస్తవుడైనందునే ప్రభుత్వం హిందూ దేవాలయాల పట్ల వివక్ష చూపిస్తున్నదన్న వాదనను చాప కింద నీరులా ప్రచారం సాగిస్తున్నది. ఇలా రాష్ట్రంలో మత రాజకీయానికి దారులు వేస్తున్నది.

రాష్ట్ర ప్రజల పట్ల బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరించిన అనుచిత వైఖరి నుండి తప్పించుకుని రాష్ట్రంలో పార్టీ విస్తరించడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తున్నది. ❑

## విన్నపము

కరోనా వ్యాప్తి కారణంగా స్ఫూర్తి ప్రధాన కార్యాలయం ఉన్న ఏలూరులో దఫదఫాలుగా విధిస్తున్న లాక్‌డౌన్ వలన స్ఫూర్తి కార్యాలయము మరియు ప్రింటింగ్ ప్రెస్ కార్యకలాపాలు నిర్వహించడం లేదు. ఇప్పటికీ పరిస్థితులు ఇంకా మెరుగుపడ నందున పత్రికను ముద్రించి మీకు అందచేయ లేకపోతున్నాం. దాని బదులుగా పత్రికను ఈ–పేపర్ రూపంలో మీకు అందచేస్తున్నాం. పాఠకులు గమనించగలరు.

పరిస్థితులు మెరుగుపడ్డాక యధావిధిగా స్ఫూర్తి పత్రికను ముద్రించి మీకు అందచేసే ప్రయత్నం చేస్తాం.

– పబ్లిషర్

# ఆంటోనియో గ్రాంసీ 130 జయంతి

## గ్రాంసీ భావజాలాన్ని విశదీకరించే వ్యాసాలకు విజ్ఞప్తి

నవంబరు 1, 2020
జాతీయ స్ఫూర్తి
ప్రత్యేక సంచిక
*(Print Edition)*



2020 ఆంటోనియో గ్రాంసీ 130 జయంతి సంవత్సరం. గ్రాంసీ ఇటాలియన్ కమ్యూనిస్టు. మార్క్సిస్టు మేధావి. లెనిన్ సారధ్యంలో నడిచిన కమ్యూనిస్ట్ ఇంటర్‌నేషనల్‌లో సభ్యుడు. 1924 లో ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ముస్సోలినీ ఫాసిస్టు ప్రభుత్వం 1926లో అరెస్టు చేసింది. 11 సంవత్సరాల తర్వాత 1937లో జైలులోనే మరణించాడు. ఆయన జైలులో రాసిన నోట్‌బుక్స్‌లో కొన్ని భాగాలను 1970లో ఇంగిలీషులో "సెలెక్షన్స్ ఫ్రమ్ ప్రిజన్ నోట్ బుక్స్" ప్రచురణ తర్వాత గ్రాంసీ భావజాలం వెలుగు చూసింది. ప్రస్తుతం మార్క్స్ రచనల తర్వాత ప్రపంచ వ్యాపిత చర్చ గ్రాంసీ భావజాలం చుట్టూ జరుగుతున్నది. తన కాలపు ప్రపంచానికి మార్క్సిజాన్ని అన్వయించి దాని పరిధిని గ్రాంసీ విస్తరింపజేసాడు. ఆయన రాజ్యవ్యవస్థ మీద, పౌరసమాజం పాత్ర మీద పాలక వర్గాలు సాధించే హెజమనీ పద్ధతుల మీద చేసిన అధ్యయనం మనకు కొత్త దృష్టిని ఇస్తుంది. పాలక వర్గాల హెజమనీకి ప్రతిగా కౌంటర్ హెజమనీ సాధించే మార్గదర్శనం చేస్తుంది.

ఈ పరిశోధనలలో ఆయన రూపొందించిన Conceptsను తెలుగు పాఠకులకు పరిచయం చెయ్యడం కోసం జాతీయ స్ఫూర్తి ఈ ప్రత్యేక సంచికను ప్రచురించాలని తలపెట్టింది ఇక్కడ మేము సూచిస్తున్న కొన్ని Concepts మీద లేదా ఉపయుక్తమని మీరు భావించిన అంశం మీద వ్యాసాలు పంపవలసిందిగా కోరుతున్నాము.

మార్క్సిస్టు భావజాల స్రవంతులకు చెందిన రచయితల వ్యాసాలతో గతంలో జాతీయ స్ఫూర్తి ప్రచురించిన ఎంగెల్స్ ద్వి శత జయంతి సంచికకు విశేష ఆదరణ లభించింది. మీరు ఒక వ్యాసాన్ని పంపించి గ్రాంసీ 130 జయంతి ప్రత్యేక సంచికను అర్థవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

గ్రాంసీ భావజాలాన్ని విశదీకరించే అంశాలపై తెలుగులో మీ వ్యాసాన్ని 2020 అక్టోబర్ 15 లోగా పంపించండి

### గ్రాంసీ భావజాలాన్ని విశదీకరించే కొన్ని అంశాలు

- The Modern Prince
- Hegemony and Counter Hegemony
- Integral State : Political Society +Civil Society
- The Historic Block
- Common Sense and Good Sense
- Traditional Intellectuals And Organic Intellectuals
- Base and Superstructure
- Role of Culture
- Education and Schooling
- War of Position and War of movement
- Gramsci at Margins, on Subalterns
- The Philosophy of Praxis
- Leaders and Masses
- Role of Ideology
- Journals and Media



# కోర్టు ధిక్కార నేరాలు ఇంకా అవసరమా ?

మాడభూషి శ్రీధర్
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

భారత సంవిధానం ఆర్టికల్ 19(1)(ఎ)లో పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యం ఉన్నా కోర్టు ధిక్కారం చేస్తే శిక్ష విధించే అధికారం కోర్టులకు ఉందంటున్నది. న్యాయ స్థానాల తీర్పులను సమంజసంగా విమర్శించవచ్చునని, వారికి వ్యక్తిగత దురుద్దేశాలను ఆపాదించకుండా అభిప్రాయ వ్యక్తీకరణ చేయవచ్చునని కోర్టు ధిక్కార చట్టం వివరించింది. రంజన్ గొగోయ్ లైంగిక వేధింపుల కేసును వేగంగా ముగించి బాధితురాలిని బయటకు గెంటి ప్రధాన న్యాయమూర్తిని నిర్దోషిగా ప్రకటించినప్పుడు సుప్రీంకోర్టు హైకోర్టు న్యాయమూర్తులతో సహా చాలా మంది మౌనంగా ఉండడం కూడా భావవ్యక్తీకరణ హక్కు వినియోగమే. ఎవరిష్టం వచ్చినట్టు వారు మాట్లాడకూడదు. కానీ ఎవరిష్టం వచ్చినట్టు వారు నోరు మూసుకుని ఉండొచ్చు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం సివిల్‌పరమైన తప్పిదం. న్యాయమూర్తి వ్యతిరేక తీర్పు చెప్పినందుకు కోపించి, కోర్టులోనే చెప్పు విసరడం, తిట్టడం, అరవడం పైపైకి వెళ్లడం కోర్టు ధిక్కార నేరాలు. కోర్టుకిచ్చిన ప్రమాణ పత్రాలలో చేసిన వాగ్దానాలు అమలు చేయకపోయినా కోర్టు ధిక్కారమే. వీటితో పాటు నిందాత్మక విమర్శలు అనే నేరం మరొకటి ఉంది. మామూలు కేసుల విచారణ నింపాదిగా దశాబ్దాల పాటు సా..ఆ..ఆ..గుతుంది. కానీ రాజ్యాంగ అధికారాలను వినియోగించి పెద్ద న్యాయస్థానాలు కోర్టు ధిక్కారం కేసులు స్వీకరిస్తే, శరవేగంగా జరుగుతాయి. దీన్ని సమ్మరీ హియరింగ్ అంటారు. కోర్టు ధిక్కారం కేసులో పెద్దగా రుజువు చేయవలసిన అంశాలేమీ ఉండవు. నిందితుడు చేసిన వ్యాఖ్యానాలు ప్రింట్‌లోనో, వీడియోలోనో, సోషల్ మీడియా లోనో భద్రంగా ఉంటాయి. అబద్ధాలు చెప్పి రేపులు, హత్యలు చేయలేదని చెప్పుకోవచ్చేమో కాని 'కోర్టు ధిక్కారమా నాకు తెలియదు, నేను చేయలేదు' అని తప్పించుకోలేరు.

ప్రశాంత్ భూషణ్‌తో పాటు కోర్టుధిక్కారం కేసులో ట్విట్టర్ కంపెనీ వారు కూడా నిందితులు. క్షమాపణతో వారు బయట పడ్డారు. అయితే రెండు ట్వీట్లను వారు మళ్లీ ప్రచారంలో పెట్టకూడదు. ట్వీట్ కవులు, వాట్సాప్ విద్వాంసులకు ఇచ్చిన తీవ్రమైన హెచ్చరిక సుప్రీంకోర్టు తాజా తీర్పు. సుప్రసిద్ధ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ రెండు ట్వీట్లు ఆయనను దాదాపు జైలుకు పంపేవే. రూపాయి జరిమానాతో ఆయనకు జైలు తప్పిపోయింది. సుప్రీంకోర్టు ముగ్గురు జడ్జీల న్యాయస్థానం ప్రశాంత్ భూషణ్ నేరం చేశారని అందుకు ఆయన శిక్ష అనుభవించాల్సిందేనన్నది. ఒక వేళ ఆ రూపాయి చెల్లించకపోతే మూడు నెలలు సాధారణ జైలు జీవితం గడపాలని నిర్దేశించింది, బయటికి వచ్చిన తరువాత మూడు సంవత్సరాల పాటు సుప్రీంకోర్టులో ప్రాక్టీసు చేయకూడదని నిషేధించింది. వీటికన్నా రూపాయి చెల్లించడం నయమని తెలిసి తమ ఉత్తర్వును వెంటనే పాటిస్తారని సుప్రీంకోర్టు చాలా కరెక్టుగా అంచనా వేసింది. కోర్టు ధిక్కారం చేసిన నేరగాళ్లందరినీ అంతే దయతో చూస్తుందని గ్యారంటీ లేదు. కొందరు ప్రముఖులకు ఎక్కువ సమానత సమర్థనీయం అంటారు. ప్రశాంత్ భూషణ్ అన్నటు వంటి మాటలే ఇది వరకు కేరళ ముఖ్యమంత్రి నంబూద్రిపాద్ మాట్లాడారు. సుప్రీంకోర్టు యాభై రూపాయల జరిమానాతో ముగించింది.

మన తెలుగు నేత శివశంకర్ కేంద్రంలో న్యాయశాఖ మంత్రి ఓ అడుగు ముందుకు వేసి "ఫెరా ఉల్లంఘించే వారికి, వధువులను తగలబెట్టే వారికి, జమీందార్లకి మన సుప్రీం కోర్టు స్వర్గం వంటిది" అన్నారు. కానీ అది ఒక అభిప్రాయం, విమర్శ అనీ, కోర్టు ధిక్కారం ఎంత మాత్రం కాదని సుప్రీంకోర్టు వదిలేసింది. శివశంకర్ అన్నారు కదా అని మనమెందుకు రాయకూడదని ఫేస్‌బుక్, ట్విట్టర్లలో టకాటకా కామెంట్లు కొడితే చకచకా కటకటాలకు పోవలసి వస్తుంది. రాజ ద్రోహ, కోర్టు ధిక్కార నేరం వంటి ఈ భయానక శాసనాలు బ్రిటిష్ పాలకులకు అవసరమయ్యాయి. బ్రిటన్‌తో సహా అనేక దేశాలు ఈ నేరాలను తీసేసి నాగరికులయ్యారు. మనమే ఇంకా రాజభక్తితో ఈ నేరాలను బతికించి స్వేచ్ఛా జీవులుగా మరణిస్తున్నాం. పౌరసమాజం– ఈ అన్యాయ, బానిస, భయానక, అప్రజాస్వామిక నేర శాసనాలను సంవిధానపు పునాదుల నుంచి నిర్మూలించేందుకు ఉద్యమాలు నిర్మించాల్సిందే. ❑

# నాటి ఇటలీ నేటి భారత్

రామచంద్ర గుహ



ఇటలీలో తమ పాలన శాశ్వతమని బెనిటో ముస్సోలినీ, ఆయన ఫాసిస్టు అనుయాయులు విశ్వసించారు. నరేంద్రమోదీ, బీజేపీ వారూ అదే విధంగా భావిస్తున్నారు. శాశ్వత పాలన స్వప్నాలు ఫలించబోవు. అయితే ప్రస్తుత పాలకులు అధికారంలో కొనసాగినంత వరకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, నైతికంగా జాతి భారీ మూల్యం చెల్లించవలసి రావడం ఖాయం. ముస్సోలినీ, ఆయన పార్టీ కలిగించిన నష్టాల నుంచి కోలుకోవడానికి ఇటలీకి దశాబ్దాలు పట్టింది. మోదీ, ఆయన పార్టీ పాలనతో వాటిల్లుతున్న వినాశనం నుంచి కోలుకునేందుకు భారత్‌కు అంతకంటే ఎక్కువ కాలమే పట్టవచ్చు.



జీవితచరిత్రలు చదవడం నా వ్యాపకాలలో ఒకటి. ఈ వ్యాస రచనకు ఉపక్రమించే ముందే కెనడియన్ స్కాలర్ ఫెబియో ఫెర్నాండో రిజీ రాసిన బెనజెత్తో క్రోచె–ఇటలీ ఫాసిజం (Benedetto Croce and Italian Fascism) ని చదవడం ముగించాను. క్రోచె గొప్ప ఇటాలియన్ దార్శనికుడు. ఆయన జీవించిన కాలం (1866–1952) విశాల కథను చెప్పేందుకు ఆనాటి విషయాలను విపులంగా మహాదార్శనికుని జీవితాన్ని ప్రతిభావంతంగా ఉపయోగించుకున్న ఉద్గ్రంథమది.

రిజీ పుస్తకాన్ని చదువుతున్నప్పుడు 1920ల్లో ఇటలీ, 2020ల్లో భారత్ మధ్య అసాధారణ సదృశాలను కనుగొన్నాను. 1925 డిసెంబర్‌లో ఇటాలియన్ ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకు వచ్చింది. పత్రికా స్వాతంత్ర్యాన్ని అది కఠినంగా అణచివేసింది. ఆ చట్టం అమల్లోకి వచ్చిన కొద్దినెలల్లోనే ప్రధాన పత్రికలు ఒక్కొక్కటీ ఫాసిస్టు నియంత్రణలోకి వచ్చాయి. ఆర్థిక, రాజకీయ ఒత్తిళ్లను భరించలేక కొంతమంది ప్రచురణకర్తలు అనివార్యంగా తమ పత్రికలను విక్రయించుకున్నారు. ఉదారవాద ఎడిటర్లు అందరూ వైదొలిగారు. వారి స్థానంలో, ఫాసిస్టు పాలకులకు అనుకూలంగా ఉండేవారు నియమితులయ్యారు. 1925లోనే పాలక ఫాసిస్టు పార్టీ, దాని అధినేత బెనిటో ముస్సోలినీ భావజాలాన్ని క్రోచె ఇలా అభివర్ణించాడు: 'అధికార ప్రాబల్యానికి సాగిలపడుతూ, వాగాడంబరాన్ని ప్రదర్శించడం; చట్టబద్ధ పాలన పట్ల బాహాటంగా గౌరవాన్ని ప్రకటిస్తూనే చట్టాలను పూర్తిగా ఉల్లంఘించడం; అత్యంత నవీన భావనల గురించి మాట్లాడుతూ దుర్గంధపూరితమైన పాత చెత్తను తలకెత్తుకోవడం; సువ్యవస్థిత సంస్కృతిని ఏవగించుకుంటూ ఒక కొత్త సంస్కృతిని నిర్మించేందుకు ఫలించని ప్రయత్నాలు చేయడం –ఈ వైరుధ్యాల సమ్మిశ్రమం ఫాసిస్టు సిద్ధాంతం, ఆచరణలో స్పష్టంగా కన్పిస్తాయి'. ఈ విషయంలో 1920ల నాటి ఇటాలియన్ రాజ్య వ్యవస్థకు, భారత్‌లో ప్రస్తుత మోదీ పాలనకు మధ్య పోలికలు స్పష్టంగా చూడవచ్చు. భారత రాజ్యాంగం గురించి అత్యంత గౌరవంతో మాట్లాడుతూనే ఆ సంవిధాన స్ఫూర్తి, సారాన్ని ఉల్లంఘించడం; పురాతన భారతీయ వివేకమే నేటికీ ఆదర్శనీయమూ, అనుసరణీయమూ అని ఘోషిస్తూ ఆధునిక విజ్ఞాన శాస్త్ర స్ఫూర్తిని తిరస్కరించడం; ప్రాచీన సంస్కృతిని ప్రశంసిస్తూ ఆచరణలో పూర్తిగా అనాగరిక పోకడలు పోవడమూ నేడు మనం చూడడం లేదూ?

ముస్సోలినీ ఫాసిస్టు పాలనను భరించలేక నవీన భావుకులూ, స్వతంత్ర ఆలోచనాశీలురైన ఇటాలియన్ మేధావులు దేశాంతరం వెళ్ళిపోగా బెనెజెత్తో క్రోచె మాత్రం తన మాతృభూమి లోనే ఉండిపోయారు. ఫాసిజంకు వ్యతిరేకంగా మేధో, నైతిక పోరాటాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఆయన జీవిత చరిత్రకారుడు ఇలా రాశాడు: 'ముస్సోలినీ పట్ల వ్యక్తిపూజను పెంపొందించేందుకు, ప్రభుత్వాన్ని ధిక్కరించకుండా అణకువతో మెలగడాన్ని నేర్పేందుకు, కొత్త తరాలు డూస్ (నాయకుడు) అధినేతను ఎటువంటి మినహాయింపులు లేకుండా ఆరాధించేందుకు, ప్రశ్నలు అడగకుండా విశ్వసించి, ఆజ్ఞలు పాటించి, పోరాడేందుకు అనుగుణంగా ఇటాలియన్లను సమాయత్తం చేసేందుకు ఫాసిస్టు ప్రభుత్వం సమాచార, ప్రసార మాధ్యమాలను, విద్యావ్యవస్థను సంపూర్ణంగా ఉపయోగించు కుంది. ఇందుకు విరుద్ధంగా క్రోచె ఉదారవాద భావాలను ప్రచారం చేశారు. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ప్రబోధించారు. మానవ హుందాను రక్షించారు. మనిషి స్వతహాగా స్వేచ్ఛాశీలి అని పదేపదే చెప్పారు. వైయక్తిక నిర్ణయాలకు ప్రాధాన్యమివ్వాలని, వ్యక్తిగత బాధ్యతలను విస్మరించకూడదని క్రోచె విజ్ఞప్తి చేశారు.

రిజీ స్ఫూర్తిదాయక క్రోచె జీవిత చరిత్ర తరువాత డేవిడ్ గిల్మోర్ రాసిన 'The Pursuit of Italy' ని చదివాను. ఇది ఇటలీ సమగ్ర చరిత్ర. నాలుగు వందల పేజీల ఈ పుస్తకంలో ముస్సోలినీ పాలనపై ముప్పై పేజీల అధ్యాయం ఉన్నది. ఇటలీలో గతంలో సంభవించిన భీతావహ పరిణామాలనే నేను ఇప్పుడు భారత్‌లో స్వయంగా చూస్తున్నాను. '1930ల్లో ముస్సోలినీ పాలనాశైలి మహా ఆడంబరపూర్వకంగా పరిణమించింది. సైనిక కవాతులు గతంలో కంటే అధికమయ్యాయి. ప్రతి ఒక్కరూ ఫాసిస్టు యూనిఫార్మ్‌లో కన్పించసాగారు. సెన్సార్ నిబంధనలు మహా కఠినతరమయ్యాయి. ప్రజలను పీడించడం మరింతగా పెరిగింది. డూస్ ప్రసంగాలు ఒక నిత్య వ్యవహారమైపోయింది. బాల్కనీలో నిలబడి ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తూ ప్రాచీన రోమ్ సామ్రాజ్య వైభవాన్ని ఇటలీకి మళ్ళీ సంతరింపజేస్తానని ముస్సోలినీ ఉద్ఘాటించినప్పుడల్లా ప్రజలు 'డూస్, డూస్, డూస్' అని కేరింతలు కొట్టేవారు. ఫాసిస్ట్ సెల్యూట్ చేసేవారని గిల్మోర్ రాశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన గురించి కూడా ఇలాగే చెప్పవచ్చు. ముఖ్యంగా 2019లో రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాత మోదీ ఎక్కడ ప్రసంగిస్తున్నా ఆయన ప్రతిమాటకు సభికులు "మోదీ, మోదీ, మోదీ" అని పెద్ద పెట్టున హర్షధ్వానాలు వ్యక్తం చేయడం పరిపాటి అయిపోయింది.

ఇటాలియన్ నియంత అంతగా ప్రజాదరణ ఎలా పొందగలిగాడు? గిల్మోర్ ఇలా సమాధానమిచ్చారు: 'ముస్సోలినీ సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఇటాలియన్ల ఆకాంక్షలు, భయాలకు ఒక ప్రతీక అయ్యాడు. అంతర్జాతీయ సమాజంలో తమ దేశానికి లభించాల్సిన స్థానం లభించలేదని ఇటాలియన్లు విశ్వసించారు. ఇరుగు పొరుగు యూరోపియన్ దేశాలే ఇందుకు కారణమని వారు భావించారు తమ సొంత ఉదారవాద రాజకీయవేత్తలతో పాటు యుద్ధకాలపు మిత్రదేశాలు ఇటలీని ఘోరంగా వంచించాయని ఇటాలియన్లు గట్టిగా భావించారు. తమను ఈ అవమానకర పరిస్థితుల నుంచి రక్షించి పూర్వపు గౌరవప్రతిష్ఠలను ముస్సోలినీ మళ్ళీ సమకూర్చగలరని వారు నమ్మారు' నరేంద్ర మోదీ కూడా ఇదే విధంగా భారత ప్రజల విశ్వాసాన్ని పొందారు. పురాతన కాలంలో భారత్‌లోనూ, విశాల ప్రపంచంలోనూ హిందువులు అన్ని విధాల అగ్రగాములుగా ఉండేవారని, ముస్లిం, బ్రిటిష్ దురాక్రమణదారుల వల్ల వారు ఆ వైభవాన్ని కోల్పోయారని నరేంద్ర మోదీ వాదించారు. స్వాతంత్ర్యానంతరం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు సైతం తమ అవినీతి, కుహనా లౌకికవాదంతో భారత్‌ను, హిందువులను వంచించారని ఆయన చెప్పే మాటలను చాలా మంది విశ్వసిస్తున్నారు.

ఇటలీ చరిత్ర గురించిన రిజీ, గిల్మోర్ పుస్తకాలను చదువుతున్నప్పుడు ఇరవయ్యో శతాబ్దిలో ఆ యూరోపియన్ దేశంలో సంభవించిన కొన్ని పరిణామాలు ఇప్పుడు మన దేశంలోనూ చోటు చేసుకొంటున్న వైనం నన్ను తీవ్ర నైరాశ్యానికి గురి చేసింది. అయితే కొన్ని ఆశావహ సానుకూలతలు ఉండడం నాకు ఎంతో ఊరట కలిగించింది. ముస్సోలినీ ఇటలీలో వలే కాకుండా మోదీ భారత్‌లో పాలకపక్షం ఇతర రాజకీయ పార్టీల నుంచి తీవ్ర రాజకీయ వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ప్రధాన ప్రతిపక్షం కేంద్రంలో చాలా దుర్బలంగా ఉన్నమాట నిజం. అయితే అదే పార్టీ ఇప్పటికీ ఐదారు ప్రధాన రాష్ట్రాలలో చాలా దృఢంగా ఉంది. మీడియాను లొంగదీసుకున్నారు గానీ పూర్తిగా అణచివేయలేక పోయారు. ముస్సోలినీ ఇటలీలో ఫాసిస్టుల ప్రభుత్వాన్ని క్రోచె మాత్రమే అన్ని విధాల వ్యతిరేకించారు. మోదీ భారత్‌లో పాలకపక్షాన్ని నిలదీస్తున్న రచయితలు, మేధావులు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య సంస్థాపన సూత్రాలు, ఆదర్శాలను సమర్థిస్తూ వారు బహిరంగంగా, సాహసోపేతంగా మాట్లాడుతున్నారు.

ముస్సోలినీ తన పాలనను ఎలా పటిష్టం చేసుకున్నదీ అభివర్ణించిన తర్వాత గిల్మోర్ ఆయన వైఫల్యాల్నీ ఎత్తి చూపాడు. 'ఇటాలియన్లు ఆశించిన విధంగా సిరిసంపదలు సమకూర్చడంలో ముస్సోలినీ పాలన విఫలమవడంతో ఫాసిజం బలహీనపడింది. తమకు మంచి పాలన అందిస్తున్నట్లు ఇటాలియన్లను భ్రమింపచేయడంలో ముస్సోలినీ సఫలమయ్యాడు. అయితే ఫాసిస్టు ప్రభుత్వం తమకు శ్రేయోదాయక జీవితాన్ని సమకూర్చిందని ఇటాలియన్లు భావించేలా చేయడంలో మాత్రం విఫలమయ్యాడు. ఇటాలియన్లకు ఉద్యోగాలు సమకూర్చడంలో, జాతి సంపదను ఇతోధికం చేయడంలోనూ ఆయన విఫలమయ్యాడని గిల్మోర్ రాశాడు. మోదీ సైతం ఆర్థికరంగంలో దేశ ప్రజలకు చెప్పుకోదగిన మేలు చేయలేకపోయారు. అవివేక విధానాలతో దేశ ఆర్థికవ్యవస్థకు ఎంతో నష్టాన్ని కలిగించారు. ఇటలీలో తమ పాలన శాశ్వతమని బెనిటో ముస్సోలినీ, ఆయన ఫాసిస్టు అనుయాయులు విశ్వసించారు. నరేంద్ర మోదీ, బీజేపీ వారు కూడా అదేవిధంగా భావిస్తున్నారు. శాశ్వతపాలన స్వప్నాలు ఫలించబోవు. అయితే ప్రస్తుత పాలకులు అధికారంలో కొనసాగినంతవరకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, నైతికంగా జాతి భారీ మూల్యం చెల్లించవలసి రావడం ఖాయం. ముస్సోలినీ, ఆయన పార్టీ కలిగించిన నష్టాల నుంచి కోలుకోవడానికి ఇటలీకి దశాబ్దాలు పట్టింది. మోదీ, ఆయన పార్టీ పాలనతో వాటిల్లుతున్న వినాశనం నుంచి కోలుకునేందుకు భారత్‌కు అంతకంటే ఎక్కువ కాలమే పట్టవచ్చు. ❑

# హిందూ రాజ్యాన్ని అంబేద్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు?

**డాక్టర్ సిద్ధార్థ్**
సామాజికవేత్త

భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలనే కల ఇటీవలి కాలానిదేమీ కాదు. కాకపోతే అది ఈ మధ్య కాలంలో ఎక్కువ ప్రాచుర్యం పొందింది.

సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనుబంధ సంఘాలు జాతీయగీతం, బీఫ్, గోరక్షణ, రామమందిరం వంటి వాటిపై చూపుతున్న దూకుడు ధోరణి దానికే ముందస్తు సంకేతాలు.

గోహత్యను నిషేధించే చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వాదిస్తున్నారు. రిజర్వేషన్లపై పునస్సమీక్ష చేయాలనే ప్రకటన కూడా ఆయన గతంలో చేసి ఉన్నారు.



హిందూ సంస్కృతిని భారతదేశమంతటా ఆదర్శ జీవన నియమావళిగా మార్చాలనేది సంఘ్ ప్రకటిత లక్ష్యం. మహిళలకు డ్రెస్ కోడ్, లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా క్యాంపెయిన్ వంటి వాటిని వారు నడిపిస్తూనే ఉన్నారు.

నిజానికి ఇస్లామ్ ఆధారిత ప్రత్యేక దేశం, హిందూ దేశం రెండు డిమాండ్లూ కవల పిల్లల్లాగే పుట్టాయి. ఇవి రెండూ పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి.

## మత ఆధారిత దేశం

వాస్తవం ఏంటంటే హిందూ మెజారిటీ పాలనా భయం నీడలోనే పాకిస్తాన్ కావాలనే డిమాండ్ పుట్టి, పెరిగి పెద్దదైంది.

డాక్టర్ అంబేద్కర్ 1940లో మత ఆధారిత పాకిస్తాన్ దేశం కోసం చేస్తున్న డిమాండ్ సందర్భంగా హెచ్చరిక చేస్తూ ఇలా అన్నారు – "ఒకవేళ హిందూ దేశం ఏర్పడినట్టయితే అది దేశానికి భారీ ప్రమాదం అవుతుందనడంలో అనుమానం లేదు. హిందువులు చెప్పేది ఏమైనా కావొచ్చు కానీ, హిందుత్వ అనేది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న భావనలకు ప్రమాదకరం. అలా చూసినపుడు ఇది ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం అనుగుణమైంది కాదు. ఎట్టి పరిస్థితిలోనైనా సరే హిందూ రాజ్యం ఏర్పాటును వ్యతిరేకించాలి."

నేటికి 77 ఏళ్ల క్రితం అంబేద్కర్ ఏ ప్రమాదం గురించి హెచ్చరించారో, అది నేడు భారతదేశం ముంగిట్లోకి శక్తిమంతంగా వచ్చి నిలుచుంది.

రాజ్యాంగంలో మార్పేమీ జరగనప్పటికీ, లాంఛనంగా మనది ఇంకా లౌకికవాద దేశమే అయినప్పటికీ, వాస్తవిక జీవితంలో మాత్రం హిందుత్వవాద శక్తులు సమాజం, సంస్కృతులతో పాటు అధికార పీఠంపైనా బలమైన పట్టు సాధించాయి.

## బీజేపీ విజయం

ఇటీవలి విధానసభ ఎన్నికల్లో – ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ భారీ విజయం సాధించిన తర్వాత, పాలనా తీరుతెన్నులు, ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు, సంఘ్ పెద్దలు చేస్తున్న ప్రకటనలను బట్టి చూస్తే ఇందులో ఇక అనుమానానికి తావే లేదు.

ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే, భారత్‌ను హిందూదేశంగా మారిపోకుండా అడ్డుకోవాలని అంబేద్కర్ భావించారు. ఎందుకంటే హిందూ జీవన నియమావళి స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు పూర్తిగా విరుద్ధమైందని ఆయన భావించేవారు.

హిందూ రాజ్యాన్ని ఆయన వ్యతిరేకించడానికి కారణం ముస్లింల పట్ల హిందువులు కలిగి ఉన్న ద్వేషానికే పరిమితం కాదు.

వాస్తవం ఏంటంటే, ఆయన 'హిందూ రాజ్యం ముస్లింల కన్నా, హిందువులకే ఎక్కువ ప్రమాదకరం' అని ఆయన భావించేవారు.

ఆయన హిందూ రాజ్యం దళితులకూ, మహిళలకూ వ్యతిరేకమైందని భావించారు. కుల వ్యవస్థను నిలబెట్టి ఉంచడానికి అనివార్యమైన షరతు మహిళలు కులాంతర వివాహాలు చేసుకోకుండా వారిని అడ్డుకోవడమే అని ఆయన స్పష్టంగా చెప్పారు.

☞ మిగతా 26వ పేజీలో

# హిందూ రాజ్యం అంటే?



**ప్రభాత్ పట్నాయక్**

బిజెపి హిందూ ఆధిపత్యవాద పార్టీ అని అందరికీ తెలుసు. ఫాసిస్టు తరహా సంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్‌కి ఇది రాజకీయ వేదిక. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాజ్యాన్ని నెలకొల్పడం లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ. అయితే బిజెపి భారత రాజ్యాంగం పరిధికి లోబడి వ్యవహరించాల్సి వుంటుంది. అందుకే ఈ హిందూ రాజ్యం లక్ష్యం గురించి ఆ పార్టీ బాహాటంగా ప్రస్తావించలేదు. అయినా ఆ లక్ష్యాన్ని అమలులోకి తెచ్చే దిశగా అది ఆచరణలో వ్యవహరిస్తోంది. ఇంతకీ వాస్తవంలో హిందూ రాజ్యం అంటే ఏమిటి? అది లౌకికతత్వాన్ని దెబ్బ తీస్తుందని, ప్రత్యేకించి ముస్లింలను రెండో తరగతి పౌరులుగా దిగజారుస్తుందని అందరికీ స్పష్టం అవుతోంది. అయితే చాలామంది హిందూ రాజ్యం అంటే హిందువుల ప్రయోజనాల కోసం పని చేస్తుందని అనుకుంటున్నారు.

కాని ఇది మౌలికంగానే పొరపాటు అవగాహన. హిందూ రాజ్యం అనేది ఒక నిరంకుశ రాజ్యం. అది ముస్లింలను, హిందువులను కూడా అణచివేస్తుంది. వారి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుంది. దేశ రాజకీయ చట్రంలో ముఖ్యమైన ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి, దేశీయ కార్పొరేట్ల యొక్క అవధులు లేని దోపిడీకి ముస్లింలనే గాక అత్యధికులు హిందువులను కూడా బలి చేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే హిందూ రాజ్యం అంటే గుత్తపెట్టుబడి చలాయించే నియంతృత్వం. అంతేగాని కొందరు అనుకుంటున్నట్టు హిందువుల ఆధిపత్యం ఎంతమాత్రమూ కాదు. హిందూ రాజ్యంలో హిందువులు ఇంతకు ముందుకన్నా మెరుగైన పరిస్థితుల్లో ఉంటారనుకోవడం భ్రమ. నిజానికి గుత్తపెట్టుబడి విచ్చలవిడి దోపిడీ ఫలితంగా హిందువుల పరిస్థితి కూడా ముస్లింల మాదిరిగానే దయనీయంగా దిగజారుతుంది.

ఈ దేశంలో గుత్తపెట్టుబడి ఎప్పటి నుంచో తన ఆధిపత్యాన్ని చలాయిస్తూనే వుంది. అటువంటప్పుడు ఈ దేశ రాజకీయాల పైన, సమాజం పైన మరింతగా తమ పట్టు పెంచుకోవాలని వారు ప్రయత్నించడం దేనికోసం? హిందూ ఆధిపత్య సిద్ధాంతంతో ఉన్న బిజెపిని ఎన్నికలలో బలపరచడం, దానికే ఎన్నికల్లో ప్రజలు ఓట్లేసేలా ఆ పార్టీకి అన్ని రకాలా తోడ్పాటునివ్వడం ఎందుకోసం?

గతం కన్నా ప్రస్తుత కాలంలో అంతర్జాతీయ పెట్టుబడిదారీ సంక్షోభం మన దేశ ఆర్థిక వ్యవస్థను ఎక్కువగా దెబ్బ తీస్తోంది. కార్పొరేట్ల వద్ద సంపద ఎంత ఎక్కువగా పోగుబడితే అంత ఎక్కువగా అది ప్రజల వద్దకు ప్రవహిస్తుందని ఇన్నాళ్ళూ చెప్పిన 'ట్రికిల్ డౌన్ సిద్ధాంతం' వట్టిదేనని ప్రజలకు అర్థమై చాలా రోజులైంది. జిడిపి వృద్ధి చెందితే ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కూడా బాగా పెరుగుతుందని, తద్వారా పేదల కోసం ఖర్చు చేయడానికి ఎక్కువ వీలు కలుగుతుందని 11వ పంచవర్ష ప్రణాళిక డాక్యుమెంటులో చెప్పిందంతా బూటకమేనని కూడా ప్రజలకు బోధపడింది. ఆదాయాల నడుమ వ్యత్యాసాలు, సంపదలో వ్యత్యాసాలు విపరీతంగా పెరిగిపోయాయి. సంక్షోభం ఫలితంగా గత ఐదు దశాబ్దాల కాలంలోనూ మనం ఎన్నడూ చూడనంత స్థాయికి నిరుద్యోగం ప్రబలింది. గ్రామీణ పేదరికం ఎంతగా పెరిగిందంటే దానికి సంబంధించిన వాస్తవాలు వెల్లడి కాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ శాంపిల్ సర్వే వివరాలను తొక్కిపట్టింది. 2011 నుంచి 2018 మధ్య కాలంలో గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి 9 శాతం మేరకు పడిపోయింది. ప్రస్తుత కరోనా మహమ్మారి రాకమునుపే ఈ దేశ ప్రజలను పీల్చి పిప్పి చేయడం అసాధారణ స్థాయికి చేరింది. కరోనాతో ఇంకా దుర్భరమైన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ప్రజలను పాత పద్ధతుల్లోనే పాలించడం, వారిని అదుపు చేయడం పాలకులకు సాధ్యం కావడంలేదు.

ఇంకొక సమస్య కూడా ఉంది. ఈ సంక్షోభాన్నుంచి బైటపడే మార్గం నయా ఉదారవాద చట్రం పరిధిలో ఎక్కడా కానరావడం లేదు. కాని ద్రవ్య పెట్టుబడి ఈ వాస్తవాన్ని గుర్తించడానికి సిద్ధంగా లేదు. అందుచేత అది మరింత ఉధృతంగా అవే నయా ఉదారవాద విధానాలను అమలు చేయాలని పట్టుబడుతోంది. కార్మిక సంఘాలను ఉనికిలో లేకుండా చేయాలని, గిరిజన భూములను మరింత సునాయాసంగా స్వాధీనం చేసుకోవాలని, మరింత ఎక్కువగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలని, మరింత ఎక్కువ మోతాదుల్లో ప్రభుత్వం నుంచి పెట్టుబడిదారులకు ఆర్థిక వనరులను బదలాయించాలని ద్రవ్య పెట్టుబడి వత్తిడి చేస్తోంది.

ద్రవ్య పెట్టుబడి కోరిన విధంగా చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంత నష్టమో ఆర్థిక విధానాలు తెలిసిన వారెవరైనా స్పష్టంగా గ్రహించగలరు. అందుకే బొత్తిగా ఆర్థిక పరిజ్ఞానం లేని ప్రభుత్వం,

తాను చెప్పినట్టల్లా తలాడించి అమలు చేసే ప్రభుత్వం ద్రవ్య పెట్టుబడికి ఇప్పుడు అవసరం. అలా అమలు చేస్తూనే ఆ విధానాలకు ప్రజానీకం మద్దతు తెలిపేలా చేయగల సామర్థ్యం ఉన్న రాజకీయ పార్టీ ద్రవ్య పెట్టుబడికి ఇప్పుడు కావాలి. ఈ లక్షణాలన్నీ అతికినట్టు బిజెపికి ఉన్నాయి. దానికి ఆర్థిక పరిజ్ఞానం శూన్యం. ద్రవ్య పెట్టుబడి ఆడమన్నట్టల్లా ఆడుతుంది. ఆ ద్రవ్య పెట్టుబడినే తెలివితక్కువగా "సంపద సృష్టికర్తలు"గా పరిగణిస్తుంది. అదే సమయంలో తన హిందూత్వ ఎజండాతో ఆ ద్రవ్య పెట్టుబడి దురాగతాన్నంతటినీ ప్రజలకు కనపడకుండా దాచిపెడుతుంది. ఈ హిందూత్వ ఇంతవరకూ ఏ ఒక్కరి కడుపునూ నింపలేక పోయింది. కాని అయోధ్యలో ఆలయానికి చేసిన భూమిపూజ వైపు యావద్దేశం దృష్టినీ మళ్ళించింది. ఇంకోవైపున ద్రవ్య పెట్టుబడికి అపారంగా రాయితీల వర్షం కురిపించింది.

గడిచిన కొద్ది వారాలలో బిజెపి-పాలిత రాష్ట్రాలలో కార్మికుల పని గంటలు రోజుకు 12 కు పెంచివేశారు. తద్వారా శతాబ్దాల తరబడి ప్రపంచవ్యాప్తంగా కార్మికులు చేస్తున్న పోరాటాన్ని తోసిరాజన్నారు. కొత్తగా నిర్మించబోయే ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులిచ్చే విధానాన్ని సడలించి వేశారు. నిబంధనలు నామమాత్రం చేశారు. పెట్టుబడిదారులకు రు. 1.45 లక్షల కోట్లు నేరుగా బదిలీ చేశారు. బొగ్గుగనులు వంటి సహజ వనరులకు సైతం ప్రైవేటీకరణను వర్తింపజేశారు. తద్వారా సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయోద్యమం ముందుకు తెచ్చిన ఒక ముఖ్యమైన డిమాండును నీరుగార్చారు. ఇప్పుడు రైల్వేలలోనూ ఈ విధానాన్నే అమలు చేయనున్నారు. పెట్టుబడిదారుల పరిస్థితి ఇంత సౌకర్యవంతంగా మున్నెన్నడూ లేదు. అదే సమయంలో, గిరిజనులతో సహా శ్రామిక ప్రజల పరిస్థితులు ఇంత దుర్భరంగా గతంలో ఎన్నడూ లేవు.

పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా మోడీ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలేవీ ఆర్థిక సంక్షోభ తీవ్రతను తగ్గించలేవు సరికదా, మరింత పెంచుతాయి. ఉత్పత్తి అయిన సరుకులను కొనేవారు లేకపోవడం ఈ సంక్షోభంలో ఒక ప్రధాన లక్షణం. ప్రభుత్వ చర్యలు ప్రజల కొనుగోలు శక్తిని పెంచకపోగా మరింత తగ్గిస్తాయి. దాంతో పరిస్థితి మరింత తీవ్రవమౌతుంది. పెట్టుబడిదారులకు చేసిన ఆర్థిక బదలాయింపుల వలన ప్రభుత్వం వద్ద ఖర్చు చేయగల నిధులు తరిగిపోతాయి. ద్రవ్యలోటు పెరగకుండా ఉండే పద్ధతిలో ఆ కొరవను పూడ్చుకోవాలంటే శ్రామిక ప్రజల మీద మరింత పన్నుల భారం మోపక తప్పదు. అంటే ఈ విధానాల ఫలితంగా శ్రామిక ప్రజలనుండి సంపద పెట్టుబడిదారీ వర్గానికి బదలాయించబడుతున్నది. ఎక్కువమంది వినియోగదారులు పేదలు. వారివద్ద నుండి సంపదను లాక్కుని పెట్టుబడిదారులకు బదలాయిస్తే మొత్తం మీద కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. అలా తమ వద్దకు చేరిన సొమ్మును ఆ పెట్టుబడిదారులేమైనా తిరిగి పెట్టుబడిగా మార్కెట్లో పెడతారా అంటే అదీ జరగదు. కొనుగోలుశక్తి తగ్గిపోతోంది గనుక కొత్త పెట్టుబడులు పెట్టరు. మొత్తంగా సంక్షోభం మరింత తీవ్రమౌతుంది. నయా ఉదారవాద చట్రంలో ఈ సంక్షోభానికి పరిష్కారం లేదు.

దీని పర్యవసానంగా ప్రజల్లో అసంతృప్తి రానున్న రోజుల్లో అంతకంతకూ పెరుగుతుంది. దానిని అదుపు చేయడానికి అంతకంతకూ ఎక్కువ అణచివేతకు పాలకులు పూనుకుంటారు. అదే సమయంలో ప్రజల దృష్టిని పక్కకు మళ్ళించే రామ మందిరం వంటి అంశాలు ముందుకు తెస్తారు. హిందూత్వ ఎజండాను మరింత దూకుడుగా ముందుకు తేవడం వెనుక అసలు కారణం ఇదే. ఇటువంటి ఎజండా అటు ప్రజల దృష్టిని ప్రధాన సమస్యల వైపు నుండి పక్కకు మళ్ళించడంతోబాటు శ్రామిక ప్రజలను విడదీస్తుంది. పరస్పర విద్వేషాలను రెచ్చగొడుతుంది. ఆర్థిక అంశాలపై అసంతృప్తి ఉన్నప్పటికీ మతపరంగా మెజారిటీగా ఉన్న హిందువులలో ఎక్కువమంది బిజెపికే వోట్లేసి దానిని అధికారంలో కొనసాగేలా చేస్తారు. అందుచేత హిందూ ఆధిపత్యవాదం ద్రవ్య పెట్టుబడికి అనుకూలమైన సిద్ధాంతం. ఇది హిందువులకు అనుకూలంగా ఉండే సిద్ధాంతం కాదు. ద్రవ్యపెట్టుబడికి, గుత్త పెట్టుబడికి సేవ చేసే సిద్ధాంతం.

హిందూ ఆధిపత్యవాదం అమలు జరిగితే ముస్లింలు ఉద్యోగాలకు, ఇతర అవకాశాలకు దూరంగా నెట్టివేయబడతారు గనుక ఆ మేరకు ఆ ఉద్యోగాలు, అవకాశాలు హిందువులకు దక్కుతాయి కదా. అటువంటప్పుడు హిందూ ఆధిపత్యవాదం హిందువులకు అనుకూలం కాదని ఎలా చెప్పగలం? అని కొందరు అడగవచ్చు. ఇప్పటికే ముస్లిం మైనారిటీలు ఉద్యోగాలలో, అవకాశాలలో ఎక్కువ శాతం చేజిక్కించుకుని గనుక ఉండినట్టయితే ఈ వాదన కొంతవరకు సహేతుకమౌతుంది. కాని ఇప్పటికే తమ జనాభా శాతానికి తగ్గట్టుగానైనా ఉద్యోగాలను, విద్యావకాశాలను, సంక్షేమ పథకాలను పొందలేకపోతున్న మన దేశ మైనారిటీల విషయంలో ఈ వాదన చెల్లదు.

హిందూ రాజ్యం వైపుగా పడుతున్న ప్రతి అడుగూ శ్రామిక ప్రజానీకం మీద ఎక్కుపెట్టిన దాడిలో భాగమే. ఈ దాడికి హిందువులు, ముస్లిములు అందరూ బలౌతారు. హిందూ రాజ్య భావన హిందువుల ప్రయోజనాల కోసం అన్న తప్పుడు అభిప్రాయం నుంచి ఎంత తొందరగా బైట పడగలిగితే దేశానికి అంత క్షేమం. ❑

# అఖండ హిందూ భారత్ - చరిత్రలో లేదు



**డాక్టర్ దేవరాజు మహారాజు**
సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్

గతంలో అఖండ భారత సామ్రాజ్యం వర్ధిల్లిందనీ, దాన్ని హిందూరాజులు పరిపాలించారని ప్రస్తుతం అధికారంలో ఉన్న పాలకులు చెపుతున్నారు. కాస్త చరిత్ర పరిజ్ఞానం ఉన్నవారికి నిజానిజాలు తెలుస్తాయి. భ్రమల్లో బతికేవారికి నిజాలు రుచించవు. పైగా, గతంలో లాగా అఖండ హిందూ రాజ్యాన్ని స్థాపించుకోవాల్సి ఉందని కూడా ఏలినవారు చెపుతున్నారు. విషయం స్పష్టం కావాలంటే కొంచెం చరిత్రలోకి వెళ్లాలి. బౌద్ధుడైన అశోకచక్రవర్తి, ముస్లిం అయిన ఔరంగజేబు క్రైస్తవులైన బ్రిటిష్ పాలకులు అఖండ భారత్‌ను స్థాపించారు. అది హిందూ భారత్ కాదు. అప్పటి హిందూ రాజులు తమలో తాము ఘర్షణ పడేవారు. యుద్ధాలు చేసుకునేవారు. కనీసం ఐదువందల మైళ్ళ విస్తీర్ణం గల రాజ్యాలను కూడా పాలించుకోలేక పోయారు. ఓడిపోయిన రాజ్యాన్ని, దానితో పాటు తమ ఆడవాళ్ళని శత్రువులకు ఇచ్చి చతికిలబడేవారు. చరిత్రలో హిందూ రాజులు అఖండ భారత్‌ను ఎప్పుడూ పాలించలేదు. అఖండ భారత్‌తో హిందువులకు సంబంధమే లేదు.

ఇప్పుడు అధికారంలో ఉన్న మన పాలకులేమిటి అబద్ధాలు చెబుతున్నారూ? అని ఆశ్చర్యపోనక్కర లేదు. వారి పుట్టుక, ఎదుగుదల, అధికారంలోకి రావడం అన్నీ అక్రమ మార్గంలోనే కాబట్టి, వారికి నిజాలు రుచించవు. ఒకప్పటి అఖండ భారత్ స్థాపిస్తామనడం ఉట్టి కోతలు తప్ప మరొకటి కాదు. ఇటు పాకిస్థాన్, అటు బంగ్లాదేశ్, కింద శ్రీలంక, పైన నేపాల్ ఇప్పుడు స్వతంత్ర దేశాలు. అవి భారత్‌లో అంతర్భాగాలు కాదు. అయ్యే అవకాశమూ లేదు. ఇప్పుడు మన పాలకులు చేయవల్సిందల్లా ఇరుగు పొరుగు దేశాలతో మంచి స్నేహ సంబంధాలు కాపాడుకోవడం. ఉన్నదాంట్లో గౌరవంగా, తలమానికంగా బతకడం. దేశ ప్రజల్ని కూడా తలెత్తుకుని సగర్వంగా బతికేట్లు చేయడం. ఇప్పటి యువతరానికి, రాబోయే తరాలకు తప్పుడు సమాచారం ఇచ్చినవారు చరిత్ర హీనులవుతారు. ఎంత దాచినా, ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా సత్యం – దాగదు. చరిత్రా మరుగున పడదు. మరుగున పడేద్దామని ప్రయత్నించినవారే.. మందబుద్ధులవుతారు. మరుగున పడి పోతారు. కాలం వారిని నిర్దాక్షిణ్యంగా అట్టడుగున పడేస్తుంది.

హిందూ, హిందూ – అని పూనకం పూనే వాళ్ళను చూస్తే జాలి కలుగుతున్నది. ఎందుకంటే, అది ఒక మతానికి చెందిన పదం కాదు. ఆ పదం ఎలా వాడుకలోకి వచ్చిందో తెలుసుకుంటే భ్రమలు తొలగిపోతాయి. మనది మొదటి నుంచి సంపన్న దేశం. అందువల్ల ముస్లింలు, బ్రిటిష్‌వారు మాత్రమే కాదు, గ్రీక్, డచ్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వంటివారు ఎంతో మంది ఈ దేశంలో చొరబడ్డారు. ఇక్కడి భారతీయ మూలవాసులు ఇతరులపై దండెత్తిన దాఖలాలు లేవు. ముస్లింలు ఈ దేశం తమది అనుకున్నారు. స్వంతం చేసుకున్నారు. ఇతరుల్లా కొల్లగొట్టి దోచుకుని వెళ్ళిపోవాలని అనుకోలేదు.

మొదటి సారి పొరుగువారు మన దేశానికి సింధూనది దాటి వచ్చారు. వారికి 'స' అక్షరం పలకడం రాదు. స–ను వారు 'హ'గ పలికారు. సింధూ నదిని – హిందూ నది అన్నారు. హిందూ నది ఉన్నదేశం కాబట్టి దీన్ని హిందూస్థాన్ అని అన్నారు. అంతే – హిందూ అనే పదానికి ఏ మతంతోనూ, ఏ శాస్త్రంతోనూ, ఏ ధర్మంతోనూ సంబంధం లేదు. సింధూ (హిందూ) నది ఉన్న దేశం కాబట్టి హిందూ దేశం అయ్యింది. ఈ విషయం వేద పండితులు చెప్పారు. చరిత్ర కారులూ చెప్పారు. తర్వాత కాలంలో ఆ హిందూ అనే పదం ఒక మతానికి వాడారు. ఆ మతాన్ని అనుసరించే వారంతా హిందువులు అని అనుకోసాగారు. నిజానికి 'హిందూ' అనే పదం ఏ మత గ్రంథంలోనూ లేదు. అందుకే కవి ఇక్బాల్ అన్నాడు "హిందీ హై హం – వతన్ హై హిందూస్థాన్ హమారా" అని!

హిందూ అనే పదానికి తరువాత కాలంలో మతం రంగు పులిమి, దాన్నొక మతపరమైన పదంగా మార్చారు. భారతదేశంలో ఉన్నవారంతా భారతీయులైనట్టే – హిందూ దేశంలో ఉన్నవారంతా హిందువులే. కానీ ఆ పదాన్ని దుర్వినియోగం చేశారు కాబట్టి, ఇప్పుడు మనం జాగ్రత్తగా వాడాల్సి ఉంటుంది. పదాలు వాడకాన్ని బట్టి అర్థాలు మారిపోతాయి. కంపు అంటే అసలు ఒకప్పుడు మంచి వాసన, సుగంధం అని అర్థం ఉండేది. ఇప్పుడు అర్థం మారిపోయింది కదా? బెంగాలీలు, ఒరియావారు వ–పలకరు. దాన్ని బ–గ పలుకుతారు. మనం రవీంద్ర అంటే వారు రబీంద్ర అంటారు. ఈ తేడాలు మనం గమనిస్తున్నవే. స–పలకలేని

పర్షియా వాడు హ-అంటే, మనం దాన్ని అర్థం చేసుకోవాలి కదా?

ముస్లిం పాలకులు ఈ దేశాన్ని కొన్ని శతాబ్దాల పాటు నిరాఘాటంగా పరిపాలించారు. ఇక్కడి వాటితో వారు ప్రభావితులయ్యారు. అలాగే వారి సంగీత, సాహిత్యాలతో ఇక్కడి వారినీ ప్రభావితం చేశారు. భారతీయ తాత్త్విక చింతనతో ప్రభావితులైన ముస్లిం సూఫీ కవులున్నారు. కొందరు ఉపనిషత్తుల్ని అనువదించారు. ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాల్ని ధ్వంసం చేయలేదని కాదు, ఇక్కడి కట్టడాల్ని కూల్చలేదని కాదు. కానీ, ఇక్కడి మతాల్ని, భాషా సంస్కృతిల్ని, ఆచార వ్యవహారాల్ని దెబ్బ తీయకుండా కొనసాగనిచ్చిందే ఎక్కువగా ఉంది. వారి పరిపాలన సాగుతున్న కాలంలోనే కబీర్, సూర్‌దాస్‌లతో పాటు, చైతన్య ప్రభువు, జయదేవుడు, మీరా లాంటి వారు కూడా మనగలిగారు. ఆదిశంకరుని అద్వైతంగానీ, రామానుజుని విశిష్టాద్వైతం గానీ వారి పరిపాలనా కాలంలోనే వర్థిల్లాయన్నది మరువకూడదు. ఇలాంటి ఎన్నెన్నో కారణాల వల్ల ఈ దేశంలో ఒక మిశ్రమ సంస్కృతి అవతరించింది. మిశ్రమ సంస్కృతి అయినా కూడా, సోదరభావంతో ఐకమత్యంగా జీవించడమే ఈ దేశపు ప్రత్యేకత! గొప్పతనం!!

"ఈ దేశం నాది. నేను భారతీయుణ్ణి" - అనే భావం ప్రతి ఒక్కరిలో ఉంది. అదే భావం వేల ఏండ్లుగా కొనసాగుతూ ఉంది. ఇప్పుడు ఈ దేశ పాలకులు పౌరసత్వ సవరణ చట్టం తేగానే అదే భావంతో మళ్లీ దేశమంతా ఒకే గొంతుతో వ్యతిరేకిస్తున్న సంగతి మన కండ్ల ముందే జరుగుతోంది. ఇక్కడ ఒక ముఖ్య విషయం చెప్పుకోవాలి. వేదపండితుడు, రచయిత అయిన దాశరథి రంగాచార్య ఆదిశంకరుని అద్వైతం గురించి ఒకమాట చెప్పారు.. ఇస్లాం మత ప్రభావంతోనే ఆదిశంకరుని అద్వైతం ఆవిర్భవించిందన్నారు. సంకుచిత మనస్కులు ఇలాంటి విషయాల్ని అంగీకరించలేరు. మొఘల్ చక్రవర్తి అక్బర్ మన పురాణాల్ని ఉరుదూలోకి అనువదింప జేయించుకున్నారని చరిత్ర చెపుతోంది.

ఇదంతా గతం. అయితే చదువూ సంస్కారమూ లేని వారికి ఈ విషయాలు బోధపడవు. మోసపూరితంగా అధికారంలోకి వచ్చి, అబద్ధాలు ప్రచారం చేస్తూ జనాన్ని మోసం చేసేవారి ఆటలు ఎల్లకాలమూ సాగవు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఏమైంది? చీపురు గుర్తు - స్వచ్ఛభారత్ చేసేసింది. కేజ్రీవాల్‌ను టెర్రరిస్ట్ అన్నారు. అతనికి పాకిస్థాన్‌తో సత్సంబంధాలున్నాయన్నారు. ప్రధాని, హోంమంత్రి తమ స్థాయిని మరిచి దిగజారుడు ప్రచారాలు చేశారు. ఢిల్లీ ఓటర్లు తెలివిగా ప్రవర్తించారు. తమకు పనిచేసే ముఖ్యమంత్రి కావాలనుకున్నారు అంతే! అసలు భారత రాజకీయాల్లోనే కేజ్రీవాల్ ఒక కొత్త ఒరవడిని ప్రారంభించారు. పని చేసి ఓట్లడిగారు. దొంగమాటలు చెప్పటమో, డబ్బులు పంచడమో కాకుండా ఆరోగ్యకరమైన రాజకీయాలకు తెరలేపారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. ప్రఖ్యాత సైన్సు రచయిత ఐసాక్ అసిమోవ్ ఓ మాట చెప్పారు.

"మూర్ఖత్వమే దేశభక్తిగా చలామణి అవుతున్న చోట వివేకవంతుడిగా ఉండటం చాలా ప్రమాదం" అని! దేశ ప్రగతికి పాటుపడటమే దేశభక్తి అని, ప్రజా సమస్యలు పరిష్కరించడమే దేశభక్తి అని ఢిల్లీ ముఖ్యమంత్రి కొత్త నిర్వచనాలిచ్చారు. ఇది ఇలా సాగుతూ ఉంటే, తమ తమ రాజకీయ పార్టీలలో నేరచరితులు ఎంత మంది ఉన్నారో, వారి మీద ఎలాంటి కేసులు ఉన్నాయో వెంటనే తెలియజేయాలని సుప్రీంకోర్టు అడిగింది. కుళ్లిపోయిన రాజకీయ వ్యవస్థని ప్రక్షాళనం చేయాల్సిన అవసరాన్ని అది ఎత్తి చూపింది. కింది స్థాయి వాళ్ళను పక్కనపెట్టి కేవలం పార్లమెంటు సభ్యుల విషయమే చూస్తే - అత్యధికంగా ప్రస్తుతం అధికారంలో ఉన్నవారిలోనే ఎక్కువమంది నేరగాళ్లున్నారు. ఆ పార్టీ వారిమీద చర్యలు తీసుకుంటుందా? ఊరికే ప్రకటిస్తే ఏం లాభం? 'పొగతాగడం హానికరం' అని సిగరెట్ డబ్బాల మీద హెచ్చరిక ముద్రిస్తే ఏం లాభం? తాగేవారు ఆపేస్తున్నారా? ఇదీ అలాగే అవుతుందేమో బహుశా..

ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ మైనర్ బాలికపై లైంగికదాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. విచారణ ఎదుర్కొంటున్నాడు. కేంద్రంలో హోంశాఖ సహాయమంత్రిగా చేసిన స్వామి చిన్మయానంద్ న్యాయ శాస్త్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థినిని లైంగికంగా వేధించాడు. ఆ అమ్మాయి చదివే కాలేజీకి అతను డైరెక్టరయి ఉండి ఆ పని చేశాడు. అతని వల్ల తనకు ప్రాణభయం ఉందని ఆ అమ్మాయి షాజహాన్‌పూర్ పోలీస్‌సేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇకనేం చిన్మయానంద్ ఆమెను కిడ్నాప్ చేయించాడు. ఇలా చెప్పుకుంటూ పోతే చిట్టా చాలా పెద్దదే అవుతుంది. అసలు వారి ఆలోచనా విధానం ఎలా ఉందో చూడాలనుకుంటే, వారు ఎవరిని జాతిపితగా, ఎవరిని జాతి హితగా, ఎవరిని జాతి రక్షక్‌గా గుర్తించుకుంటున్నారో గమనించాలి. జాతి పిత - అంటే వారి దృష్టిలో వినాయక్ దామోదర్ సావర్కర్!

☞ మిగతా 15వ పేజీలో

# జీడీపీ భారీ పతనం: ఇది 'రాజకీయ-సామాజిక సంక్షోభం'గా మారనుందా

డి.పాపారావు
ఆర్థిక విశ్లేషకులు



వస్తుసేవల పన్ను(జీఎస్టీ) అమలు సమయంలో రాష్ట్రాలను ఒప్పించేందుకు గాను కేంద్రం అప్పట్లో గట్టి హామీ ఇచ్చింది. ఈ కొత్త పన్ను విధానం వల్ల రాష్ట్రాల ఆదాయాలలో ఏ లోటూ రాదని కేంద్రం హామీ ఇచ్చింది.

ఒకవేళ జీఎస్టీ అమలు క్రమంలో ఏ రాష్ట్రానికైకా పన్ను ఆదాయం తగ్గిపోతే ఆ లోటు భర్తీ చేస్తామనీ కేంద్రం చెప్పింది.

ఇందుకోసం రాష్ట్రాల ఆదాయాలను నిర్ణయించేందుకు జీఎస్టీ అమలు ప్రారంభమైన 2017కు ముందు ఏడాది 2016ను ప్రాతిపదికగా తీసుకున్నారు.

రాష్ట్రాలకు 2016లో వచ్చిన ఆదాయం ప్రాతిపదికగా తీసుకుని అప్పటి నుంచి ఏటా 14 శాతం మేర పెరుగుదల ఉంటుందని కూడా ఒక అంచనాకు వచ్చారు.

ఏ కారణాలతోనైనా రాష్ట్రాలకు వాటి వార్షిక ఆదాయంలో పెరుగుదల ఈ 14 శాతం కంటే తక్కువగా ఉంటే, ఆ లోటును భర్తీ చేసే భారాన్ని జీఎస్టీ నిబంధనల కింద కేంద్రం తీసుకుంది.

జీఎస్టీ అమలు క్రమంలో నష్టపోతామన్న భయం ఉన్నా ఈ పరిహారం (14 శాతం) ప్రతిపాదనకు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు సంతృప్తి చెంది జీఎస్టీ అమలుకు అప్పట్లో సహకరించాయి.

ఈ 14 శాతం పరిహారం మొత్తాన్ని రాష్ట్రాలకు ఇవ్వగలిగేందుకుగాను కేంద్రం జీఎస్టీ పరిహార సెస్‌ను అమలులోకి తెచ్చింది.

ఈ పరిహార నిధి కోసం విలాస వస్తువులపై విధించే 28 శాతం జీఎస్టీ మీద ఆధారపడాలని నిర్ణయించారు.

జీఎస్టీ యంత్రాంగాన్ని, విధివిధానాలనూ నిర్వహించేందుకు జీఎస్టీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

ఈ కౌన్సిల్ ఆధ్వర్యంలోనే జీఎస్టీ విధి విధానాలు, అమలు, అలాగే అమలు క్రమంలో వచ్చే సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రాల ప్రతినిధులు, కేంద్రం చర్యలు తీసుకుంటుంటాయి.

కాగా, 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చాక 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల కాలంలో ఈ వ్యవస్థ సాఫీగానే సాగింది. అప్పటి వరకు కేంద్రానికి, రాష్ట్రాలకు జీఎస్టీతో లభించే ఆదాయాలు, జీఎస్టీ చట్టం పరిధిలో నిర్ణయించుకున్న మేరకు పంపిణీలకు సరిపోయాయి.

నిజానికి, 2018 ఆర్థిక సంవత్సరంలో 14 శాతం మేర ఆదాయం పెరుగుదల (2016 ప్రాతిపదికగా)లేని రాష్ట్రాలకు పరిహారం చెల్లించేందుకు ఉద్దేశించిన జీఎస్టీ పరిహార నిధికి రూ. 62,611 కోట్లు వసూలయ్యాయి. ఆ ఏడాది (2018)లో రాష్ట్రాలకు పరిహారంగా ఇవ్వాల్సింది రూ. 41,146 కోట్లే.

దీంతో ఆ ఒక్క ఏడాదే కేంద్రం వద్ద ఈ పరిహార నిధిలో సుమారు రూ.20 వేల కోట్లు మిగిలింది.

2019 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు ఈ నిధి కింద ఇవ్వాల్సిన మొత్తం 69,275 కోట్ల రూపాయలు కాగా, కేంద్రానికి వసూలైన మొత్తం 95,081 కోట్ల రూపాయలు. అంటే 2019లో కూడా ఈ నిధిలో కేంద్రానికి మిగులు లభించింది.

2018, 2019 ఆర్థిక సంవత్సరాలలో కలిపి కేంద్రానికి దక్కిన జీఎస్టీ పరిహార సెస్ నిధి మిగులు 47,271 కోట్ల రూపాయలు.

ఈ మిగులు నిధిని కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకుంది.

అయితే.. 2020 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పరిహార సెస్ నిధిలో లోటు మొదలైంది. 2020లో కేంద్రానికి పన్ను కింద లభించింది రూ. 95,444 కోట్లు కాగా కేంద్రం రాష్ట్రాలకు చెల్లించాల్సి పరిహారం మొత్తం రూ. 1,65,000 కోట్లు.

అంటే, 2020 మార్చి అనంతర కాలంలోని కోవిడ్ మహమ్మారి దాడి ఫలితంగా లాక్‌డౌన్లు, ఆర్థిక పరిస్థితిలోని కనీవినీ ఎరుగని పరిస్థితులకు ముందే 2019 ఆగస్టు నుంచి 2020 తొలి నెలల వరకూ ఆర్థిక మాంద్య స్థితి మెల్లగా ముదిరింది.

ఆ కారణంగానే కేంద్రం, రాష్ట్రాల ఆదాయాలలో లోటు ఏర్పడింది. ఈ క్రమంలోనే రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహార సెస్ బకాయిలతోపాటు ఇతర పంచాల్సిన పన్నులు, తదితర ఆదాయాల వాటాలను కూడా కేంద్రం సక్రమంగా చెల్లించలేని స్థితిలో పడింది.

దీనికితోడు, కోవిడ్ దెబ్బకు కేంద్ర పన్ను ఆదాయం, దానికి మించి రాష్ట్రాల పన్ను ఆదాయాలు కూడా దారుణంగా దెబ్బతిన్నాయి.

అనేక రాష్ట్రాలు ఉద్యోగుల జీతభత్యాలు కూడా చెల్లించలేని స్థితికి చేరాయి. ఇక ఈ రాష్ట్ర ప్రభుత్వాల మీద కోవిడ్ సమస్య తెచ్చిపెట్టిన అదనపు ఖర్చుల భారం మరింత. అదేసమయంలో వసూలు కావల్సిన పన్నుల ఆదాయం దారుణంగా పడిపోయింది.

దీంతో వివిధ రాష్ట్రాలు వనరుల కోసమై కేంద్రంపై ఒత్తిడిని పెంచసాగాయి.

దీనికోసమే, కేంద్రం 'హెలికాప్టర్ మనీ' రూపంలో(డబ్బును అదనంగా ముద్రించి, ఆర్థికంగా చితికిపోయిన ప్రజల చేతికి దానిని చేర్చి వారి కొనుగోలు శక్తిని కాపాడే చర్య) ప్రజలను ఆదుకోవాలని తెలంగాణ వంటి అనేక రాష్ట్రాలు కోరాయి.

అంతేకాదు, పలువురు ఆర్థిక వేత్తలు, పరిస్థితి తాలూకు తీవ్రతను అర్థం చేసుకున్న మేధావులు, అందరూ ప్రజల చేతిలోకి డబ్బును చేర్చే భారీ ఉద్దీపన అవసరాన్ని వక్కాణించారు.

చివరకు రాష్ట్రాలు ఉద్దీపన ఇవ్వకపోయినా కనీసం తాము అప్పులు తీసుకునే అవకాశాన్ని పెంచాలని కోరాయి. ఇందుకోసం రాష్ట్రాల అప్పులు వాటి వార్షిక స్థూల ఉత్పత్తిలో 3 శాతం దాటరాదని నిర్దేశించే ఎఫ్ఆర్బీఎం చట్టాన్ని సడలించి, రుణాలు తీసుకునే పరిమితిని 5 శాతానికి పెంచమని కేంద్రాన్ని కోరాయి.

దానికి కూడా నెలలపాటు తాత్సారం చేసిన కేంద్రం చివరకు, విద్యుత్ వంటి రంగాలలోనూ, నగరపాలక సంస్థల్లోనూ ప్రజలపై భారాలను పెంచే చర్యలను షరతుగా విధిస్తూ ఈ ఎఫ్ఆర్బీఎం పరిమితిని 5 శాతానికి పెంచింది. దీనిపై రాష్ట్రాల నుంచి తీవ్ర నిరసన వచ్చింది.

ప్రస్తుతం జీఎస్టీ పరిహారం చెల్లింపులు, ముందుగానే జీఎస్టీ నిబంధనలలో నిర్దేశించుకున్న మేరకు సక్రమంగా జరగాలంటూ రాష్ట్రాలు ఒత్తిడి పెంచే అంకం నడుస్తోంది. గత వారం చివర్లో జీఎస్టీ కౌన్సిల్ 41వ దఫా సమావేశంలో ఈ అంశమే కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదంగా మారింది.

ఇక్కడ జీఎస్టీ కౌన్సిల్, కేంద్రం ఎదుట రాష్ట్రాల డిమాండును పరిష్కరించేందుకు మూడు మార్గాలు ఉన్నాయి.

ఒకటి–కేంద్రం అప్పు చేసి, ఆ డబ్బుతో రాష్ట్రాలకు రావల్సిన పరిహారం మొత్తాన్ని తగిన మేర చెల్లించడం.

రెండు–రాష్ట్రాలే స్వయంగా రుణాలు తెచ్చుకోవడం.

మూడు– జీఎస్టీ కౌన్సిల్ నిధిని సమీకరించి రాష్ట్రాలకు ఇవ్వడం.

ఈ మార్గాల్లో రెండో దానిని అంగీకరించేందుకు రాష్ట్రాలు సుముఖంగా లేవు. పరిహార సెస్ తాలూకు లోటు భర్తీకి తమనే రుణాలు తెచ్చుకోమని చెప్పడం అన్యాయం అని, అన్ని రాష్ట్రాలతోపాటూ బీజేపీ పాలిత కర్ణాటక కూడా అభ్యంతరం తెలిపింది.

కానీ, అంతిమంగా ఈ పరిష్కారాన్నే కేంద్ర ప్రభుత్వం కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రాల ఎదుట ఉంచింది.

ఈ మార్గాంతరాల ప్రస్తావనకు ముందు, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ముందుకు తీసుకొచ్చిన వాదనలు చూడాలి.

ఆర్థిక మంత్రి వ్యాఖ్యల ప్రకారం జీఎస్టీ పరిహార నిధిలో లోటుకు రెండు కారణాలు ఉన్నాయి.

1. జీఎస్టీ అమలుదల తాలూకూ లోటుపాట్ల వల్ల పరిహార సెస్ నిధి సమీకరణలోని లోటు.

2.'విధి వక్రించడం' వల్ల ఏర్పడిన లోటు.

అంటే, కోవిడ్ మహమ్మారి వ్యాప్తి, పర్యవసానంగా ఆర్థిక పతనాలు ముందుగా ఎవరూ ఊహించలేనివి కాబట్టి ఈ విధంగా జరిగిన ఆదాయ పతనానికి కేంద్రం తప్పిదం ఏమీ లేదన్నది ఆమె వాదన. అంటే, నిర్మాలాసీతారామన్ 'నష్ట పరిహార చట్టం' (Tort Act) అనే న్యాయ శాస్త్రంలోని చట్టాన్ని ప్రభుత్వ విధి విధానాలకు తెచ్చి, ఆ మేరకు కేంద్రం పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదనే వాదన చేర్చారు.

పైగా అంతకు ముందే, అటార్నీ జనరల్ నష్టపరిహార సెస్ కింద ఆదాయ సమీకరణ తగినంత మేరకు లేకుంటే దానికి కేంద్రం పూచీకత్తు ఉండదని సెలవిచ్చారు. అంటే, రాష్ట్రాలు ఈ లోటు భర్తీకి అప్పులు సమీకరించుకోవాలన్నది ఆయన వాదన.

ఈ విధంగా ముందుకు తెచ్చిన తర్కంతో నిధుల సమీకరణకు, వనరుల లోటు భర్తీకి రాష్ట్ర ప్రభుత్వాల ముందు కేంద్రం రెండు మార్గాలను ఉంచింది.

దానిలో ఒకటి జీఎస్టీ చట్టం తాలూకూ లోపాల వలన ఏర్పడిన లోటు 97 వేల కోట్ల రూపాయల మేరగా అంచనా వేసుకుని, ఆ మేరకు రాష్ట్రాలు ఆర్బీఐ ద్వారా నిధులను సమీకరించుకోవచ్చు. ఈ రకమైన అప్పును రాష్ట్రాలు తీర్చనవసరం లేదని నిర్మాలా సీతారామన్ చెప్పారు.

రెండో మార్గంగా రాష్ట్రాలే స్వయంగా మార్కెట్ల నుంచి నిధులు సమీకరించుకుంటే 2 లక్షల 35 వేల కోట్ల రూపాయల మేరకు తమ సొంత బాధ్యతతో సేకరించుకోవచ్చు అని ఆమె చెప్పారు.

కాగా, ప్రస్తుతం నడుస్తోన్న 2020–21 ఆర్థిక సంవత్సర కాలానికి రాష్ట్రాలకు ఏర్పడే నష్టపరిహార సెస్ తాలూకు లోటు 3 లక్షల కోట్ల మేరకు ఉంటుందని అంచనా. అదీ కథ.

అంటే, స్థూలంగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ చట్టం తెచ్చిన నాటి తన వాగ్దానాలను తుంగలో తొక్కి, నైతిక బాధ్యతను పక్కనపెట్టి, రాష్ట్రాలను మరింత అప్పులతో కుంగిపొమ్మని సెలవిచ్చింది.

ఇక, తానిచ్చిన ఈ ప్రత్యామ్నాయాలలో ఒకదానిని ఎంచుకునేందుకు రాష్ట్రాలకు వారం రోజుల గడువు ఇచ్చింది.

కాగా, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం వాదనతో తీవ్రంగా విభేదిస్తున్నాయి. ఆ మేరకు ఆగస్టు 31న పలు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సమావేశం అయ్యారు. వారి వాదన ప్రకారం కేంద్రమే స్వయానా నిధులు సమీకరించడం సులువు. ఎందుకంటే రాష్ట్రాలకు సొంతంగా ఆదాయం సమకూర్చుకునే మార్గాలేవీ లేవు. కేంద్రానికి మాత్రం ఈ విషయంలో విచక్షణాధికారాలు, నిర్ణయాధికారాలు ఉన్నాయి.

ఉదాహరణకు కేంద్రం తానే స్వయంగా ఆర్బీఐ నుంచి నిధులు సమీకరించి రాష్ట్రాలకు పరిహార సెస్ పూర్తి స్థాయిలో అందిస్తే, ఆ డబ్బును కేంద్రం మానిటరైజ్ చేసే అవకాశం ఉంది. అంటే, రిజర్వ్ బ్యాంక్ ఆ డబ్బును ముద్రించి కేంద్రానికి అందిస్తుంది. దీనివలన కేంద్రం తాలూకు ద్రవ్యలోటులో పెరుగుదల కూడా ఉండదు.

అలా కాకుండా, రాష్ట్రాలే స్వయంగా అప్పులు చేసుకుంటే దానివలన వాటి ఎఫ్ఆర్బీఎం పరిమితి అంచులకు చేరుతుంది. కేంద్రమే అప్పు చేసి రాష్ట్రాలకు నిధులు అందిస్తే, దానివలన ఆ అప్పుల తాలూకు వడ్డీ భారం 2 శాతం మేరకు తక్కువ ఉండే అవకాశం ఉంది.

ఈ విధంగా కేంద్రం స్వయంగా అప్పు చేయడం, దాని బాధ్యత ప్లస్ అందరికీ వెసులుబాటుగా ఉండే మార్గం కూడా అని రాష్ట్రాల వాదిస్తున్నాయి.

ఇక చివరగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విషయానికే వస్తే, తెలంగాణలో లాక్‌డౌన్ సమయంలో ఒక నెలలో(ఏప్రిల్) ఆదాయం కేవలం 500 కోట్ల రూపాయలే ఉంది. కాగా, నిజానికి సాధారణ స్థితిలో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం 5 వేల కోట్ల రూపాయల వరకూ ఉంటుంది. ఇలా, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పడిపోయింది.

కోవిడ్ అనంతర కాలంలో కూడా పరిస్థితి పెద్దగా మెరుగుపడింది లేదు. లాక్‌డౌన్ కాలంలో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా చెల్లించలేని స్థితికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లాంటి అనేక రాష్ట్రాలు పడిపోయాయి. నేటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు పెద్దగా కోలుకుందేమీ లేదు.

ఏపీ విషయానికి వస్తే గతంలో చాలాకాలం నుంచి కేంద్రం నుంచి రావల్సిన నిధులు రావడం లేదనేది ఆ రాష్ట్రం ఆరోపణ.

దీంతోపాటూ టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల కోట్ల రూపాయల మేరకు ఆ రాష్ట్రం అప్పులపాలై ఉంది.

తర్వాత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు తెచ్చిన అప్పులు కూడా తోడై, ప్రస్తుతం ఆ రాష్ట్రం అప్పుల భారం 3 లక్షల కోట్లు దాటిపోయింది. దాంతో ఏపీ ఆర్థిక పరిస్థితి దినగండం నూరేళ్లాయుష్షుగా మారింది.

మరోవైపు రాష్ట్రంలో ఆదాయ సమీకరణ మార్గాలు కూడా తక్కువే. ఏపీ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. ఇక్కడ స్థూల ఉత్పత్తిలో 34 శాతం వాటా వ్యవసాయానిదే. ఈ రంగం నుంచి ప్రభుత్వానికి ఏ పన్నుల ఆదాయమూ రాదు. మరోవైపు సరకు ఉత్పత్తి రంగం రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 20 శాతానికి కాస్త పైనుంది. అంటే ఈ రంగం నుంచి కూడా పెద్దగా పన్నుల వసూళ్లు ఉండదు. ఇక మూడోది సేవారంగం. రాష్ట్రంలో ఇది ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది.

విభజనలో హైదరాబాద్‌ను కోల్పోయిన అనంతరం ఏపీ ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. కాబట్టి ఈ స్థితిలో ఆ రాష్ట్రాన్ని ఆదుకునే భారం, దాన్ని ఆర్థికంగా నిలబెట్టే బాధ్యత కేంద్రంపై చాలా ఉంది. కానీ ఆ దిశగా కేంద్రం పెద్దగా సహకరిస్తున్న దాఖలాలు లేవు.

చివరగా, ఇవాళ విడుదలైన స్థూల జాతీయోత్పత్తి గణాంకాలు మన వృద్ధిరేటు మైనస్ 23 శాతానికి పడిపోయిందని చెబుతున్నాయి. అంటే ఇది ఈ మధ్య కాలంలో రిజర్వ్ బ్యాంక్, మెకన్జీ సంస్థ, ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ అంచనాలను కూడా మించిపోయింది.

ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా నిరుద్యోగం, ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలలో నిరుద్యోగం కూడా నేడు తీవ్రంగా పెరిగిపోయింది. ప్రస్తుతం దేశంలోని నగరాలు పూర్తి సంక్షోభంలో ఉండగా, గ్రామీణ ప్రాంతాలు మాత్రం కొంతమేరకు మెరుగ్గా ఉన్నట్లు కనిపిస్తోంది.

ఎందుకంటే ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సీజన్ నడుస్తోంది. దీనివల్ల రైతులకు ఆదాయంతోపాటూ, కూలీలకు పని దొరుకుతోంది. వీటికి అదనంగా కేంద్రం బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులకు కేటాయించిన రూ. 61 వేలకోట్లకు అదనంగా, ఇటీవల మరో రూ. 40 వేల కోట్లను ఇవ్వడం గ్రామీణ కూలీలకు అనుకూలించింది. కాబట్టి ప్రస్తుతానికి గ్రామీణ ప్రాంతాలు మెరుగ్గా ఉన్నాయి.

కానీ, ఈ పరిస్థితి ఎంతకాలం నిలబడగలదు అనేది ప్రశ్నార్థకమే. ఎందుకంటే త్వరలో వ్యవసాయ సీజన్ ముగియనుంది. అంతేకాదు, వరి, చెరకు పంటలను మినహాయిస్తే మిగతా పంటలకు ప్రస్తుతం పెద్దగా గిట్టుబాటు ధర లభించడం లేదు. పైగా దేశంలో ఉత్పత్తి భారీగా పెరగడం వల్ల సరఫరా పెరిగి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీనివలన రైతులు గిట్టుబాటు ధరలు దొరక్క నష్టపోయే అవకాశాలు కూడా ఉన్నాయి.

అలాగే, జాతీయ ఉపాధి హామీ పథకానికి కేటాయించిన మొత్తం నిధుల్లో 70 శాతం మేరకు జూలై నెల నాటికి ఖర్చయి పోయాయి. ఇక ఈ ఏడాది మిగిలిన ఐదారు నెలలకు 30 శాతం నిధులు మాత్రమే మిగిలాయి. కాబట్టి కేంద్రం మరిన్ని నిధులు కేటాయించకుండా ఈ పథకం ప్రభావవంతంగా అమలుచేసే అవకాశాలు లేవు.

ఏదేమైనా, కరోనాకు ముందే దేశంలో మొదలైన ఆర్థిక మాంద్య స్థితి, ఇప్పుడు కోవిడ్ దెబ్బకు అధఃపాతాళానికి దిగజారిపోయింది. ఈ పరిస్థితి ఇప్పటికిప్పుడే మారదని, దానికి చాలా కాలం పడుతుందనేది రిజర్వ్ బ్యాంక్ సహా, ఆక్స్‌ఫర్డ్ లాంటి సంస్థలు, ఇతరత్రా పరిశీలకులు కూడా చెబుతున్నదే.

అంటే, రానున్న కాలం మన దేశానికి, మన దేశంలోని సామాన్యులకు కనీవినీ ఎరుగని గడ్డుకాలమే. ఈ స్థితిలో ప్రభుత్వం ప్రజలను ఆదుకునే దిశగా (ద్రవ్యలోటు వంటి వాటిని పట్టించు కోకుండా) తక్షణ చర్యలు తీసుకోకుంటే, ప్రస్తుతం దేశంలో ఉన్న ఆర్థిక సంక్షోభం, రాజకీయ-సామాజిక సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది. కాబట్టి, ప్రస్తుతం రాష్ట్రాలు మొరపెట్టుకుంటున్న విధంగా వాటి ఆర్థిక స్థితిని జీఎస్టీ నిధుల రూపంతో సహా, ఇతరత్రా కూడా కేంద్రం ఆదుకోవాలి.

(ఈ వ్యాసంలో అభిప్రాయాలు రచయిత వ్యక్తిగతం) ❑

బీబీసీ కోసం

---

## అఖండ హిందూ భారత్ - చరిత్రలో లేదు

**(11వ పేజీ తరువాయి)**

గాంధీ హత్య కేసులో తృటిలో శిక్ష తప్పించుకున్నవాడు. అలాగే జాతిహిత అంటే నాథూరామ్ గాడ్సే. గాంధీజీని హత్య చేసినవాడు. ఇక జాతిద్రోహి ఎవరూ? అని అడిగితే ఆరెస్సెస్ - బీజేపీ వర్గాలన్నీ ముక్తకంఠంతో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అనే చెపుతాయి. ఎందుకంటే ఆయన స్వాతంత్ర్య సమరంలో పదేండ్లకు పైగా జైలుశిక్ష అనుభవించారు. దేశంలో వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనాశాలలు, ప్రాజెక్టులు ప్రారంభించారు. అందుకే ప్రపంచం ఆయనను ఆధునిక భారతదేశ నిర్మాతగా గుర్తించింది. ఆ కారణంగా ఆయనను వీరు జాతిద్రోహిగా చిత్రిస్తున్నారు. ఇదే విషయం మీద ప్రముఖ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు సెప్టెంబర్ 8, 1962 నాటి తన సంపాదకీయంలో ఇలా రాశారు.. "నెహ్రూ తనకు శత్రువు అనే వ్యక్తి భారత ప్రజాస్వామ్యానికి శత్రువు. యుగ ధర్మానికి శత్రువు. సమతా సౌభ్రాతృత్వాల ప్రాతిపదికగా గల నవ సమాజ నిర్మాణ లక్ష్యానికి శత్రువు. ప్రగతికి శత్రువు. భవిష్యత్తుకే శత్రువు" అని! నేటి పాలకులకు ఈ విషయం అర్థమౌతుందా?

మరోవైపు లక్షల కోట్లు దేశ సంపదను దోచుకుపోయిన వారిని దేశ సరిహద్దులు దాటించిన మన చౌకీదార్‌ని మాత్రం జాతిరక్షక్‌గా అభివర్ణించుకుంటున్నారు. కార్పొరేట్ మిత్ర, రాజ్యాంగ విధ్వంసక, గుజరాత్ నరమేధ కిరీటి, విద్వేష ప్రసంగి లాంటి ఎన్ని బిరుదులైనా మన ఈ జాతి రక్షక్‌కు సరిపోవు. ఎత్తయిన విగ్రహాలు తయారు చేయించే దేశంగా ఆయన మన దేశాన్ని నిలబెట్టారు. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సెలైన్ బాటిల్స్ లేకుండా, అవి తగిలించే స్టాండ్‌లు లేకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. దేశంలోని సామాన్యుల్ని మలమల మాడుస్తూ - గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో దేశాన్ని అట్టడుగున నిలుపడానికి కృషి చేస్తున్నారు. ఇంతా చేసి దేశాన్ని ఎప్పుడెప్పుడు అఖండ హిందూ రాజ్యం చేద్దామా? అని ముంగేరీలాల్ లాగా కలలు కంటున్నారు. ❑

# జీడీపీ : ఎలా లెక్కకడతారు.. ఈ గణాంకాలు ఎందుకంత కీలకం

నిధి రాయ్
బీబీసీ ప్రతినిధి

భారతదేశానికి సంబంధించి 2020 ఏప్రిల్ నుంచి జూన్ వరకు స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) గణాంకాలను కేంద్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేయనుంది.

ఆర్థిక వృద్ధి గత కొన్నేళ్లుగా మందగిస్తోందన్న విషయం మనందరికీ తెలుసు. అయితే రాబోయే గణాంకాలు మాత్రం దశాబ్దాలలోనే అత్యంత దారుణంగా ఉండొచ్చు. ఎందుకంటే కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రించటానికి లాక్‌డౌన్ అమలు చేసింది ఏప్రిల్ - జూన్ నెలల్లోనే.

ఈ కాలంలో ఆహార సరఫరా, అత్యవసర సేవలు మినహా ఎలాంటి ఆర్థిక కార్యకలాపాలూ సాగలేదు.

రాబోయే జీడీపీ గణాంకాలు చాలా ముఖ్యమైనవి. కారణం.. దేశంలో కోవిడ్-19 విజృంభణ మొదలైన తర్వాత ఆర్థిక వృద్ధి తీవ్రంగా మందగించిందని అధికారికంగా నిర్ధరించే గణాంకాలవి.

### ఇంతకీ జీడీపీ అంటే ఏమిటి?

ఒక నిర్దిష్ట సంవత్సరంలో దేశంలో ఉత్పత్తి అయిన సరకులు, సేవల మొత్తం విలువను స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) అంటారు.

"జీడీపీ అనేది ఒక విద్యార్థి మార్కుల జాబితా వంటిది"ని రీసెర్చ్ అండ్ రేటింగ్స్ సంస్థ కేర్ రేటింగ్స్‌కు చెందిన ఆర్థికవేత్త సుశాంత్ హెగ్డే అభివర్ణిస్తారు.

ఒక సంవత్సరంలో ఒక విద్యార్థి పనితీరును, ఆయా పాఠ్యాంశాల్లో సదరు విద్యార్థి బలాబలాలను మార్కుల జాబితా ఎలా చెబుతుందో.. దేశ ఆర్థిక కార్యకలాపాల స్థాయిని, అందులో వివిధ రంగాలు, అంశాల బలాబలాలను జీడీపీ ప్రతిఫలిస్తుంది.

ఒక ఆర్థిక సంవత్సరంలో ఆర్థికవ్యవస్థ బాగుందో లేదో ఇది చూపుతుంది. మందగమనం ఉన్నట్లు జీడీపీ గణాంకాలు చూపుతున్నట్లయితే దానర్థం దేశ ఆర్థికవ్యవస్థ మందగిస్తుందని. అంటే దేశంలో గడచిన సంవత్సరంతో పోలిస్తే దేశంలో తగినన్ని సరకులు, సేవలు ఉత్పత్తి కావటం లేదని.

భారతదేశంలో సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సీఎస్ఓ) ప్రతి ఏటా నాలుగు సార్లు జీడీపీని లెక్కిస్తుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కించే ఈ గణాంకాలను ఆర్థిక పరిభాషలో త్రైమాసిక గణాంకాలు అంటారు.

అలాగే ప్రతి ఏటా వార్షిక జీడీపీ వృద్ధి గణాంకాలను కూడా సీఎస్ఓ విడుదల చేస్తుంది.

భారత్ వంటి అల్పాదాయ, మధ్యాదాయ దేశాలు.. పెరుగుతున్న జనాభా అవసరాలు తీరటానికి ప్రతి ఏటా అధిక జీడీపీ సాధించటం ముఖ్యమని భావిస్తారు.

### జీడీపీని ఎలా లెక్కిస్తారు?

జీడీపీని లెక్కించాలంటే నాలుగు విస్తృత అంశాలను కూడాలి.

మొదటిది "వినిమయ వ్యయం" - అంటే దేశ జనాభా వస్తువులు, సేవలను కొనుగోలు చేయటానికి చేసిన మొత్తం ఖర్చు.

రెండోది "ప్రభుత్వ వ్యయం". మూడోది "పెట్టుబడి వ్యయం" - అంటే ఒక ఫ్యాక్టరీ లేదా సముద్రం మీద వంతెన వంటి మౌలిక సదుపాయాల నిర్మాణానికి చేసిన వ్యయం.

నాలుగోది.. చివరిది నికర ఎగుమతుల విలువ - అంటే ఎగుమతులు - దిగుమతుల మధ్య తేడా మొత్తం.

జీడీపీని నామినల్ జీడీపీ, రియల్ జీడీపీ అని రెండు రకాలుగా లెక్కిస్తారు.

నామినల్ జీడీపీలో.. అన్ని వస్తువులు, సేవల విలువను ప్రస్తుత ధరలతో (జీడీపీని లెక్కించిన సంవత్సరపు ధరలతో) లెక్కిస్తారు.

బేస్ ఇయర్ (పోల్చటానికి ఉపయోగించిన సంవత్సరం) ప్రకారం ద్రవ్యోల్బణాన్ని (ధరల పెరుగుదలను) సవరించినపుడు రియల్ జీడీపీ - అంటే నిజ జీడీపీ లభిస్తుంది. ఒక ఆర్థిక వ్యవస్థలో వృద్ధి గురించి మనం మాట్లాడుకునేటపుడు ఈ రియల్ జీడీపీ గురించే మాట్లాడతాం.

జీడీపీ గణాంకాలను ఎనిమిది రంగాల నుంచి సేకరిస్తారు. అవి:

- ✦ వ్యవసాయ రంగం
- ✦ తయారీ రంగం
- ✦ విద్యుత్, గ్యాస్ పంపిణీ
- ✦ గనుల తవ్వకం, అడవులు, చేపల వేట
- ✦ హోటల్, నిర్మాణం, వాణిజ్యం, సమాచార సంబంధాలు
- ✦ బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, బీమా

- ✦ వాణిజ్య సేవలు
- ✦ సామాజిక, ప్రజా సేవలు

## జీడీపీ ఎందుకంత ముఖ్యం?

ప్రభుత్వం, ప్రజలు నిర్ణయాలు తీసుకోవటానికి పరిగణన లోకి తీసుకునే కీలకమైన అంశాల్లో జీడీపీ కూడా ఒకటి.

జీడీపీ వృద్ధి చెందుతున్నదంటే దానర్థం ఆర్థిక కార్యకలాపాల విషయంలో దేశం బాగా పనిచేస్తోందని. ప్రభుత్వ విధానాలు క్షేత్ర స్థాయిలో ఫలిస్తున్నాయని. అవి సరైన దిశలో పయనిస్తున్నాయని.

జీడీపీ మందగించటం, తిరోగమనంలోకి జారిపోవటం జరుగుతున్నదంటే దానర్థం.. ఆర్థికవ్యవస్థ పునరుత్తేజం చెందటానికి తోడ్పడేలా ప్రభుత్వం తన విధానాలను మెరుగుపరచుకోవాల్సి ఉంటుందని.

ప్రభుత్వమే కాకుండా వ్యాపారవేత్తలు, స్టాక్ మార్కెట్ మదుపుదారులు, వివిధ విధాన నిర్ణేతలు కూడా నిర్ణయాలు తీసుకోవటానికి జీడీపీ గణాంకాలను ఉపయోగించుకుంటారు.

ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తున్నట్లయితే వ్యాపార సంస్థలు మరింత ఎక్కువగా డబ్బు పెట్టుబడులుగా పెట్టి ఉత్పత్తి పెంచుతారు. దానివల్ల భవిష్యత్తు మరింత ఆశావహంగా కనిపిస్తుంది.

కానీ.. జీడీపీ గణాంకాలు నిరాశాజనకంగా ఉన్నట్లయితే ప్రతి ఒక్కరూ తమ డబ్బులను జాగ్రత్త చేసుకుంటారు. ఖర్చు తగ్గిస్తారు, పెట్టుబడులు తగ్గిస్తారు. దానివల్ల ఆర్థిక వృద్ధి మరింత మందగిస్తుంది. ఈ పరిస్థితుల్లో వ్యాపారాలకు, వ్యక్తులకు సహాయ పథకాలు ప్రకటించటం ద్వారా ప్రభుత్వం మరింత ఎక్కువగా డబ్బులు ఖర్చుపెట్టాలని భావిస్తారు. దానివల్ల సదరు వ్యాపార సంస్థలు, వ్యక్తులు మరింత ఎక్కువగా ఖర్చు పెట్టటం జరిగి.. దేశ ఆర్థిక వ్యవస్థకు చలనం వస్తుందని ఆశిస్తారు.

అలాగే.. ఆర్థికవ్యవస్థకు సాయపడటానికి అవసరమైన విధానాలను రూపొందించటానికి విధానకర్తలు జీడీపీ గణాంకాలను ఉపయోగించుకుంటారు. భవిష్యత్ ప్రణాళికలను నిర్ణయించటానికి ఒక కొలమానంగా జీడీపీ గణాంకాలు ఉపయోగపడతాయి.

## జీడీపీతో పూర్తి చిత్రం కనిపించదు

మన దేశంలో వృద్ధిని లెక్కించటానికి జీడీపీలో అనేక రంగాలను పరిగణనలోకి తీసుకుంటున్నప్పటికీ.. అన్ని రంగాలూ లెక్కలోకి రావటం లేదు.

అసంఘటిత రంగంలోని పరిస్థితి జీడీపీ గణాంకాల్లో ప్రతిఫలించదని నిపుణులు నమ్ముతారు.

"భారతదేశ ఉపాధిలో 94 శాతంగా ఉన్న అసంఘటిత రంగాన్ని జీడీపీ గణాంకాలు లెక్కలోకి తీసుకోవు" అని సీనియర్ ఆర్థికవేత్త ప్రొఫెసర్ అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

"జీడీపీ ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నట్లయితే.. సంఘటిత రంగాల కన్నా అసంఘటి రంగం పరిస్థితి మరింత దారుణంగా ఉందని అర్థం" అంటారాయన. అంటే.. ఒకవేళ జీడీపీ మైనస్ పది శాతం నుంచి మైనస్ 15 శాతంగా ఉందంటే.. అసంఘటిత రంగం పరిస్థితి మైనస్ 20 శాతం నుంచి మైనస్ 30 శాతానికి దిగజారిందని అర్థం చేసుకోవాలి.

స్పష్టంగా చెప్తే.. సంఘటి రంగం ఎలా పనిచేస్తోందనేది జీడీపీ గణాంకాలు ప్రతిఫలిస్తాయి. కానీ దేశంలో పేద ప్రజలు ప్రధానంగా ఉండే అసంఘటిత రంగాన్ని పూర్తిగా విస్మరిస్తాయి.

సంఘటిత రంగం ఇబ్బందుల్లో ఉన్నట్లయితే.. అసంఘటిత రంగంలోని తీవ్ర పరిస్థితులను గుర్తించటం చాలా కష్టం.

రాబోయే 2021-22 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 4 శాతం నుంచి 15 శాతం వరకూ కుదించుకుపోతుందని వివిధ ఆర్థిక సంస్థలు, నిపుణులు చెప్తున్నారు.

ఆర్థికవ్యవస్థ తిరోగమన పరిస్థితుల్లోకి జారిపోతుందని భారత రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. అయితే జీడీపీ ఎంతమేరకు కుదించుకుపోతుందనేది ఆర్‌బీఐ చెప్పలేదు.

భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే గత నాలుగేళ్లుగా మందగమనంలో ఉందనేది గమనంలో ఉంచుకోవాలి.

2016-17లో జీడీపీ వృద్ధిరేటు 8.3 శాతంగా ఉంటే.. 2017-18లో అది 7 శాతానికి తగ్గిపోయింది. 2018-19లో అది మరింతగా దిగజారి 6.1 శాతానికి పడిపోయింది. ఇక 2019-20లో ఏకంగా 4.2 శాతానికి పతనమైంది.

"ఈ సవాలును కోవిడ్ సంక్షోభం ద్విగుణీకృతం చేస్తోంది. ఆర్థికవృద్ధిని ఉత్తేజపరిచే అత్యవసర చర్యలు లేకపోవటం వల్ల.. భారతదేశం దశాబ్ద కాలం పాటు ఆదాయాలు, జీవిత నాణ్యతలో స్తబ్దతను ఎదుర్కొనే ముప్పు ఉంది" అని మెకిన్సీ ఇటీవలి నివేదిక చెప్తోంది.

కరోనా మహమ్మారితో పరిస్థితి మరింత దిగజారిందని.. భారతదేశం కోలుకోవటానికి ఇతర ఆసియా దేశాలకన్నా మరింత ఎక్కువ కాలం పడుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ❑

# "లాల్- నీల్ ఐక్యత కోసం" వాట్సప్ గ్రూపు "అవగాహనా పత్రం"

- రేకా కృష్ణార్జునరావు



**తొలి మాట :**

లాల్- నీల్ శక్తుల మధ్య ఐక్యతను ఎలా ఏర్పరచుకోవాలి,

ఆ ఐక్యతకు వున్న అవరోధాలను ఎలా అధిగమించాలి, బలమైన ఐక్యతను ఎలా ఏర్పరచుకోవాలి అని చర్చించుకునే గ్రూపు మాత్రమే ఇది.

అంటే, లాల్- నీల్ శక్తుల మధ్య ఐక్యత అవసరమా, అనవసరమా; సాధ్యమా, అసాధ్యమా అని చర్చించే వాట్సప్ వేదిక ఇది కాదు.

కనుక ఆ రెండు శక్తుల ఐక్యత వద్దనుకునేవారు, సాధ్యం కాదనుకునేవారు, పొరపాటుగా ఈ గ్రూపులోకి చేరివుంటే దయచేసి స్వచ్ఛందంగా వైదొలగండి. మీకు-మాకు శ్రమ తప్పుతుంది.

లాల్-నీల్ శక్తుల మధ్య ఐక్యత కోసం ఏర్పాటు చేయబడిన విశాల వుమ్మడి వాట్సప్ వేదిక ఇది.

**గ్రూప్ లక్ష్యం :**

వర్గ- కుల రహిత సమ సమాజం.

**గ్రూప్ కర్తవ్యం :**

లాల్- నీల్ ఐక్యత కోసం భావజాల రంగంలో కృషి.

**రెండు మౌలిక పదాల వివరణ :**

**లాల్ :** దోపిడీని, ప్రత్యేకించి పెట్టుబడి దారివర్గ దోపిడీని రద్దు చేసి సమసమాజంను సాధించవలసిన చారిత్రక అవశ్యకత, ఆ సమాజం సాధించేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ సిద్ధాంతం, సాధారణంగా అందరిచే పిలువబడే మార్క్సిజంకు సంకేతంగా సర్వత్రా ఆమోదించిన పదం "లాల్". మనం దానిని ఆ అర్థంలోనే అంగీకరించి స్వీకరిస్తున్నాం.

**నీల్ :** నిచ్చెన మెట్ల వర్ణ-కుల వ్యవస్థ ప్రపంచంలో హిందువులలో మాత్రమే ఉంది. అంటరానితనం ఈ వ్యవస్థ యొక్క అత్యంత అమానుష అంశం. ఈ వర్ణ-కుల వ్యవస్థ నిర్మూలన, అంబేద్కర్ వాద ఆలోచనల ప్రతీక - "నీల్".

**లాల్- నీల్ శక్తుల ఐక్యతా అవగాహన :**

1. ప్రపంచం ఎల్లడలా పేదరికము, నిరుద్యోగము, అవిద్య, అనారోగ్యం, అవినీతి, అసమానతలతోనూ, స్త్రీల, మైనారిటీ మత, మైనారిటీ జాతుల, ఆదివాసీల అణచివేతలతోనూ నిండి ఉంది. మన ఇండియాలో అదనంగా అత్యంత దోపిడీ అణచివేతలతో కూడిన కుల వ్యవస్థ చాలా లోతుగా పాతుకుపోయింది.

దీని స్థానంలో అంతరాలు, అసమానతలు లేని వర్గరహిత-కులరహిత దోపిడీ రహిత సోషలిస్టు సమాజాన్ని కాంక్షించేదిగా మన గ్రూపు వుంటుంది.

అందుకు అవసరమైన భావజాలాన్ని పెంపొందించేదిగా, ప్రజలను చైతన్యపరచేదిగా మన గ్రూపు వుంటుంది.

2. భావజాల రంగంలో మార్క్స్ వాద, అంబేద్కర్ వాద సిద్ధాంతాలు, ఇతర ప్రగతిశీల సిద్ధాంతాలను స్వంతం చేసుకుంటుంది.

వర్గపోరాట మరియు కులనిర్మూలనా సిద్ధాంతాలను అవసరమయిన వాటిగా స్వీకరిస్తుంది.

మన దేశ ప్రాచీన ప్రగతిశీల వారసత్వ సంపద అయిన , చార్వాక, లోకాయత , బౌద్ధ, జైన, బసవన్న, సంత్ రవిదాస్, కబీరు, పల్నాటి బ్రహ్మన్న , వేమన , పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తదితరుల వారసత్వ సంపదలోని ప్రగతిశీల అంశాలన్నిటినీ మన గ్రూపు తన స్వంతంగా భావిస్తుంది.

ఆధునిక కాలంలో పూలే, అంబేద్కర్, పెరియార్, త్రిపురనేని రామ స్వామి, నారాయణ గురు, భగత్ సింగ్ , రామ మనోహర లోహియా, చార్వాక రామకృష్ణ,

మన దేశంలో సమసమాజం కోసం/ నూతన సమాజం లక్ష్యం కోసం అసమాన త్యాగాలు చేసిన కమ్యూనిస్టు వుద్యమ శ్రేణుల విలువయిన అనుభవాలు, తదితరుల రచనలలోని ప్రగతిశీల అంశాలను, వారి తర్వాత తరంలోని వారి యొక్క రచనలలోని ప్రగతిశీల అంశాలను , మానవీయ విలువలను అన్నిటినీ లాల్ - నీల్ గ్రూపు స్వీకరిస్తుంది.

మన దేశ అభివృద్ధికి వినాశకరమైన మనువాద సిద్ధాంతాలను, పురుషాధిక్యత, పితృస్వామ్యంలను సమర్ధించే భావజాలాలను, శ్రమ జీవనాన్ని అగౌరవ పరిచే భావజాలాలను వ్యతిరేకిస్తుంది.

మనదేశంలో ప్రగతిశీల శక్తులు ముఖ్యంగా మార్క్స్ వాద, అంబేద్కర్ వాద వుద్యమాలు సమాంతర వుద్యమాలుగా సాగాయి. వాటి మధ్య ఐక్యతను ఏర్పరచాల్సిన బాధ్యత నేటి లాల్– నీల్ శక్తుల మీద వుంది.

లాల్– నీల్ శక్తుల ఐక్యతను పెంపొందించడానికి మనువాద భావజాల వ్యతిరేక పోరాటం అనేది చాలా కీలక కర్తవ్యంగా వుంటుంది.

3. దక్షిణ ఆసియాలో ప్రత్యేకించి మన ఇండియాలో తీవ్ర సమస్యగా వున్న కులాన్ని సాంస్కృతిక అంశంగా, ఉపరితల అంశంగా మాత్రమే చూసే అవగాహన సరయినది కాదని, వాటితో పాటు కులం ఉత్పత్తి విధానంతోను, శ్రమ జీవనంతోను ముడిపడిన పునాది అంశంగా కులాన్ని మన గ్రూపు భావిస్తుంది.

కులంలో శ్రమ విభజనతో పాటు శ్రామికుల విభజన కూడా వున్నదని భావిస్తుంది.

పై అవగాహన రీత్యా వర్గము– కులం జమిలిగా కలిసి వున్నాయని, వర్గపోరాటాలు– కుల నిర్మూలనా పోరాటాలు పరస్పర ఆధారభూతాలు గాను, జమిలిగాను సాగవలసి వుందని మన గ్రూపు భావిస్తున్నది.

4. మన గ్రూపు అవగాహనా పరిధిలోని కుల నిర్మూలన, కులాంతర వివాహాలు, ప్రజాస్వామ్య హక్కులు, శాస్త్రీయ విద్య– వైద్యం, శరీరదానం– అవయవ దానం, జీవావరణ – పర్యావరణం పరిరక్షణ లాంటి వాటి కోసం – ప్రజలు మన దేశంలోను, ప్రపంచంలోను సాగించే ప్రజా వుద్యమాలను, సమ సమాజం కోసం ప్రజలు సాగించే వుద్యమాలను బలపరిచేదిగా మన గ్రూపు వుంటుంది.

ఇక్కడ పేర్కొనని, మన గ్రూపు అవగాహనకు అనుగుణమైన అన్ని విషయాల గురించి కూడా మన లాల్– నీల్ గ్రూపు సానుకూల వైఖరితో వుంటుంది.

5. మారుతున్న రాజకీయ పరిస్థితులలో వచ్చే కొత్త రాజకీయ అంశాల పట్ల మన గ్రూప్ అవగాహనతో ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంటుంది.

కొత్తగా రంగం పైకి వచ్చే రాజకీయ, సామాజిక, ఆర్ధిక– అంశాలలో మనకు అవసరమైన వాటి పైననే నిర్ణయాలు తీసుకుంటాము. ప్రతి సమస్య పట్ల మన గ్రూపు ఒక వైఖరి ప్రకటించవలసిన అవసరం లేదు.

రాజకీయ సంస్థలు వివిధ విషయాల గురించి తీసుకునే నిర్ణయాల పట్ల మన వాట్సాప్ గ్రూప్ తప్పని సరిగా వైఖరి ప్రకటించ వలసిన అవసరం లేదు.

6. అడ్మిన్లకు కూడా తమ స్వంత అభిప్రాయాలు వుంటాయి, అవి గ్రూపు అభిప్రాయాలు కావాలని ఏమీ లేదు.

"అడ్మిన్ల బృందం" పేరుతో వచ్చేవి మాత్రమే గ్రూపు అవగాహన అవుతుంది.

7.మన గ్రూపు అవగాహనకు వ్యతిరేకమైన వ్యాసాలు, రచనలు, వీడియో– ఆడియోలు ఏవీ ఈ గ్రూప్ లో post చేయగూడదు.

అంటే మతవాద, ఆధ్యాత్మిక వాద, మార్మికవాద తదితర ప్రగతిశీల వ్యతిరేక విషయాలు ఏవీ ఈ గ్రూప్‌లో post చేయగూడదు.

ప్రజలను చైతన్య పరిచే రచనలకు, మానవీయ విలువలను పెంపొందించే రచనలకు అగ్ర పీఠం వేయాలి.

8. విద్వేష పూరిత రచనలు, పీడితులను– ఆదివాసీలు, దళితులు, నిమ్న జాతి ప్రజలను, మహిళలను, కించపరిచే రచనలు post చేస్తే వెంటనే గ్రూపు నుండి ఆ సభ్యుడిని తీసి వేయడం జరుగుతుంది.

9. వ్యక్తిగత దూషణలు, తిట్లు, బూతులతో కూడిన postలు వస్తే వాటిని post లేదా ఫార్వర్డు చేసిన వారిని హెచ్చరించకుండా కూడా అడ్మిన్లు తీసివేస్తారు.

10. చర్చలు గురించి :–

చర్చలకు ప్రజాస్వామ్య దృక్పథం ప్రాతిపదికగా వుంటుంది, అంటే స్థూలంగా ఇలా వుండాలి.

"ప్రతి వారు సహజంగా తమ స్వంత అభిప్రాయాలను కలిగి వుంటారు. అంతే గాక తాను భిన్నాభిప్రాయం కలిగి వున్నప్పటికీ ఇతరుల అభిప్రాయాన్ని గౌరవించడం; అలాగే తాను భిన్నాభిప్రాయం కలిగి వున్నప్పటికీ మెజారిటీ అభిప్రాయాన్ని గౌరవించడం".

☞ **మిగతా 21వ పేజీలో**

# స్వామి అగ్నివేష్‌కు నివాళి

**కా. రమాసుందరి**

సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్ ఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బైలియరీ సైన్సెస్‌లో మరణించారు. ఆయన వయసు 80. ఆయన కొద్దికాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నారు. మంగళవారం నుండి వెంటిలేటర్ మీద వుండి ఈ రోజు సాయంకాలం 6 గంటలకు చివరి శ్వాస తీసుకొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో ఒక సనాతన బ్రాహ్మణ కుటుంబంలో అగ్నివేశ్ జన్మించారు. ఛత్తీస్‌ఘర్‌లో తన తాత గారి దగ్గర పెరిగారు. న్యాయవిద్యను, కామర్స్‌ను చదివి కలకత్తా సెయింట్ జేవియర్స్ కాలేజీలో అధ్యాపకుడిగా చేరారు. కొంతకాలం న్యాయవాద వృత్తిని కూడా చేశారు.



1970లో ఆర్య సమాజ సూత్రాల ప్రకారం ఆర్యసభ అనే రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ పార్టీతో పోటీ చేసి 1977లో హర్యానా అసెంబ్లీ నుండి గెలిశారు. 1979 వరకు హర్యానా విద్యాశాఖా మంత్రిగా ఉన్నారు.

అప్పుడే ఆయన వెట్టిచాకిరీ విముక్తి సంస్థను స్థాపించారు. ఆ సంస్థ భారతదేశంలో, ముఖ్యంగా ఢిల్లీ పరిసర ప్రాంతాల్లోని గనుల్లో అమలులో ఉన్న వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పని చేసింది. వెట్టి చాకిరి మీద జరుగుతున్న నిరసన కార్యక్రమంపై కాల్పులు జరిపిన పోలీసుల మీద హర్యానా ప్రభుత్వం చర్య తీసుకోలేదని ఆగ్రహించి తన మంత్రిపదవికి రాజీనామా చేశారు స్వామి అగ్నివేశ్. హర్యానా ప్రభుత్వం అతని మీద కక్ష కట్టి, ఒక హత్యానేరంలో ఇరికించి 14 నెలలు జైలుపాలు చేసింది. స్వామి అగ్నివేశ్‌కు ఉన్న అభ్యుదయ భావాల వలన ఆయనను ఆర్యసమాజ్ నుండి 2008లో బహిష్కరించారు.

సమకాలీన వెట్టిచాకిరీ రూపం గురించి స్వామి అగ్నివేశ్ జెనీవా ఐక్యరాజ్య సమితి మానవహక్కుల సంస్థకు నివేదించారు. మహిళా విముక్తిని లక్ష్యంగా పెట్టుకొని పనిచేసి, 1987 సతి చట్టం రావటానికి కారకుడు అయ్యాడు. 2005లో భ్రూణ హత్యలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ దేశమంతా తిరిగాడు. అన్నిరకాల పాస్ పోర్ట్, వలస చట్టాలను మార్చాలని 'ఆర్థికాభివృద్ధి -మతం' అనే ఐక్యరాజ్య సమితి నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో గొంతెత్తారు.

'ఐక్యరాజ్య సమితి నంబర్ ఒన్ ఉగ్రవాది అనటానికి నేనేమాత్రం సందేహించను. ఖురాన్‌ను, ఇస్లాంను అప్రదిష్టపాలు చేయటం ఉగ్రవాదానికి ఉన్న అతిహీనమైన ముఖం. ఇస్లాం శాంతి కోసం, సహోదరత్వం కోసం నిలబడుతుంది. ముస్లిములు ఉగ్రవాదులు అనటం కంటే పచ్చి అబద్ధం ఇంకొకటి ఉండదు' అన్నారు.

పర్యావరణ సమస్యల దగ్గర నుండి అభివృద్ధి పేరుతో భూములు కోల్పోయిన రైతుల కోసం, అత్యంత అణచివేతకు గురి అవుతున్న ఆదివాసీల కోసం ఆయన మాట్లాడారు.

2011లో అన్నాహజారే మొదలు పెట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని, ఆ ఉద్యమానికున్న లొసుగులు గుర్తించి మధ్యలో విరమించుకొన్నారు. కశ్మీర్‌లో మోహరించిన లక్షలాది సైన్యానికి వ్యతిరేకంగా ఆయన ప్రకటనలు చేశారు.

మావోయిస్టులకీ, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య చర్చలు జరగటానికి కృషి చేశారు. చర్చలకు అంగీకరించినట్లు నటించి ప్రభుత్వం మోసం చేసి, కామ్రేడ్ ఆజాద్‌ను వల పన్ని చంపిందనీ, తెలిసో తెలియకో తాను కూడా ఆజాద్ మరణానికి కారకుడిని అయ్యానని ఆయన తరువాత బాధపడ్డారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, తరువాత విభజిత తెలుగు రాష్ట్రాలలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలకు ఆయన హాజరు అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక అమరావతిలో భూసమీకరణ పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకోవటాన్ని వ్యతిరేకిస్తూ

అఖిల భారత రైతు కూలిసంఘంతో బాటు అనేక సంఘాలు నిర్వహించిన నిరసనోద్యమంలో ఆయన పాల్గొని తన మద్దతు తెలిపారు.

ఆయనకున్న మత వ్యతిరేక భావనల వలన హిందుత్వ సంస్థలు ఆయన మీద అనేకసార్లు దాడి చేశాయి. 2005లో పూరీ జగన్నాథ ఆలయాన్ని హిందువేతరల కోసం తెరవాలని ఆయన ప్రకటన చేయగానే ఆ గుడి పూజారులు ఆయన దిష్టిబొమ్మను తగలపెట్టారు. కశ్మీర్ అమర్‌నాథ్‌లో ఉన్న మంచు ముక్కను శివుడు అని నమ్మించి యాత్రలు చేయించటాన్ని విమర్శించగా వందలాది హిందూ పూజారులు మళ్లీ ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. స్వామి అగ్నివేశ్‌ను చంపటానికి అఖిల భారతీయ హిందూ మహాసభ 20 లక్షల బహుమానాన్ని ప్రకటించింది. అమరనాథ్ తీర్థయాత్ర విషయంలో హిందువుల సెంటిమెంట్లను గాయపరిచారని 2011లో సుప్రీం కోర్టు స్వామి అగ్నివేశ్‌ను తప్పుపట్టింది.

2018 జులై 17న ఝార్ఖండ్‌లో ఆయన మీద హిందూ మతోన్మాద మూక దాడిచేసి కింద పడేంత వరకు కొట్టింది. అతను క్రిష్టియన్ మిషినరీలకు సానుభూతి చూపిస్తున్నాడనీ, విదేశీ సంస్థల నుండి నిధులు తీసుకొంటున్నాడని తప్పుడు అభియోగాలు దాడికి పాల్పడిన వాళ్లు చేసారు. జరిగిన దాడిని సమర్థించు కోవటానికి అప్పటి ఝార్ఖాండ్ బీజేపీ ముఖమంత్రి సిపి సింగ్ స్వామి అగ్నివేశ్‌ను నకిలీ స్వామి అని ముద్ర వేశాడు.

తరువాత నెలకు మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి అంత్యక్రియలకు హాజరవటానికి వస్తున్న స్వామి అగ్నివేశ్ మీద రెండో సారి దాడి చేసి తీవ్రంగా అవమానించ ప్రయత్నం చేశారు.

స్వామి అగ్నివేశ్ బతికినంతకాలం ఆర్ ఎస్ ఎస్ కు కంటిలో నలక లాగా ఉన్నారు. కుల వివక్ష, మతోన్మాదాలకు వ్యతిరేకంగా ఆయన సామాజిక న్యాయం కోసం పాటుపడటం ఆర్ ఎస్ ఎస్ ఆధిపత్య భావజాలానికి ఆగ్రహం కలిగించింది.

కన్యాకుమారి దగ్గర నుండి కశ్మీర్ వరకు ఎక్కడ ప్రజలు న్యాయం కోసం పోరాడుతున్నారో అక్కడికి పరుగులు పెట్టారు స్వామి అగ్నివేశ్. ఫాసిస్టు రాజ్యాన్ని తల మోటించి ఎదుర్కొన్నారు. అణగారిన ప్రజల పట్ల ఆయన బాధ్యత వహించి జీవితకాలం పోరాడారు. ❑

---

## "లాల్- నీల్ ఐక్యత కోసం" ...

**(19వ పేజీ తరువాయి)**

11. అడ్మిన్లు అవగాహనా పత్రానికి అనుగుణంగా ఇచ్చే వివరణలు, సూచనలు సభ్యులు తప్పని సరిగా గమనించి, పాటించాలి. అలా చేయగలిగితేనే మన గ్రూపు అవగాహనకు అనుగుణంగా పని చేయ గలుగుతాము.

12. మన బృందం యొక్క పై ఉద్దేశాలు–ఆలోచనలు నచ్చిన వారు ఎలాగు మన గ్రూపులో కొనసాగుతారు. నచ్చని వారు Exit కావచ్చును. అలాగే ఈ బృందంలో వుండుట వలన తమ సమయం వృధా అవుతున్నదని భావించిన మిత్రులు కూడా ఈ బృందం నుంచి స్వేఛ్ఛగా Exit కావచ్చును. Exit అయినవారు కూడా మన బృందానికి మిత్రులే.

13.మన లాల్– నీల్ గ్రూపు వర్తమాన సమస్యల మీద ప్రధానంగా కృషి చేస్తుంది. గత కాలపు తప్పొప్పుల వాద వివాదాలకు, చర్చోపచర్చలకు గ్రూపులో తావు లేదు..

గతాన్ని, గత అనుభవాలను వర్తమానంలో వినియోగించు కుంటూ రేపటి మంచి భవిష్యత్తు కోసం కృషి చేస్తుంది.

వర్తమానంలో, మనువాదం కార్పొరేట్ ఫాసిజంగా మారి ప్రజలను పీడిస్తున్న, దేశానికి ప్రమాదకరంగా మారిన పరిస్తితి మీద కేంద్రీకరిస్తుంది.

CAA/ NRC/NPR వంటి సమస్యలపైన, కరోనా వంటి పెను విపత్తుల పైన మన గ్రూపు కేంద్రీకరించి ప్రచార కృషి చేస్తుంది.

మన ప్రగతిశీల శక్తులు, మన లాల్ – నీల్ శక్తులు గెలుచుకోవలసిన విశాల ప్రజారాశులు మన కోసం ఎదురు చూస్తున్నాయి,

మనమంతా ఆ వైపు పురోగమిద్దాం!
లాల్ సలామ్!
నీల్ సలామ్!
లాల్– నీల్ ఐక్యత వర్ధిల్లాలి!

(లాల్ నీల్ గ్రూపులో చేరాలనుకునేవారు
ఈ అవగాహనా పత్రాన్ని ఆమోదించి
రేకా కృష్ణార్జునరావుని సంప్రదించండి.
సెల్ : 98481 99098 ❑

# మూస ఆలోచనకి బద్ధ వ్యతిరేకి 'ఉసా'

**పి.మురళికుమార్**
వ్యవస్థాపక అధ్యక్షులు, సామాజిక న్యాయపోరాట సమితి

ఉద్యమాల్లో ఉ.సా.గా సుపరిచితులైన ఉప్పుమావులూరి సాంబశివరావు తెలుగు నేలపై ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా సంచరిస్తూ విప్లవించగల శారీరక ఆరోగ్యంతో ఉన్న వ్యక్తి. కాలం కరోనా రూపంలో కాటు వేసి ఉండకపోతే మన మధ్య ఇంకా చాలా కాలం పాటు ప్రజా ఉద్యమాల పరివ్రాజకుడుగా ప్రతిచోటా మనకు తారసపడే అరుదైన ఆలోచనాపరుడు 69 ఏళ్ళ ఉ.సా.

ఈ దేశపు రాచపుండైన కులం కోట్లాదిమంది శ్రామికుల్ని సంఘటితమవకుండా చేసి ఈ నేలపై తన రసిని అణువుణువునా చిమ్ముతున్నప్పుడు ఆ రసిని కేవలం తుడుచుతూ ఉంటే కొంత కాలానికి పుండు దానికదే తగ్గిపోద్దన్నది ఈదేశ కమ్యూనిస్టు, విప్లవోద్యమం ("వర్గపోరాటం విజయవంతమైతే కులం దానంతట అదే నశిస్తుంది").

అప్పటికే 1960 దశకంలో దేశంలో చారుమజుందార్ పంథాలో కొనసాగుతున్న విప్లవోద్యమం తెలుగునేలపై ఒకవైపు శ్రీకాకుళం గిరిజన రైతాంగ తిరుగుబాటు రూపంలో ఉండగా; తరిమెల నాగిరెడ్డి ప్రభావంతో మరో పంథాలో అందుకు భిన్నంగా తూర్పుగోదావరి జిల్లాలో 'కొండమొదలు' విప్లవోద్యమం పురుడు పోసుకున్నది. తరిమెల నాగిరెడ్డి పంథాకి ఉ.సా. ప్రభావితులయ్యారు. విద్యార్థి దశలోనే విప్లవోద్యమాల పట్ల ఆకర్షితుడైన ఉ.సా. చాలాకాలం నాగిరెడ్డి పంథా ఉద్యమాల్లో పని చేసారు. అయితే విప్లవోద్యమంలో ప్రవేశించాక సిద్ధాంతానికి, క్షేత్రస్థాయిలోని వాస్తవాలకు పొంతన లేకపోవడం గమనించారు. ఆ పొంతన తెగ్గొడుతున్నది కేవలం కులమేననే విషయాన్ని ఆయన చాలా తేలికగానే అర్థం చేసుకున్నారు. అందుకు కారణం సమాజం చేత హీనంగా చూడబడుతున్న అనేక కులాల్లో ఒకటైన మంగలి కులం నుండి ఆయన రావడం. తెలుగు రాష్ట్రాల్లో వెనుకబడిన తరగతులకు చెందిన కులాల్లో మిగిలినవాటికన్నా ఎక్కువగా వెనకబడ్డ కులం మంగలి కులం.



**ఉ.సా. (ఉప్పుమావులూరి సాంబశివరావు)**

సాధారణంగా కులవృత్తులుండే కులాల్లో చాలామంది చదువులపై దృష్టి పెట్టరు. కానీ ఉ.సా. వారసత్వంగా వచ్చే తన వృత్తి కత్తికి చదువు, తాత్విక చింతన అనే రెండంచుల పదును పెట్టి విప్లవించారు. అందులో వెలితి అనుభవంలోకి వచ్చాక దానికి కారణమైన బ్రాహ్మణీయ భావజాలాన్ని దునుమాడడానికి మార్క్సిజం ఒక్కటే సరిపోదని ఫూలే-అంబేడ్కర్- పెరియార్ ఆలోచనా విధానాన్ని జోడించాలనే నిర్ధారణకు వచ్చాక ఇక వెనక్కి తిరిగి చూడలేదు. కులమనే రాచపుండు నుండి కారుతున్న రసిని కేవలం తుడవడం వల్ల ఉపయోగం ఉండదని అందుకు తగ్గ మందును కనుక్కుని కులాన్ని నాశనం చేయాలని చెప్పిన బాబాసాహెబ్ అంబేడ్కర్‌ని ఒక ప్రథకం ప్రకారం ఈ దేశ మార్క్సిస్టులు, విప్లవోద్యమం దూరంగా పెట్టిన కుట్రకోణాన్ని అర్థం చేసుకుని ఆ దిశగా అధ్యయనం చేసిన కార్యశీలి ఉ.సా.

అక్కడ నుండి మార్క్స్-ఫూలే-అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని ఈ దేశ పీడిత ప్రజల విముక్తి సిద్ధాంతంగా ప్రచారం చేయడాన్ని ఆయన తన జీవన విధానంగా మలుచుకున్నారు.

ఈ సిద్ధాంతం వెలుగులోనే తన కార్యాచరణను రూపొందించుకుని ప్రచారకునిగా, కవిగా, గాయకునిగా, ఉద్యమకారునిగా, తాత్వికునిగా తనని తాను ఆవిష్కరించు కున్నారు. ఈ క్రమంలోనే ఉక్రి (యుసిసిఆర్-ఎంఎల్) పార్టీ నుండి బంధవిముక్తుడై అప్పటికే పీపుల్స్ వార్ పార్టీ నుండి బయటకు వచ్చిన కె.జి. సత్యమూర్తి(శివసాగర్) తో సిద్ధాంత అనుబంధాన్ని ఏర్పర్చుకున్నారు. ఫలితంగా ఆవిర్భవించిందే మార్క్సిస్టు లెనినిస్టు(ఎంఎల్) సెంటర్. ఇందులో వీరిద్దరితో పాటుగా రాజశేఖర్, రవిమారుత్, రామకృష్ణ, పార్వతి, ఉపేంద్ర, జి.లక్ష్మీనర్సయ్య, ఇంగిలాల రామచంద్రరావు వంటి ఆలోచనాపరులు కూడా తోడయ్యారు.

మార్క్స్-పూలే-అంబేద్కర్ తాత్విక చింతనను ప్రచారం చేయడానికి, విప్లవోద్యమం ఈ దేశంలో ఎట్లా ఉండాలి, ఎట్లా ఉన్నది అనే అంశాలను చర్చించడానికి ఎంఎల్ సెంటర్ నుండి ఉ.సా. ఎడిటర్ గా 'ఎదురీత' మాసపత్రికను తీసుకువచ్చారు. ఈ పత్రిక ద్వారానే దేశంలో 'విప్లవోద్యమం ఉండాల్సింది అగ్రకులాల నాయకత్వంలో కాదని, అణచబడ్డ కులాల నాయకత్వంలో' అని విప్లవోద్యమంలో పెద్ద చర్చను ముందుకు తెచ్చింది ఎంఎల్ సెంటర్. అంతేకాకుండా ఆనాటి సామాజిక, రాజకీయ పరిణామాలపై, నూతన తరహా కార్మికవర్గ పార్టీ నిర్మాణంపై అవసరమైన తాత్విక చర్చను సత్యమూర్తి, ఉ.సా. కలసి చేపట్టారు.

కె.జి.సత్యమూర్తి వివిధ ప్రాంతాలు పర్యటిస్తున్న క్రమంలో క్రాంతి, నేను, పాపయ్య మాస్టారు, రాంగోపాల్, రవికుమార్, వెంకటేశ్వర్లు (ఒంగోలు), వెంకటేశ్వర్లు (తెనాలి), విద్యాసాగర్, రత్నప్రసాద్, కేశవరావు, గంగాధర్, ఇంకా అనేక మందిమి పరిచయమయ్యాం . సంగీతరావు మాత్రం 'ఉక్రి' నుండి ఉ.సా.తో వచ్చినా తర్వాత సత్యమూర్తితోనే ప్రయాణించాడు. బాంబుల అంకమ్మగా పిలవబడే దాసరి అంకమ్మ, అత్తోటి పీటర్లు అప్పటికే సత్యమూర్తితో ఉన్నారు. ఆ విధంగా ఎంఎల్ సెంటర్ బలోపేతమైంది. ఆ సమయంలో యువకులుగా ఎంఎల్ సెంటర్ చేపట్టిన అనేక కార్యక్రమాల్లో భాగస్వాములమయ్యాం . అపుడు మాకు వీరంతా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించేవారు. ఇవి ప్రధానంగా ప్రకాశం, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జరిగేవి. ఎంఎల్ సెంటర్ ఆధ్వర్యంలోనే సామాజిక విప్లవ వేదికను, చుండూరు నరమేధం తర్వాత 'సమతా వాలంటరీ ఫోర్స్' అనే ఉద్యమ సంస్థలను సత్యమూర్తి ప్రకటించారు. సమతా వాలంటరీ ఫోర్సు క్రాంతి కన్వీనర్‌గానూ, సామాజిక విప్లవ వేదికకు మేము ఒకొక్కరం ఒకొక్క జిల్లాకు కన్వీనర్లుగానూ పనిచేసాం.

సమతా వాలంటరీ ఫోర్స్ రాజకీయ శిక్షణా తరగతులను పశ్చిమగోదావరి జిల్లా ఆచంట గ్రామంలో ఏర్పాటుచేసాం. మాకు శిక్షణ ఇవ్వడానికి సత్యమూర్తితో పాటు ఉ.సా., కంచ ఐలయ్యలు హాజరయ్యారు. సత్యమూర్తి ఇక్కడ ఉన్నారని తెలుసుకుని మొదటిసారిగా మంద కృష్ణ (అప్పుడు మాకు తన పేరు కిషన్ అని చెప్పాడు) వచ్చి కలిసాడు. అప్పట్లో క్రిష్ణను ప్రకాశం జిల్లాకు కన్వీనర్‌గా సత్యమూర్తి పంపారు. మంద కృష్ణ అప్పటి నుండి ఎంఆర్ పి ఎస్ ప్రారంభించేంత వరకూ మాతో కలసి పనిచేసాడు.

విప్లవోద్యమంలో ఏ చర్చనైతే ఎంఎల్ సెంటర్ లేవదీసిందో దానిని ముందుగా ఎంఎల్ సెంటర్ నుండే ప్రారంభిద్దామని అప్పటికి నాయకత్వ స్థానాల్లో ఉన్న దళితేతర నాయకత్వం స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేసింది. ఉ.సా., సత్యమూర్తిలు ఈ ప్రక్రియను విప్లవోద్యమంలో ఓ మైలురాయిగా నిలిచిపోయే చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు.

కులమూ, దాని గమనాత్మక శక్తి పైన ఉ.సా. సిద్ధాంత పత్రాన్ని రూపొందించాలని, విప్లవోద్యమంలో ఉన్న ఎకనమిక్ టెర్రరిజం అనే అంశంపై సత్యమూర్తి ఓ పత్రాన్ని రూపొందించాలని ఎంఎల్ సెంటర్ అనుకున్నది. అందులో భాగంగా ఉ.సా. కులం పై విస్తృతంగా అధ్యయనం చేయడం ప్రారంభించారు.

దళితేతర నాయకత్వం రాజీనామా చేసిన తర్వాత ఆ స్థానాల్లోకి మమ్మల్ని తీసుకోవాలని సత్యమూర్తి భావించారు. అందుకు మాకు తగిన అనుభవం లేదని ఉ.సా. అభిప్రాయ పడ్డారు. నాయకులుగా ఎదగాలంటే నాయకత్వం ఇస్తేనే సాధ్యపడుతుందని సత్యమూర్తి వివరించిన తర్వాత తణుకులోని జగజ్జీవన్ ఇంట్లో సామాజిక విప్లవ వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఉ.సా., సత్యమూర్తిల ఆధ్వర్యంలో జరిగింది. సామాజిక విప్లవ వేదికకు కన్వీనర్‌గా ఎవరుండాలనే చర్చ జరిగి మంద కృష్ణ పేరు, విద్యాసాగర్ ప్రతిపాదనతో నా పేరు ముందుకు వచ్చాయి. అపుడు నేను మాట్లాడుతూ కృష్ణనే కన్వీనర్‌గా ఉంచుదాం, నేను కో-కన్వీనర్ గా ఉంటానని వెల్లడించాను. ఆ విధంగా ఆ సమావేశం ముగిసింది.

1991లో జరిగిన చుండూరు మారణకాండకు వ్యతిరేకంగా చుండూరు దళితుల న్యాయ పోరాట కమిటి ఆధ్వర్యంలో విజయవాడలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ సభకు కత్తి పద్మారావు, బొజ్జా తారకం, జార్జిఫెర్నాండెజ్, గద్దర్లు హాజరవ్వగా ఎంఎల్ సెంటర్ నుండి సత్యమూర్తి, ఉ.సా.లు పాల్గొన్నారు.

కొన్ని కొన్ని సందర్భాలలో సత్యమూర్తి పని విధానంతో విభేదిస్తూ వచ్చిన ఉ.సా. చివరకు సత్యమూర్తి బహుజన్ సమాజ్ పార్టీలో చేరాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత పూర్తిగా దూరం అయ్యారు. అక్కడితో ఎంఎల్ సెంటర్ తో సత్యమూర్తి ప్రస్థానం ముగిసింది. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలు ఎంఎల్ సెంటర్‌ను ఉ.సా., రవిమారుత్, రామకృష్ణలు మిగిలిన మిత్రులతో కలసి కొనసాగించారు. చివరకు అనేక కారణాల మూలంగా వారూ స్తబ్దుగా ఉండిపోయారు.

1993లో ఉత్తరప్రదేశ్‌లో సంభవించిన రాజకీయ పరిణామాల ప్రేరణతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా ఒక రాజకీయ పార్టీని పెట్టాలనే ఆలోచనతో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీతో కలసి తెలంగాణా జిల్లాలన్నీ పర్యటిస్తున్న నేపథ్యంలో చాలా మంది మిత్రులు బీఎస్పీలో చేరితే మంచిది అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ అంశంపై సామాజిక విప్లవ వేదిక రాష్ట్రస్థాయి సమావేశం జలదృశ్యంలోనే పెట్టి తీవ్ర చర్చల అనంతరం బీఎస్పీలోకి వెళ్ళాలని నిర్ణయించాము. అయితే ఆ ప్రకటన ఇంకా చేయలేదు. సత్యమూర్తి ఈ అంశంపై ఎంఎల్ సెంటర్ తో చర్చించకుండానే నిర్ణయంతీసుకున్నారని ఉ.సా., మిగిలిన మిత్రులు భావించారు.

నాటి రాష్ట్ర నాయకత్వం అందర్నీ ఆహ్వానించి ఒక ఉమ్మడి నిర్ణయం చేద్దామని తలచి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆధ్వర్యంలో జలదృశ్యంలో పెద్ద సభ జరిగింది. ఆ సభలోనే సత్యమూర్తి బీఎస్పీలోకి వెళ్ళడం మంచిదనే నిర్ణయాన్ని ప్రకటించారు. ఆ సభలో ఉ.సా. మాట్లాడుతూ (అప్పటికే సత్యమూర్తితో దూరాన్ని పాటించారు) తాను మార్క్సిస్టు-లెనినిస్టుగా పార్లమెంటరీ రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. బాపూజి కూడా సత్యమూర్తి నిర్ణయంతో సంతృప్తి చెందలేదు. ఇక అక్కడ నుండి ఉ.సా.తో కలసి మేం పని చేయలేదు. మేమంతా సత్యమూర్తితో పాటే బిఎస్పీలోకి వెళ్ళాము. ఆ సమయంలోనే గొల్లపల్లి అంబేద్కర్, మేడేపల్లి ఫ్రాన్సిస్ వంటి అనేక మంది మిత్రులు జతకలిసారు.

1994లోనే కాన్షీరాం పనివిధానంతో విభేదించిన మేము బీఎస్పీ నుండి బయటకు వచ్చి 1995లో సత్యమూర్తి అధ్యక్షునిగా, నేను ప్రధాన కార్యదర్శిగా బహుజన రిపబ్లికన్ పార్టీని వరంగల్ నుండి ప్రకటించాము. అదే సమయంలో జనశక్తి పార్టీలో మారోజు వీరన్న పెద్దఎత్తున సిద్ధాంత చర్చ జరిపి మార్క్స్-పూలే-అంబేద్కర్ ఆలోచనా వెలుగులో దేశంలోనే మొట్టమొదటి విప్లవ పార్టీ అయిన ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ పెట్టారు. ఈ క్రమంలో మేము, వీరన్న కలసి పనిచేయాలని చర్చలు జరిగాయి. చివరకు వీరన్న, ఉ.సా.లు కలసి పనిచేసారు. వీరిద్దరి ఆలోచనా కలయికలోనే 'ఇండియాలో ఏం చేయాలి' అనే సిద్ధాంత గ్రంథం రూపుదిద్దుకుంది.

కానీ ఆ తర్వాత పరిణామాలను పరిశీలిస్తే ఆయన కూడా పార్లమెంటరీ రాజకీయాలను అక్కున చేర్చుకున్నారు. మంద కృష్ణ అధ్యక్షునిగా, ఉ.సా. కార్యదర్శిగా మహాజన ఫ్రంట్ ఎన్నికల రాజకీయాల్లో ప్రవేశించింది. అది విఫలమైన తర్వాత తాను అధ్యక్షునిగా మహాజన పార్టీని స్థాపించి పార్లమెంటరీ రాజకీయాల్లో మరో ప్రయోగాన్ని చేపట్టారు. ఆ పార్టీని ఒకానొక దశలో చిరంజీవి పార్టీ ప్రజారాజ్యంలో విలీనం చేయాలనే చర్చ జరిగినపుడు ఆ పార్టీతో సంబంధాల్లోకి వెళ్ళిన మేడేపల్లి ఫ్రాన్సిస్ గట్టిగా వ్యతిరేకించాడు. అయినప్పటికీ ఆ పార్టీ ప్రజారాజ్యంలో కల్సింది. ఆ పార్టీలో ఇమడలేని ఉ.సా. తిరిగి ప్రజా ఉద్యమాల్లోనే కొనసాగారు.

నేను ఆయన్ని తిరిగి లక్షింపేట పాదయాత్రలోనూ, కంచ ఐలయ్యపై కోమట్లు జరిపిన దాడులకు వ్యతిరేకంగా జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలోనూ, తూర్పుగోదావరి జిల్లా బిక్కి శ్రీను హత్యకు వ్యతిరేకంగా జరిగిన సభలోనూ, చివరిసారిగా ఈ ఏడాది ప్రారంభంలో హైదరాబాద్‌లో జరిగిన విరసం సభల్లో కలుసుకుని మాట్లాడాను.

ఈ విధంగా ఉ.సా.తో కలసి పనిచేసిన కాలం ఉంది. అట్లాగే అనేక విషయాల్లో విభేదించిన సందర్భాలూ కాలమూ ఉన్నాయి. ఐనప్పటికీ ఒక వ్యక్తి తన జీవితాన్ని ఇతరులు పాఠంగా చదువుకునేట్లు జీవించాడా...లేదా గుణపాఠంగా తీసుకునేటట్లు జీవించాడా అనే విభజన ఎవరైనా పెట్టుకుంటే ఉ.సా. ఖచ్చితంగా మొదటి తరగతికి చెందుతాడనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

జడత్వానికి విరుగుడు చలనశీలమే అనుకున్నప్పుడు 1998లో వివిధ కుల సంఘాల రాష్ట్ర మహాసభలు నిర్వహించ డంలో పనిచేసినా, 2015లో సూరేపల్లి సుజాత, జిలుకర శ్రీనివాస్, ఉషా. ఎస్. డానీల వంటి వారితో కలసి బహుజన ప్రతిఘటన వేదిక నిర్మించినా, 2018లో దేశీ దిశ పేరుతో యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించినా, తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై, స్త్రీలపై జరిగిన అనేక అత్యాచారాలు, అమానుష దాడులకు వ్యతి రేకంగా ఉద్యమించినా, ఇంకా ప్రతి రాజకీయ, సామాజిక పరిణామాల విశ్లేషణలో ఉ.సా. నిర్వహించిన పాత్రను చలనశీలన దృష్టినుండే చూడాలి.

"ప్రకృతిలో ఏదీ స్థిరంగా ఉండదు, ప్రతీదీ మారుతుంటుంది. మనిషి, మనిషి యొక్క ఆలోచనలు" అని బాబాసాహెబ్ డా. అంబేద్కర్ సూత్రీకరించిన వెలుగులోనే ఉ.సా.ను కూడా వీక్షించాలి !! *(బహుజన కెరటాలు సౌజన్యంతో...)* ❑

# కొత్త సందర్భంలో కొత్త అధ్యయనం



**అవిజిత్ పాథక్**
జె యన్ యూ లో సోషియాలజీ ప్రొఫెసర్

ఒక ఉపాధ్యాయుడిగా నేనేం ప్రతిఫలిస్తున్నానో చూసుకుంటూ ఒకానొక గాఢమైన ఆత్మవిమర్శతో నేనీ వ్యాసం రాస్తున్నాను. ఒక ప్రశ్నతో మొదలుపెడతాను. సమస్తమూ అస్థిరమైపోయి, సంప్రదాయ పుస్తక జ్ఞానమంతా ప్రాసంగికతను కోల్పోయి మన విద్యార్థులు విపరీతమైన మానసిక వొత్తిడికి గురై

సమాధానం లేని ఒక చిక్కుప్రశ్నలా ఉన్న ఈ సందర్భంలో ఉపాధ్యాయులుగా మనం ఎటువంటి చికిత్స నందించగలం ? నా సహ అధ్యాపకులకు ఈ ప్రశ్న అర్థరహితంగా కనిపిస్తుంది. మనం కేవలం జీతం తీసుకునే ఉద్యోగులం, మన బాధ్యత అంతా ఆన్ లైన్ క్లాసులు నిర్వహించడం, సిలబస్ పూర్తిచేసి మన బాస్‌లైన ప్రిన్సిపాళ్లకు వైస్ చాన్స్‌లర్లకు నివేదించడమే మన పనంటారు వారు. అంతేకాదు ఉపాధ్యాయులు వైద్యులో ఆధ్యాత్మిక గురువులో కాదు, వైద్యం చేసి గాయాలూ రుగ్మతలూ మానేటట్టు చెయ్యడానికి అని కూడా వారు వాదించవచ్చు. కాబట్టి చరిత్రో జీవశాస్త్రమో, ఫిజిక్సో సివిక్సో, గణితమో సమాజశాస్త్రమో ఏదో ఒకటి జ్ఞాన పాకేజీతో పిల్లల బుర్రల్ని నింపడమే తక్షణ కర్తవ్యం. ఏది ఏమైనా సమయం మాత్రం వృథా కారాదు. పిల్లలు చదువుల్లో సంబంధిత లక్ష్యాల్లో మునిగిపోవాలి. అంతే. అదీ పరిస్థితి.

బహుశ ఇవాన్ ఇలిచ్ అయితే, పాఠశాలీకరింపబడిన మన సమాజంలో వ్యవస్థీకరింపబడిన విద్యకు వెలుపల అంటూ ఏమీ లేదనీ, విద్య అంటేనే ఉపాధ్యాయ ముఖీన ఏకపక్ష ఉపన్యాసాల తంతు మాత్రమేననీ పాఠ్య పుస్తకాల్ని ఔపోసన పట్టి వారాంత, మాసాంత, సంవత్సరాంత పరీక్షల్లో గ్రేడులు సంపాదించడమేననీ అని ఉండేవాడు. అందువల్ల ఉపాధ్యాయులుగా మనం అన్ని వైపులా మనుషులు మరణిస్తూనే ఉన్నా, వలస కూలీల నడకలు సాగుతూనే ఉన్నా, సమాజంలో గణనీయమైన వర్గాన్ని ఆర్థిక ఆందోళనలు సంక్షోభపరుస్తూ ఉన్నా అన్నిటినీ నొక్కిపట్టి కంప్యూటర్ తెరపై ప్రత్యక్షమై విద్యార్థుల్ని చదువులో నిమగ్నం చెయ్యాలి. పరిస్థితి అంతా మామూలుగానే ఉన్నట్టు, వ్యవహారం యథావిధిగా సాగిపోవాలన్నట్టు ప్రవర్తించాలి. మూడేళ్ల బిడ్డ అయినా సరే విడిచిపెట్టడానికి వీల్లేదు. ఒక తల్లి నాతో చెప్పినట్టు ప్లే స్కూల్ పిల్లలైనా సరే లాప్ టాప్ ముందు కూచుని డ్రాయింగ్ నేర్చుకోవలసిందే. ప్రపంచం ఏమన్నా అయిపోనీ, మన పిల్లలు మాత్రం కళ్ళుమూసుకుని మరీ పుస్తక సమాచారాన్ని అర్థం లేని ప్రాజెక్టుల్నీ బుర్రల్లోకి అప్ లోడ్ చేసుకోవలసిందే.

ఇదుగో ఇటువంటప్పుడే మనం ఒక భిన్నమైన భాషను మాట్లాడగలిగే ధైర్యాన్ని సమకూర్చుకోగలగాలి. మనదైన సృజనాత్మక ఆవరణని సృజించుకుని మనకు మనం విద్యార్థులకూ అధికారిక పాఠ్యప్రణాళికకూ మధ్య విధేయ మధ్యవర్తిత్వ స్థితిని దాటుకుని చూడగలగాలి. విద్యంటే చిలుకపలుకుల్లా పాఠ్యగ్రంథాల్ని వల్లె వేయడమో లేదా పరీక్షలు రాయడమో కాదనీ, అదొక జాగృతమైన జ్ఞానాన్నీ, జీవితం పట్ల గాఢమైన బహు సున్నితమైన స్పందనల్ని కలిగించగలిగేదని గుర్తించాలి. విద్యంటే మనం నివసించే కాలాన్ని అర్థవంతం చేసేది. ఎదురయ్యే కొత్త సవాళ్లకు వాస్తవాలకు తగిన మానసిక దారుఢ్యాన్ని కలిగించేది. అందుకని ఇదుగో ప్రస్తుత సందర్భం లో నేను రెండు విషయాలు చెప్పదలిచాను.

మొదట చిన్న పిల్లల లేదా పాఠశాల విద్యార్థుల ఆవరణలోకి ప్రవేశిద్దాం. ఆటస్థలాలూ, పార్కులూ, స్నేహితులూ, వెల్లువెత్తే ఉత్సాహం ఏమీలేని వారి ప్రస్తుత పరిస్థితిని ఊహించండి. చిన్న అపార్ట్‌మెంట్‌లో తోడబుట్టినవారి మధ్య ఆందోళనతో తీసుకుంటున్న తల్లితండ్రులతో కలిసి ఉండడం వారికెట్లా ఉంటుందో ఆలోచించండి. వాళ్లకు తమతో మాట్లాడేవాళ్లు కావాలి. తమను దగ్గరకు తీసుకుని వెచ్చని స్పర్శ నిచ్చేవాళ్లు కావాలి. సానుకూలంగా స్పందించేవాళ్లు కావాలి. ఇది వారికి ఏ ఆరవ తరగతి ఎన్ సి ఇ ఆర్ టి గణితంలోంచి ఏ ఏడో అధ్యాయాన్నో బాంబులా పేల్చే సందర్భం కాదు. లేకపోతే దేశంలో వరి, గోధుమ మొదలైన పంటల్ని పండించే రాష్ట్రాల్ని చూపించే పటాన్ని తయారుచెయ్యమని వొత్తిడి చేసే సందర్భం కూడా కాదు. దానికి బదులుగా వారి పట్ల గొప్ప సంరక్షణాత్మకంగా ఉండాల్సిన సందర్భం. ఉపాధ్యాయులు స్నేహితులుగా మారి ఆందోళనతో కూడిన ఈ ఆశ్చర్యకర క్షణాల్ని ఒక జీవన వాస్తవికతగా వారికి స్పష్టపరచవలసిన సందర్భం. అందుకు ఉత్ప్రేరకాలుగా పని చెయ్యవలసిన సందర్భం. ఉదాహరణకు ఒక పాపను వాళ్లమ్మ ఇంటిని నిర్వహించడానికి రాత్రింబగళ్లు పడే శ్రమను

గమనించేటట్టు చెయ్యడం ఇప్పుడు సాధ్యమే. సాధారణ విద్యార్జన సందర్భంలో ఇది అంతగా వీలుకానిది. అంతేకాదు ఆ పాప పరిశీలనాశక్తిని నిర్మానుష్యమైన వీథులవైపు, మొరుగుతున్న కుక్క వైపు, దూరాకాశం లో అప్పుడే పొడిచిన నక్షత్రం వైపు మరల్చడం కూడా ఇప్పుడు సాధ్యమే. వలస కూలీల దుర్భర స్థితి గురించి తల్లిదండ్రులతో సంభాషణ ద్వారా గ్రహించిన విషయాన్ని డైరీగా రాయమనే అసైన్‌మెంట్ ఇవ్వడం కూడా సాధ్యమే. పాఠ్య ప్రణాళికల్లో ఉండని ఇటువంటి సృజనాత్మకత కల్గిన తర్ఫీదుల వల్ల కొన్ని మామూలు పాఠాలు కోల్పోయినా విద్యార్థులు నిజ జీవిత పాఠాలను నేర్చుకుంటారు.

రెండవదిగా, కళాశాల విశ్వవిద్యాలయ విద్యార్థుల గురించి ఆలోచిద్దాం. అవును వాళ్లు తమ భవిష్యత్తు గురించీ కెరీర్ గురించీ ఆందోళన చెందుతున్నారు. కానీ వాళ్లు కోవిడ్ అనంతర సమాజం లోకి ప్రవేశించినపుడు వారికి కొత్త జ్ఞానమూ, కొత్త రాజకీయ నైతిక చైతన్యమూ అవసరమౌతాయి. కళాశాల విశ్వవిద్యాలయ అధ్యాపకులు దీని పట్ల విముఖంగా ఉండడానికి వీల్లేదు. ఒక సమాజశాస్త్ర అధ్యాపకురాలు నాతో అంటున్నారు – తాను త్వరగా తన విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసి ప్రముఖ సమాజ శాస్త్రవేత్త యం యన్ శ్రీనివాస్ అధ్యయనం చేసిన 'రాంపుర' గ్రామం మీద ఒక ఓ పేపర్ తయారుచేయవలసినదిగా కోరవలసివుందని. బీహార్ రాష్ట్రంలో మారుమూల పల్లెలో ఇంటర్నెట్ సదుపాయం సరిగ్గా లేకపోవడం వల్ల జూం క్లాస్‌లో పాల్గొనలేకపోయిన విద్యార్థి పట్ల ఈ విధానానికి ఏమైనా అర్థం వుందా ? అదే, సూరత్ నుంచి వేలాది కిలోమీటర్లు నడచివచ్చిన వలస కార్మికులకు ప్రవేశం కల్పించడానికి నిరాకరించడం వల్ల తన గ్రామంలోనే వారికి అనుభవంలోకి వచ్చిన అవమానకరమైన గాయం గురించీ, కొత్త రకం అంటరానితనం గురించీ, వారికి తమ ఇళ్లే తమవి కాకపోవడం గురించీ ఒక చిన్న పుస్తకం రాయమని కోరుతూ ఒక మెయిల్ పంపితే ఎంత బావుంటుందీ !? బహుశా ఈ మహమ్మారి సందర్భం లో మానవ నిర్మాణ శాస్త్రం కొత్త అర్థం సంతరించుకుంటుందేమో! అట్లాగే, సైన్సు విద్యార్థులు కూడా – మరణాలు కేవలం అంకెల లెక్కగా మారిపోతూ, భయం సాధారణమై పోయి, మనిషి స్పర్శే నిషేధమైన సందర్భంలో అర్థవంతమైన మానవ అస్తిత్వం వంటి లోతైన అంశాలను తమ సాంకేతిక హేతువాద ప్రమాణాల్ని దాటుకుని చూడవలసి ఉంటుంది. ఊహించండి, ఎంత బావుంటుందో, తేజోమూర్తి అయిన ఒక ఫిజిక్స్ ప్రొఫెసర్ ఆల్బర్ట్ కామును, లియో టాల్‌స్టాయ్ ని, గౌతమ బుద్ధుణ్ణి చదవమని తన విద్యార్థుల్ని ప్రేరేపిస్తే!?

ఏముందీ, సమయానికి సిలబస్ పూర్తికాకపోవడం వల్ల జరిగిపోయే నష్టం ఏమీ లేదు. కానీ అందువల్ల విద్య మరింత విముక్తమౌతుంది. అర్థవంతమౌతుంది. చికిత్సాపూరితం అవుతుంది. ఉపాధ్యాయులుగా, ఈ ప్రయోగం చెయ్యడానికి మన సిద్ధంగా ఉన్నామా?

(ది ట్రిబ్యూన్, 15 మే 2020) ❑

**తెలుగు: కొప్పర్తి వెంకటరమణమూర్తి**

---

## హిందూ రాజ్యాన్ని అంబేడ్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు?

**(7వ పేజీ తరువాయి)**

### హిందుత్వ, ప్రజాస్వామ్యం

ఈ పరిస్థితిని అడ్డుకునేందుకే ఆయన హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టారు. హిందూ రాజ్యాన్ని ఆయన పెను ప్రమాదంగా భావించడం వెనుక కుల వ్యవస్థ నుంచి తలెత్తిన అసమానత్వం ఒక పెద్ద కారణం. అది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వంటి విలువకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ అసమానత్వం ఇలా ఉండడం వల్ల వాస్తవిక స్వాతంత్ర్యం మనుగడలో ఉండలేదు. సమానత్వం, స్వాతంత్ర్యం వంటివి లేనప్పుడు సామాజిక సౌభ్రాతృత్వాన్ని ఊహించనే లేం.

కులవాద అసమానత్వం హిందుత్వకు ప్రాణం వంటిది. ఈ అంశం ఆధారంగానే ఆయన "హిందుత్వ, ప్రజాస్వామ్యం రెండు పరస్పర విరుద్ధమైన అంశాలు" అనే నిర్ధారణకు వచ్చారు.

కులపరమైన అసమానత్వం విషయంలోనైనా, దీనిని నిలిపి ఉంచడం కోసం మహిళలు వర్ణానికీ, కులానికీ ఆవల జీవిత భాగస్వామిని ఎంచుకోకుండా వారిని నియంత్రించే విషయంలోనైనా హిందువుల్లో మౌలికమైన మార్పేమీ రాలేదు.

మొత్తంగా చూస్తే, హిందువులు దేన్నైనా వదులుకుంటారు కానీ తమ మూలాధారమైన కులాన్ని మాత్రం వదులుకోరు. దీనిని నిర్మూలించకుండా ప్రజాస్వామిక సమాజాన్ని ఊహించను కూడా ఊహించలేమని అంబేడ్కర్ ఆనాడే భావించారు.

(ఇవి రచయిత వ్యక్తిగత అభిప్రాయాలు) ❑

– బీబీసీ కోసం

# మరణాన్ని గౌరవించాలి

**అవిజిత్ పాథక్**

జె యన్ యూ లో సోషియాలజీ ప్రొఫెసర్

(మృత్యువు,
నీ భృత్యుడు
నా గుమ్మం ముందు నిలుచున్నాడు
అజ్ఞాత సముద్రాలు దాటుకుని
నీ పిలుపు తీసుకొచ్చాడు
–రవీంద్రనాథ్ ఠాగోర్ )

కోవిడ్ యుగంలో మరణం అర్థాన్నీ, హుందాతనాన్నీ, కళాత్మక విస్మయాన్నీ కోల్పోయిందా ? వైరస్ వ్యాపించిపోయి ఆసుపత్రులు బాధిత రోగులతో కిటకిట లాడుతూ, శ్మశానాల నిర్వహణ కష్ట సాధ్యమై పోయినపుడు మరణం కేవలం అంకెల లెక్కగా మారిపోతుంది. అప్పుడు మరణానికి ముఖం ఉండదు. పేరుండదు. అర్థం ఉండదు. భయమై పోయిన మనం కరోనా రోగుల మీద నింద మోపాం. మచ్చ పూశాం. వారు దుర్భర ఏకాంతంలో కనీసం ప్రార్థనలూ ప్రేమైక స్పర్శలూ లేకుండానే మరణిస్తే ప్రభుత్వాధికారులు మీడియాకు ఇవ్వడానికి కేవలం గణాంకాలు సరిదిద్దే సాంకేతిక చర్యగా మారిపోయాం. చివరికి మరుభూమికి అంతిమయాత్ర కూడా బాధాకరంగా అవమానకరంగా సాగుతోంది.

కానీ, కవులూ మర్మజ్ఞులు పదే పదే చెప్పినట్టు మరణానికి అర్థం ఉంది, గౌరవం ఉంది. మన కళ్లు సరిగ్గా తెరుచుకోగలిగితే అద్భుత సూర్యాస్తమయాన్ని చూసినట్టు, చెట్టు నుంచి రాలుతూ ఆకు చేసే నాట్యంలో లయని చూసినట్టు, కళ్లు మూసుకున్న బుద్ధుడిలో పరమ ప్రశాంతిని చూసినట్టు మరణంలో కూడా అందాన్ని చూడవచ్చు. అనుభవించవచ్చు. గాఢతతో జీవించడంలో అర్థవంతంగా మరణించడం కూడా ఉంది. కాబట్టి మరణం హేయమైంది కాదు. అది ఒక విశ్వగానం. ప్రార్థనాస్థితి. అల సముద్రంలో లీనం కావడం వంటి అనుభవం. అందుకే ఠాగోర్ అన్నాడు:

నా
ఆఖరి దినాలలో
మృత్యువు నా తలుపు తట్టినపుడు
నా
శిశిర పగళ్ల
వేసవి రాత్రుల తియ్యదనాన్నీ
నా
తలమునకల జీవితం లో
కూడబెట్టిన సంపాదననీ
ఏరుకున్న పరిగెలనూ
అతని ముందు పరచుతాను.

ఏది ఏమైనా మనకు చావంటే భయం. చావెప్పుడూ బాధగా ఉంటుంది. గాయం చేస్తుంది. నష్టాన్ని కలిగిస్తుంది. నిజమే అనారోగ్యం, అస్వస్థత మానవ శరీరానికి అమితమైన బాధను కలిగిస్తాయి. పైగా ఆధునిక ఆసుపత్రుల్లో ఫలానా రోగిగా వర్గీకరింపబడడం, నిర్జీవమైన లేబొరేటరీ రిపోర్ట్ లేదా యం ఆర్ ఐ చిత్రం గా మాత్రమే గుర్తింపబడడంతో పాటు ఐసీయూ లోని చల్లదనమూ ఏకాంతమూ భయాన్ని మరింత పెంచుతాయి. అయితే మన ఆధునిక విద్య మనకు ఎపుడూ మరణం అనే ప్రశ్నను సౌకర్యవంతం చేయలేదు. మనం దాన్ని వాయిదా వేస్తాం. లేదా తప్పించుకుంటాం. మనం చేతనాచేతనాలు, జీవన్మరణాలు, చీకటివెలుగులు, ఆద్యంతాలు, పదార్థశూన్యాలు అనే ద్వంద్వాల నడుమ జీవించడానికి శిక్షణ పొందాం. అందువల్ల మనం అజ్ఞానంతో ఎరుక లేకుండానో లేక ఉపరితల భావోద్రేకం తోనో ఉంటాం. చివరికి భయం మనల్ని చంపేస్తుంది. ఇప్పటి స్థితిలో మరణం మనల్ని సమీపించినపుడు మనం దాన్ని ఆహ్వానించడానికి వీల్లేదు. అదొక వైద్య వ్యవహారంగా మాత్రమే ఉండాలి. చివరికి వైద్యుడెవరో దాన్ని ధృవీకరించి, ప్రభుత్వ గణాంకాల్లో నమోదు చెయ్యాలి. అంతే.

వైరస్ మరణాన్ని మరింత అగౌరవపరుస్తున్న కాలంలో మనం మరింత లోతుకు వెళ్లి మనల్ని పునర్నిర్వచించుకోవాలి. మానవ సంబంధాల గురించి పునరాలోచన చెయ్యాలి. ఈ సందర్భంగా రెండు అంశాలను విశదం చెయ్యదలిచాను.

మొదటిది, మరణం కేవలం గణాంకం కాదు. వాస్తవానికి ఒక తల్లి మరణిస్తుంది. ఒక సోదరుడు మరణిస్తాడు. ఒక వైద్యుడు, ఒక కామ్రేడ్, ఒక పొరుగువాడు మరణిస్తారు. నిజానికి మనం మరణిస్తాం. మరణించేది వేరెవరో కాదు, మనమే! అందుకని ప్రతిదాన్ని మనం సృష్టించి ప్రేమించినట్టు, కష్టించి పనిచేసినట్టు, ఆటలు ఆడి పాటలు పాడినట్టు, విషాదించి వినోదించినట్టు మరణం లోని సౌగంధాన్ని కూడా ఆస్వాదించాలి. మరణం తన సొగసునీ, అర్థాన్నీ, గాంభీర్యాన్నీ కోల్పోవడాన్ని మనం అంగీకరించకూడదు. ఈ రోజుల్లో ఏం జరుగుతుందో చూడండి. పార్థివ శరీరాల్ని వానుల్లో కుక్కుతున్నారు. హడావుడిగా తీసుకెళ్లి సాగనంపి వస్తున్నారు. శ్మశానాల్లో చోటు లేకపోతే అంతే ఆదరాబాదరాగా తెచ్చి మార్చ్యురీల్లో పడేస్తున్నారు. పైగా వైరస్ భయం సామాజికదూరాన్ని చట్టబద్ధం చెయ్యడంతో మరణించిన వ్యక్తి కోసం ప్రార్థించడానికో, దుఃఖిత కుటుంబాన్ని అనునయించ డానికో, కనీసం మౌనంగా నిలబడి ఏ నిశ్శబ్దసంగీతాన్నైనా వినిపించడానికో ఏ స్నేహితుడూ రాకపోవడం కూడా చట్టబద్ధమైపోయింది.

నిజంగా ఈ రకమైన మరణాలు, సామూహిక ప్రార్థనలు అదృశ్యమైపోవడాలు సమాజ నైతికతను నాశన చేస్తున్నాయి. మనం భౌతికంగా జీవిస్తున్నా ఆత్మికంగా కుంచించుకుపోయి ముగిసిపోతున్నాం. శవాల్ని ఖనన భూములకు తీసుకెళతారు. మనం టీవీ చానెళ్లలో చూస్తాం. గణాంకాల పెరుగుదలని గ్రహిస్తాం. ఎలాగో ఒకలా భయంతో ఏకాంతంలో ఏకాకిగా బతికేస్తాం. కానీ అది కాదు కావలసింది. సామూహిక విముక్తి కోసం ప్రార్థిస్తూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని మరణించ డానికి సిద్ధపడాలి. ఏకాంతంలో అర్థరహిత జీవితం కంటే సమూహంలో అర్థవంతమైన మరణమే మేలనే ప్రాతిపదికతో, ప్రేమ సహజీవనం పునాదులుగా కొత్త సమాజ నిర్మాణం జరగాలి.

రెండవది. మన అహం మన చావుభయాన్ని రెట్టింపు చేస్తుందని గుర్తించాలి. మనం మరణాన్ని అవమానించడానికి కారణం మనం దానిలో వికారాన్నీ, అవాంఛనీయతను చూడడమే! పెరిగిన స్వాతిశయం వల్ల జీవించడమంటే దేన్నో పొంది వుండడమనీ, జీవితమై ఉండడమంటే ప్రతిష్టనీ, డబ్బునీ, అధికారాన్ని కలిగి ఉండడమనీ, ఆనందం అంటే తాత్కాలిక సంతోషాలనీ భావిస్తాం. అమెరికా లో bestsellers అంటున్న విధంగా 'జీవితం ఒక పిక్నిక్ పార్టీ' అనుకుంటాం. అయితే ఈ పిక్నిక్ ఒక భ్రమ. ఎందుకంటే ఇందులో ఎక్కువ కలిగి ఉన్నకొద్దీ ఎక్కువ పోగొట్టుకునే ప్రమాదం ఉంది. మరణం మనల్ని మరింత భయపెడుతుంది. ఎందుకంటే బిలియనీర్లు, అందాల రాణులు, మహా నియంతలు కూడా బూడిదైపోయారు. చిన్ని నీలిరంగు పూవుకు అతిశయం ఉండదు. అది హాయిగా వికసించి స్వేచ్ఛగా వాడిపోతుంది. బహుశ మనల్ని ఆవహించిన భ్రమాన్విత అహాల సంకెళ్లను తెంచుకోవడం ద్వారా మన అస్తిత్వాన్ని తేలిక పరచుకోవచ్చు. అప్పుడు మాత్రమే మనం మన పరీమళాన్ని వ్యాపింప చేయగలుగుతాం . ప్రేమనూ, మరణాన్నీ తాకించినపుడే జీవితం ఉత్సవమౌతుంది. అప్పుడు మాత్రమే మనం వాల్ట్ విట్మన్‌తో నడుస్తూ, 'ఇప్పటివరకూ పుట్టిన పురుషులందరూ నా సోదరులు, స్త్రీలందరూ నా అక్కచెల్లెళ్లూ, ప్రేమికులూ' అని అనగలుగుతాం.

ఈ దృశ్యాన్ని చూడడానికి మనం సిద్ధంగా ఉన్నామా? వైరస్ మరోసారి మన అహంలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. అది మనల్ని అణకువగా ఉండమని చెబుతోంది. అది మనం సంధానింపబడి ఉన్నామని తెలుసుకోమంటుంది. జీవన్మరణాల మర్మాన్ని వేరు చేయలేమని చెబుతోంది. పదార్థ శూన్యాల అవిభాజ్యతను గుర్తించమంటోంది. మరణాన్ని చులకన చేసే సమాజం, మరణించే కళను గౌరవించని సమాజం మానసిక రోగి వంటిదని చెబుతోంది.

( ది ట్రిబ్యూన్, జులై 01, 2020 ) ❑


తెలుగు: **కొప్పర్తి వెంకటరమణమూర్తి**

# '1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు' ఇప్పుడెందుకు చదవాలి? (మొదటి భాగం)

మందలపర్తి కిషోర్



'1844నాటి అర్థశాస్త్ర తత్వశాస్త్ర రాతప్రతులు' గురించి ఇవాళ మనం మాటాడుకోబోతున్నాం. అసలు, '1844 నాటి అర్థశాస్త్ర తత్వశాస్త్ర రాతప్రతులు' అనే శీర్షికలోనే అంతా వుంది. ఇది అచ్చువెయ్యడం కోసం సిద్ధం చేసిన ప్రతి కాదన్నది ఇందులోని మొదటి పాయింటు. అందుకే, అచ్చులో కూడా అది 'రాతప్రతులు' గానే ఉండిపోయింది. (ఇక ముందు, ఈ రచన గురించిన ప్రస్తావన వచ్చినప్పుడల్లా దాన్ని 'రాతప్రతులు' అనే అంటాను!) ఇందులో చర్చనీయాంశాలేమిటన్నది రెండో పాయింటు. మొదటి స్థానం అర్థశాస్త్రానికి దక్కింది;




'రాతప్రతులు'లో ఉన్నవి పదకొండు అధ్యాయాలయితే, పది అర్థశాస్త్రానికి సంబంధించినవే మరి! తత్వశాస్త్రానికి సంబంధించిన ఒకే ఒక్క అధ్యాయం ఆఖరిదీ, అతికీలకమయిందీ కూడా. ఈ 'రాతప్రతులు' ఎప్పుడు రాసినవన్నది మూడో పాయింటు. శీర్షికలోనే '1844' అని వుంది కదా!!

పోతే – నిజానికిది, సమగ్ర రచనేం కాదు; పుస్తకం కానే కాదు. ముఖ్యంగా, ఈ 'రాతప్రతులు' ఇతరులను ఉద్దేశించి రాసినవి కాదు; మార్క్స్ తను ఉపయోగించుకునే నిమిత్తం రాసుకున్న 'రాతప్రతులన్నీ దొరకలేదు కూడా! ఇవి రాసుకుని ఇప్పటికి – ఈ 2020 నాటికి– కేవలం 176 ఏళ్ళే అయింది! "స్వీయ స్పష్టీకరణ క్రమంలో అనేక అంశాలపై కార్ల్ మార్క్స్ రాసుకున్న నోట్సు ఈ 'రాతప్రతులు' ఇందులో రాసుకున్న –దాదాపు– ప్రతి అంశాన్నీ విశదీకరిస్తూ మార్క్స్ తర్వాతి కాలంలో ఉద్గ్రంథాలే రాశారు.

ఇక్కడ 'దాదాపు' అనే మాట కావాలనే వాడాను– ఎందుకంటే, ఈ మాటకు కొన్ని మినహాయింపులున్నాయి. మనకి తగినంత తీరికా, ఓపికా మిగిలితే ఆ మినహాయింపుల్ని కూడా స్పృశిద్దాం.

ఇందులోని విషయాలన్నింటినీ మార్క్స్ విశదీకరించినప్పుడు ఈ నోట్సును మనం ఇప్పుడెందుకు చదవాలి?

అడిగినా, అడక్కపోయినా, ప్రతి ఒక్కరి మనసులోనూ తలెత్తే ప్రశ్న ఇది! దానికి బలమయిన కారణం ఒకటుంది– ఉంది కనకనే, 'వేదిక' ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది.

✧

మార్క్సిస్టు అధ్యయన పద్ధతికి కొన్ని ప్రాథమిక లక్షణాలున్నాయని మనలో చాలా మందికి తెలుసు. 'చారిత్రిక నేపథ్యంతోనే చర్చనీయాంశాన్ని అధ్యయనం చెయ్యడం' అనేది వాటిల్లో ముఖ్యమయింది. ఉదాహరణకి ఆ మధ్యన మనం ఫ్రెంచి విప్లవం గురించిన అధ్యయనం చరిత్ర నేపథ్యంగానే చేశాం. తర్వాత సామ్రాజ్యవాదం తీరు తెన్నుల గురించి కూడా చారిత్రికంగానే అధ్యయనం చేశాం. నిన్నగాక మొన్న, "పాలిటిక్స్ ఆఫ్ సైన్స్" అనే అంశం గురించి కూడా చారిత్రిక దృక్పథంతోనే చర్చించాం.

ఎందుకని ఆయా వక్తలందరూ ఆ పద్ధతి పాటించారు? మీలో చాలా మందికి జవాబు తెలుసు!

చారిత్రక పరిణామాలను అధ్యయనం చెయ్యడానికి అదే శాస్త్రీయమయిన, వైజ్ఞానికమైన పద్ధతి కాబట్టి, ఈ 'చారిత్రిక దృక్పథం' అనే దాన్ని మార్క్సిజం చరిత్రకు సైతం వర్తింపచెయ్యాలి మనం! మరీ ముఖ్యంగా, మార్క్స్ మేధో పరిణామక్రమాన్ని అధ్యయనం చేసే సందర్భంలోనూ ఈ పద్ధతి పాటించాలి. అలా ఈ అధ్యయనానికి ప్రత్యేక ప్రాముఖ్యం వుంది కనకనే ఇవాళ మనం 'రాతప్రతుల' పరామర్శ చేస్తున్నాం.

ఇవాళ్టి మన చర్చకు అవసరమయిన చారిత్రిక నేపథ్యం అనేక మూలాల నుంచి తీసుకున్నాను; అందుకు ఆయా రచయితలకూ, ప్రచురణకర్తలకూ థ్యాంక్స్, ముఖ్యంగా చెప్పవలసిన వనరు ఒకటుంది– 'రాతప్రతులు' ఇంటర్నేషనల్ ఎడిషన్‌కి ప్రొ.డీ.జే. స్ట్రూయ్క్, సమకూర్చిన విపులమయిన ముందుమాటే అది! మార్క్స్ రచనలతో సహా ముఖ్యమయిన వాటన్నిటికీ ఇలా చారిత్రిక నేపథ్యం సమకూర్చుకునే చదవాలి.

✧

మార్క్స్ అయినా, మరెవరయినా పుడుతూనే మేధావిగా పుట్టరు – కృషితోనే ఎవరయినా మేధావులయ్యేది. ఆ క్రమం ఎలా సాగిందో అధ్యయనం చెయ్యడానికి 'రాతప్రతులు' మంచి వనరుగా ఉపయోగపడుతుంది. 'రాతప్రతులు' మార్క్స్ ప్రధాన రచనల్లో ఒకటి కాదనే మాటా నిజమే– చారిత్రికంగా ఈ రచనకు ఎంతో ప్రాధాన్యం ఉందనే మాట కూడా వాస్తవమే!! మార్క్స్ మేధోపరిణామం అర్థం కాకపోతే, "యంగ్ హెగేలియన్"గా వుండిన మార్క్స్ ఎందుకు మార్క్సిస్టు అయ్యాడో అర్థం కాదు. ఈ పరిమితమయిన ప్రయోజనంతోనే ఇవాళ, రేపు మనం 'రాతప్రతులు' పరిశీలిద్దాం.

✧

ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమయిన విషయాల గురించి చెప్పాల్సిన బాధ్యత నాకుంది.

1. మార్క్సిజం అధ్యయనం చేసే బృందాల్లో అధ్యాపకులూ విద్యార్థులు అనే విభజన మాటవరసకు మాత్రమే. మనది 'వ్యాన్ గార్డ్' ఉద్యమం అన్నాడు లెనిన్; ఇందులో అందరం సహచరులమే, అనుచరులు ఉండరు! డేవిడ్ హార్వే గురించి మనలో చాలామందికి తెలుసు. యాభయ్యేళ్ళకు పైగా ఇదే పద్ధతిలో ఆయన క్యాపిటల్ చదువుతున్నారు; ఆయనతో పాటు కొంతమంది సహపాఠకులు ఎప్పుడూ ఉంటారు; మనదీ అదే పద్ధతి.

2. అయితే, నేను వృత్తిరీత్యా అనువాదకుణ్ణి – హార్వే లాగా అధ్యాపకుణ్ణి కాదు; ముఖ్యంగా ఆయన లాగా మార్క్సిజం ఆపోసన పట్టినవాళ్లేం కాదు. ఇదేమో అసంపూర్ణంగానూ, అతుకులతుకులు గానూ ఉన్న చరిత్ర ప్రధానమయిన రచన. నాకన్నా సమర్థులను ఇవాళ అధ్యాపకులుగా ఏర్పాటు చేసుకునివుంటే మరింత న్యాయం జరిగి వుండేదేమో! అంచేత మీరెవ్వరూ ఇవాల్టి ప్రసంగవ్యాసం విని వూరుకోవద్దు – తప్పకుండా 'రాతప్రతులు' చదవండి.

ఇవి ఇంగ్లిష్‌లో సుబోధకంగానూ, చక్కగా ఎడిట్ చేసిన కాపీ రూపంలోనూ, దొరుకుతున్నాయి.

మార్క్సిస్ట్ డాట్ ఆర్గ్ వెబ్‌సైట్లో రెండు అనువాదాలు దొరుకుతున్నాయి – ఈ లింక్ ప్రయత్నించి చూడండి:

https://www.marxists.org/archive/marx/works/1844/manuscripts/preface.htm

3. ఇక అచ్చులోనే, అదీ ఇంగ్లిష్ లోనే, ఈ పుస్తకం చదవదల్చుకున్నవారికి ఓ సలహా– 'ఇంటరేషనల్ పబ్లిషర్స్ ఎడిషన్' సంపాదించి చదవండి; ఆన్‌లైన్ బుక్ సెల్లర్స్ ద్వారా దొరుకుతుంది.

మనకందరికీ తెలిసిన ఓ విషయం చెప్తా–

మనం తినే తిండే మనకి ఒంటబడుతుంది! ఒకానొక పిండి వంట రుచుల గురించి ఇతరులు ఎంత అద్భుతంగా వర్ణించినా, మనకి తిన్న తృప్తి కలగదు. పుస్తకపఠనం విషయంలో కూడా ఇదే జరుగుతుంది. అంచేత, ఎవరికి వాళ్ళే 'రాతప్రతులు' చదవండి; లోతుగా అధ్యయనం చెయ్యండి.

మార్టిన్ మిలిగాన్ ఆంగ్లానువాదం ఆధారంగా నేను చేస్తున్న అనువాదం త్వరలో తెలుగులో దొరుకుతుంది. బహుశా ఈ ఏడాది చివరికి 'రాతప్రతుల తెలుగు అనువాదం అందరికీ అందుబాటులోకి రావచ్చు.

(మిత్రులు సాగర్ చెణికినట్లుగా ఇది వ్యాపార ప్రకటన మాత్రమే!)

✧

ఇవాల్టి మన నేపథ్య సంగీతాన్ని అందరికీ తెలిసిన కొన్ని విషయాలతో మొదలుపెడతాను.

మనలో చాలామందికి మార్క్సిజానికి మూడు మూలాలూ, మూడు భాగాలూ ఉన్నాయని తెలుసు.

జెర్మన్ తత్వశాస్త్రం, ఇంగ్లిష్ రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రెంచ్ సోషలిజం మార్క్సిజానికి మూడు మూలాలు.

భౌతికవాద సిద్ధాంతం, (అదనపు) విలువ సిద్ధాంతం, కార్మికవర్గ నేతృత్వంలో సాగే వర్గపోరాట సిద్ధాంతం

ఇవీ మార్క్సిజానికి మూడు భాగాలని లెనిన్ చెప్పాడు.

స్థూలంగా ఈ మూడు వనరులూ, మూడు భాగాలపై మార్క్స్ అధ్యయనం ఒక కొలిక్కి వస్తున్న దశ 1844.

1844 అంటే, 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక రాయడానికి నాలుగేళ్ల ముందన్న మాట.

అప్పట్లో మార్క్స్ పారిస్‌లో ఉండేవాడు; ఎంగెల్స్ 'ఇంగ్లంలో కార్మికవర్గం స్థితిగతులు' రాసివున్నాడు. మార్క్స్ ఎంగెల్స్ తొలి ఉమ్మడి రచన జెర్మన్ ఐడియాలజీ రూపొందడానికి ముందు సంవత్సరమది. మార్క్స్ ఈ 'రాతప్రతులు ' రాసుకున్న ధోరణిలోనే ఇతర రచనలు కూడా చేయడం గమనార్హం. ఉదాహరణకి, 1845లో రాసిన 'థీసెజ్ ఆన్ ఫాయెర్‌బాఖ్' కూడా ఒకే పుస్తకంగా రాసిన రచన కాదు. అది కూడా వ్యాసశకలాల సంకలనం; రూపంలో 'రాతప్రతుల'కు దగ్గరగా వున్నట్లనిపిస్తుంది. వాటిని ఎంగెల్స్ సవరించి, "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్....." పుస్తకానికి అనుబంధంగా చేర్చి ప్రచురించారు. అయితే, సారం విషయానికి వచ్చే సరికి 'రాతప్రతులు'లో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది.

ఉదాహరణకి, ఎంగెల్స్ రాసిన తొలి క్లాసిక్ 'ఇంగ్లండ్‌లో కార్మికవర్గం...' అప్పటికే మార్క్స్ చూసి వున్నాడు. పారిశ్రామిక సమాజాల్లో కార్మికుల జీవనం ఎలా వుంటుందో 'రాతప్రతులు'లో మార్క్స్ కూడా వర్ణించాడు. అది మాంచెస్టర్ , శాల్‌ఫర్డ్ వాడలలోని కార్మిక జీవనంపై ఎంగెల్స్ కథనానికి ఎంతో చేరువగా వుంటుంది. ఇంగ్లండ్ మాట ఎలా వున్నా, అప్పటికి ఫ్రాన్స్‌లో మార్క్స్ కూడా విస్తృతంగా పర్యటించి వున్నాడు. అయినా, కార్మికుల స్థితిగతులు ఇక్కడొలాగా, మరోచోట మరోలాగా వుండవు కదా!

✧

ఇక, సార్వజనీనమూ, సాపేక్షికార్థంలో సార్వకాలికమూ అయిన అనేక విషయాలను కూడా మార్క్స్ ప్రస్తావించాడు. ఉదాహరణకి, శ్రమతో శ్రామికుడి వేర్పాటు – ఎస్ట్రేంజ్‌మెంట్ – పరాయీకరణ – ఏలియనేషన్ – లాంటివి. ఇవి, మానవాళికి సహజమయిన స్వభావాన్ని ప్రభావితం చేసే కీలకాంశాలు. వర్గ సమాజాల్లో పీడితుల ప్రవర్తన సరళిని ప్రత్యక్షంగా ప్రభావితం చేసే విషయాలివి. శ్రమశక్తి దోపిడీ ఉన్నంతకాలం ఈ విషయాలు చర్చనీయాంశాలుగా కొనసాగుతూనే వుంటాయి. అంతకాలమూ, 'రాతప్రతుల' ప్రాసంగికత చెక్కు చెదరదు!!

✧

లెనిన్ చెప్పిన మూడు మూలాల్లో రెండో స్థానం ఫ్రెంచ్ సోషలిజానికి దక్కింది. చాలా మంది దృష్టిలో ఈ ద్వితీయమే అద్వితీయమయింది– ఎందుకంటే, విప్లవకార్యాచరణ వైపు ఆకర్షితులయ్యే వాళ్ళను ముందుగా ఆకట్టుకునేది రాజకీయ అంశమే! అయితే, లెనినే మరో మాట చెప్పాడు– "సిద్ధాంతం లేని ఆచరణ గుడ్డిది; ఆచరణయోగ్యం కాని సిద్ధాంతం గొడ్డుది" అని. మార్క్సిజం మూలాల్లో ఫ్రెంచ్ సోషలిజం పాత్ర అద్వితీయమే కానీ, తత్వశాస్త్రం పాత్రేం తక్కువ కాదు! దేని ప్రాముఖ్యం దానిదే!!

✧

ఫ్రాన్స్‌వా నోయెల్ బేబఫ్ గురించి 'రాతప్రతులు' లో ప్రస్తావనవశంగా చెప్పాడు మార్క్స్. పద్దెనిమిదో శతాబ్దానికి చెందిన ఫ్రెంచ్ విప్లవకారుడు బేబఫ్. క్రీ. పూ. రెండో శతాబ్దానికి చెందిన విప్లవాత్మక సంస్కర్త 'గ్రాకస్'తో బేబఫ్‌ను పోల్చి చెప్పారు ఆయన అనుచరులు. బేబఫ్ ఉద్యమానికి పాలకవర్గాలు పెట్టుకున్న ముద్దుపేరు 'కుట్ర.' వికీపీడియాతో సహా, అన్ని ప్రామాణిక' సమాచార వేదికల్లోనూ బేబఫ్ కుట్రదారుడి అవతారంలోనే దర్శన మిస్తాడు.

బేబఫ్ అనుచరులందరిలోకీ విశిష్టమయిన వ్యక్తిత్వం బువనరోతీది. "ఇటాలియన్ ఊహాస్వర్గవాది"గా బువన రోతీ ప్రసిద్ధుడు. బేబఫ్ ఉద్యమ చరిత్రను 'సమానత్వం కోరుకునే వారి కుట్ర' పేరుతో అక్షర బద్ధం చేశాడు బువనరోతీ. రాతప్రతులు' రాసే నాటికి మార్క్స్‌పై బువనరోతీ ప్రభావం గాఢంగా ఉంది.

'ఫ్రెంచ్ విప్లవ యుగం' నాటి రాజకీయ కుట్రదారుడిగా మాత్రమే చరిత్రకెక్కిన బేబఫ్ గొప్ప జర్నలిస్ట్ కూడా. కానీ, ఏ 'ప్రామాణిక' జర్నలిజం చరిత్ర పుస్తకాల్లోనూ బేబఫ్ పేరు కనిపించదు. బేబఫ్ అనుచరుడు, లవాయ్, జర్నల్ డి లా ఇగాలిటీ (సమానత్వం పత్రిక) సంపాదకుడిగా పనిచేశాడు. జర్నలిజం చరిత్ర గ్రంథాల్లో లవాయ్ పేరూ కనిపించదు!

కానీ, మార్క్స్ మాత్రం తన 'రాతప్రతులు'లో వీళ్ళందరి గురించి ప్రస్తావించాడు. మళ్ళీ ఏదో అసందర్భంగా కాదు– అక్షరాలా ససందర్భంగానే!!

ఇంతకీ ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో బేబఫ్, లవాయ్, బువనరోతీల స్థానం ఏమిటి? మనకి మార్క్స్ లాంటి విప్లవకారుణ్ణి ఇచ్చింది అలాంటి వాళ్లే మరి! అందుకే, మార్క్స్ తన 'రాతప్రతులు' లో వీళ్ళందరినీ ప్రస్తావించాడు.

1791 ఫ్రాన్స్ ఎన్నికల సందర్భంగా, "సామాజిక హోదా" ప్రాతిపదికగా వోటుహక్కు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ విధానాన్ని తూర్పారబట్టాడు బేబఫ్; పన్ను మొత్తం పెరిగే కొద్దీ పన్ను రేటు

పెంచాలని బేబఫ్ డిమాండ్ చేశాడు. దీన్ని ప్రోగ్రెసివ్ ట్యాక్సేషన్ సిస్టమ్ అంటారనుకుంటా – ఇదంతా పద్దెనిమిదో శతాబ్ది చివరి రోజుల మాట! అప్పుడైనా, ఇప్పుడైనా అలా మాటాడితే ఏం జరుగుతుంది? కటకటాలు లెక్కపెట్టాల్సి వస్తుంది!

సమానత్వ సాధన ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోయేందుకు పత్రిక మంచి సాధనమని బేబఫ్ గుర్తించాడు. మరో అర్ధ శతాబ్దం తర్వాత రంగంలోకి దిగిన మార్క్స్ కూడా అదే విధంగా ఆలోచించాడు. ఇప్పటికీ, ప్రగతి శీల భావాలున్న ప్రతి రాజకీయ ఉద్యమం, తనకంటూ ఒక పత్రిక ఉండాలనుకుంటోంది.

✧

వాస్తవానికి, మార్క్స్ రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనంలో తలమునకలై వున్న దశలో రాసుకున్నవీ 'రాతప్రతులు' అని చెప్పుకున్నాం కదా– ఆయన ఆ అధ్యయనాన్ని ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో ఒక్కసారి పరిశీలిద్దాం. 'రాతప్రతులు' రాసుకోడానికి రెండేళ్ళు ముందు రెయనిషె జెయటుంగ్ పత్రిక మొదలయింది. దాదాపు తొలినాళ్లనుంచీ మార్క్స్ ఈ పత్రికలో విభిన్న విషయాల గురించి రాస్తూ వచ్చాడు.

ఈ పత్రికకు తొలిఎడిటర్‌గా ఎంపికయిన మోజెస్ హెస్‌తో పరిచయం మార్క్స్ జీవితాన్ని మలుపు తిప్పింది. హెస్‌తో పాటుగా ఫ్రెంచ్ సోషలిజం భావనలతో కూడా ఇక్కడే మార్క్స్‌కు పరిచయమయింది. వాస్తవానికి అప్పటికి మార్క్స్‌కు గట్టిగా పాతికేళ్ళు కూడా లేవు – అప్పుడప్పుడే డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నాడు! అయితే, అప్పటికే ఆయన మేధస్సు తగినంత గుర్తింపును పొంది వుంది. "లోతయిన తాత్విక ప్రాముఖ్యాన్ని సునిశితమైన చతురోక్తులతో మేళవిస్తాడు మార్క్స్, రూసో, వోల్టేర్, హోల్ బఖ్, లెసింగ్, హెగెల్‌లను ఒకే వ్యక్తిలో ఐక్యం చేసి చూడండి – నేనంటున్నది వాళ్లందరినీ ఒకే వ్యక్తిత్వంలో 'ఐక్యం' చెయ్యమని, కట్టగట్టి పెట్టమని కాదు! – అప్పుడు మీ కళ్లముందు డాక్టర్ మార్క్స్ ప్రత్యక్షమవుతాడు " అన్నాడు మోజెస్ హెస్ ఓ లేఖలో.

✧

ఈస్థిలస్, షేక్స్పియర్, గొయ్థే, షెల్లీల పేర్లు హెస్ ఎత్తకపోయినా వాళ్ల రచనలు మార్క్స్‌కు కొట్టిన పిండి! అయితే, తత్వశాస్త్ర గ్రంథాలూ, సాహిత్యం, న్యాయశాస్త్రం తప్ప మిగతా విషయాలతో మార్క్సుకున్న పరిచయం పరిమితం. హెస్ చెప్పిన పేర్లలో స్మిత్, రికార్డో, షూల్జ్, జేమ్స్ మిల్, జే.బీ.సే, బ్యూరేలాంటి అర్థశాస్త్రవేత్తల పేర్లు కనబడకపోవడం కాకతాళీయం కాదు. రాజకీయ అర్థశాస్త్రం గురించి మార్క్స్ ఏకాగ్రంగా కృషి చెయ్యడం అప్పుడప్పుడే మొదలుపెట్టారు మరి!!

దీన్నిబట్టి మనకి ఏమర్థమవుతోంది? –

రెయ్‌నిషె జెయ్‌టుంగ్ పనిచెయ్యాలనుకోవడంతోనే, మార్క్సిజం దిశగా మార్క్స్ ప్రయాణం మొదలయింది! ఆ రోజుల్లో తత్వశాస్త్రం, సాహిత్యం లాంటి రంగాల్లో వాస్తవ జీవిత విమర్శకు పెద్ద ప్రాధాన్యం ఉండేది కాదు. అలాంటి రంగాల్లో జీవిత వాస్తవాల గురించిన చర్చకు ప్రాధాన్యం ఆశించడం దురాశే అవుతుంది. (ఉన్న మాట చెప్పాలంటే, ఇప్పటికీ ఈ రంగాల పరిస్థితుల్లో పెద్ద మార్పు లేదు!) కానీ, మార్క్స్ ఆ రంగాల్లో సీరియస్‌గా కృషి ప్రారంభించిన మనిషి. తనకు తెలియని విషయాలను మనసుపెట్టి తెలుసుకునే ప్రయత్నం చేయడం ఆయన స్వభావం. అందుకే, పోటీపరీక్షలకు తయారయ్యే విద్యార్థిలా ఆయన రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనం మొదలుపెట్టారు. ఈ క్రమాన్ని మనకు సూచన ప్రాయంగా తెలియచేస్తాయి 1844నాటి 'రాతప్రతులు'.

✧

చిత్రమేమిటంటే, మార్క్స్‌కు ఫ్రెంచ్ సోషలిజంతో పరిచయం కల్పించిన మోజెస్ హెస్ వైరుధ్యాల పుట్ట. ఎంగెల్స్‌కు కూడా సోషలిజం కమ్యూనిజాలను పరిచయం చేసినవాడు హెస్సే! తాను సోషలిస్టునూ, కమ్యూనిస్టునూ అని చెప్పుకుంటూనే యూదు జాత్యహంకారాన్ని ఆశ్రయించాడు హెస్. స్పినోజా ప్రభావంతో నైతిక, నైష్ఠికవాదిగా అవతరించి, "లేబర్ జియోనిజం" అనే వింతవాదానికి జన్మనిచ్చాడు! అలాంటి వాడితో మార్క్స్ – ఎంగెల్‌కు సరిపడక పోవడంలో విడ్డూరమేముంది? జెర్మన్ ఐడియాలజీలో హెస్ భావాలను కూడా వాళ్ళిద్దరూ ఆక్షేపించారు; అధిక్షేపించారు.

హెస్ సోషలిజం, మార్మికత కలగలిసిపోయి గందరగోళానికి కారణమయ్యాయి. ఈ సంగతి అతని రచనలు చదివినవారందరికీ తెలుసు. "దైవ సామ్రాజ్యంగా ఉండదగిన నూతన యెరూషలేము ను నిర్మించడం సాధ్య"మేనన్నాడు హెస్. అయితే, దాన్ని "సొంత ఆస్తికి తావులేని సమాజంలో మాత్రమే" నిర్మించగలమని కూడా అన్నాడాయన.

ఇలాంటి సైద్ధాంతిక గందరగోళాన్ని సహించేంత హృదయ వైశాల్యం మార్క్స్, ఎంగెల్స్‌లకు ఎప్పుడూ లేదు.

అయినప్పటికీ, మార్క్స్‌ను మార్క్సిజం వైపు మళ్లించిన ఘనత మాత్రం హెస్‌కే దక్కాలి!!

✧

ఇంతకీ హెస్ ఘనతను కీర్తించేందుకు ఇదంతా చెప్పడం లేదు– చరిత్రను రీవైండ్ చేసి, మనకు నచ్చని నిజాలను సవరించాలనుకోవడం చారిత్రిక దృక్పథం కాజాలదు! మన బుద్ధికి తోచిన రీతిలో చరిత్ర లేదు కనక దాన్ని వక్రీకరించాలనుకోవడం కుసంస్కారుల పని.

ఇక్కడే మరో విషయం కూడా చెప్పుకోవలసివుంది– వ్యక్తులు ఎంత గొప్పవారైనా చారిత్రిక దృక్పథం కోల్పోయినప్పుడు వారికి ఆక్షేపణలూ అధిక్షేపాలే మిగులుతాయి.

చరిత్రను సక్రమంగా అర్థం చేసుకునే శక్తి, సంస్కారం ఉండాలే కానీ, మనకి పనికిరానిదేమీ లేదు.

ఉదాహరణకి, రాజకీయ అర్థశాస్త్రవేత్తల మీద మార్క్స్ రాసుకున్న నోట్సు చూడండి. 'రాతప్రతులు'లో దాదాపు 13–14 పేజీల మేరకు విస్తరించిన "భూమి కౌలు" అధ్యాయం చూడండి– ఆ అధ్యాయంలో ఆనాటి ప్రసిద్ధ అర్థశాస్త్రవేత్తలు చెప్పిన విషయాలపై నోట్సు ఉన్నాయి. అవన్నీ ఆయా ప్రముఖుల ప్రముఖ రచనల నుంచి ఉటంకించిన భాగాలే! ఎటొచ్చీ, ఆయా అర్థశాస్త్రవేత్తలు ఏ వరసలో రాశారో మార్క్స్ అదే వరసలో ఉటంకించలేదు!! పైపెచ్చు, వాళ్లు ఏ తీర్మానాలు చేశారో వాటితో సంబంధంలేని విషయాలను మార్క్స్ రుజువు చేశాడు. చరిత్ర సారం, శాస్త్ర హృదయం అర్థం చేసుకున్న మౌలిక మేధావికే ఇది సాధ్యం.

✧

మార్క్స్ మేధోపరిణామానికి అమరిన చారిత్రిక నేపథ్యాన్ని ఇతర మూలాల ద్వారా కూడా తెలుసుకోవచ్చు. 1842లో వెలువడిన ఓ పుస్తకం అనేకమంది జెర్మన్లకు ఫ్రెంచ్ సోషలిస్ట్ ఉద్యమాన్ని లోతుగా పరిచయం చేసింది. 'దెయర్ సోత్సియలిస్మస్ కొమ్యూనిస్మస్ దస్ హాయ్‌తిజెన్ ఫ్రాంకెయేక్స్' దాని పేరు. "వర్తమాన ఫ్రాన్స్‌లో సోషలిజం, కమ్యూనిజం" అనేది దాని అర్థం; రచయిత లారెన్జ్ స్టెయ్న్, ఫ్రాన్స్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న "సామాజిక శక్తుల" గురించిన నివేదిక ఈ పుస్తకం. దీనికి సమాచారం సేకరించేందుకు స్టెయ్న్ ఓ పరిశోధనాత్మక పర్యటన చేపట్టాడు. తను సేకరించి విశ్లేషించిన సమాచారాన్ని జెర్మన్ అధికారులకు విధేయంగా నివేదించాడు కూడా.

ఈ పుస్తకం శాంతియుతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సోషలిస్టుల గురించి సానుకూలంగా రాసింది. విప్లవాత్మక ప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న కమ్యూనిస్టుల గురించి మాత్రం వక్రీకరణలు కుమ్మరించింది. హెగెల్ – సెయింట్ సిమోన్‌ల దగ్గరే ఆగిపోయిన వ్యక్తి రాసిన పుస్తకం ఎలా ఉండాలో అచ్చం అలాగే ఉందది. అయితే, కూలంకషమైన సమాచారం, పద్ధతి ప్రకారం పేర్చిపెట్టిన విషయ సంగ్రహం అందులో ఉన్నాయి.

ఈ పుస్తకంలో స్టెయ్న్ వర్గపోరాటాన్ని స్పష్టంగా వర్ణించడం గమనార్హం. "స్వేచ్ఛా సమానత్వాల పతాకమెత్తిన పారిశ్రామిక సమాజంలో పేదరికం పేరుకుని ఉందన్నాడు. "అది నిష్ఠ దరిద్రం; పారిశ్రామిక లేదా రాశీభూతమయిన పేదరిక"మని స్టెయ్న్ పేర్కొన్నాడు. "చట్టబద్ధంగా సకల స్వేచ్ఛలకూ పాత్రుడైన కార్మికుడు ఈ సమాజంలో స్వేచ్ఛారహితుడై పడివున్నా"డన్నాడు. "ఎందుకంటే, అతగాడు అన్నిటికీ యజమాని మీదే ఆధారపడి మనుగడ సాగించాల్సి వస్తోం"దని – స్టెయ్న్ రాశాడు. అటువంటి పరిస్థితుల్లో అణగారిన వర్గాల పోరాటం ఊహాస్వర్గం దిశగా సాగుతుందని స్టెయ్న్ గుర్తించాడు. సోషలిజం–కమ్యూనిజాల దిశగా ఈ వర్గపోరాటం దారితీస్తుందని కూడా స్టెయ్న్ గుర్తించాడు. అటువంటి భావనలూ, వ్యవస్థల గురించి సాకల్యంగా వివరించిన తర్వాత స్టెయ్న్ జెర్మన్లకు ఓ ఉచిత సలహా ఇచ్చాడు. అదే జెర్మనీ భవిష్యత్తు కూడాననీ, అంచేత జాగ్రత్త పడమనీ హెచ్చరించాడు.

మార్క్స్ గానీ, ఎంగెల్స్ గానీ స్టెయ్న్ "నివేదిక" గురించి ఎక్కడా అంతగా చర్చించలేదు. జీవితసత్యాలు గ్రహించడానికి వారికి స్టెయ్న్ అవసరం ఎంతమాత్రమూ లేదు! ప్రత్యేకించి, కమ్యూనిజాన్ని వక్రీకరించిన ఊతకర్రల అవసరం వారికి ఎప్పుడూ ఎదురవలేదు. కార్ల్ గ్రూన్ రచన 'నిజమయిన సోషలిజం'ను విమర్శిస్తూ స్టెయ్న్ భావాలను గ్రూన్ కొట్టేశాడన్నాడు మార్క్స్, దాన్ని బట్టి ఆయన స్టెయ్న్ రచన క్షుణ్ణంగా చదివాడని మాత్రం అర్థమవుతుంది.

✧

హెగెల్ ప్రతిపాదించిన 'దృగ్విషయశాస్త్రం'పై తన విమర్శను మార్క్స్ 'రాతప్రతులు' లోనే మొదలుపెట్టాడు. హెగెల్ ప్రతిపాదించిన 'దృగ్విషయశాస్త్రం' లో మార్క్స్ రెండు మౌలికమైన తప్పులను కనుగొన్నాడు. మానవసారానికి దూరమయిన సారభూతమయిన అంశాలుగా సంపదనూ, రాజ్యాధికారాన్ని ప్రతిపాదించాడు హెగెల్. కానీ, ఆ పనిని కేవలం భావనాత్మకంగా, అనిర్దిష్టంగా మాత్రమే చేశాడు. ఆ మాటకొస్తే, హెగెల్ ప్రతిపాదించిన పరాయీకరణ సిద్ధాంతం మొత్తం అనిర్దిష్ట ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిందే. అనిర్దిష్ట చైతన్యమే నిజమయిన మానవ సారమని హెగెల్ నమ్మకం. అందుకే, మతం, సంపద వగయిరాలను ఆయన కేవల ఆధ్యాత్మిక అస్తిత్వాలుగా పరిగణించాడు. అంచేత, హెగెల్ నిజమయిన మానవ చరిత్రను రాయలేదు; దాని అనిర్దిష్ట, ఊహాత్మక రూపానికి మాత్రమే ఆయన అక్షర రూపమిచ్చాడు. మనిషిని చైతన్యంగానూ, చైతన్యాన్ని స్వీయచైతన్యంగానూ మాత్రమే హెగెల్ పరిగణించాడు. అందుకే, మనుషుల పరాయీకరణ మొత్తంగా స్వీయచైతన్య పరాయీకరణే నని భావించాడు.

సహజమయిన వస్తువులకు బదులుగా, అనిర్దిష్టమయిన 'వస్తుతత్వాలను' ప్రతిపాదించాడాయన. మనిషిని అనిర్దిష్ట పదార్థంగా మార్చే ప్రక్రియ, చివరికి అభావంగా మారుతుంది. ఒకానొక అస్తిత్వానికి వెలుపల వస్తువేదీ –పదార్థమేదీ– లేకపోతే అది నాస్తిత్వం (ఉన్‌వేసెన్)గా మారుతుంది; అటువంటి నాస్తిత్వాల చరిత్ర అవాస్తవిక చరిత్ర అవుతుంది; హెగెల్ దృగ్విషయశాస్త్రం చెప్పిన చరిత్ర అదే అయింది!

✧

అయితే, హెగెల్ సాధించిన ఒకానొక విజయం గురించి మార్క్స్ ఈ సందర్భంగా చెప్తాడు. మానవుడి సృజన శక్తిని ఒక పరిణామ క్రమంగా చెప్తాడు హెగెల్. 'వస్తునిష్టీకరణ' (ఆబ్జెక్టివైజేషన్)ను 'బాహ్యీకరణ' (ఎక్స్‌టర్నలైజేషన్) గా ఆయన అభివర్ణించాడు. దాని అధిగమనాన్ని (ట్రాన్సెండెంటలైజేషన్‌ను) శ్రమ ఫలంగా చెప్పాడు హెగెల్. ఇక్కడ హెగెల్ మనిషిని వాస్తవ రూపంలో చూశాడు; శ్రమ పరిణామ సారాన్ని ఆయన అర్థం చేసుకున్నాడు! జాతిపరమైన అస్తిత్వంగా మనిషి, తన జాతిపరమైన సామర్థ్యాలన్నింటినీ, శ్రమ ద్వారానే సాధించాడన్నాడు. ఈ విషయాన్ని ఎత్తి చూపించడం ద్వారా, హెగెల్, మిగిలిన తత్వవేత్తల కన్నా పది అంగలు ముందుకు వేశాడు. తన సమకాలికులూ, పూర్వికులూ మాత్రమే కాదు– తన వారసులకన్నా కూడా ఈ విషయంలో ముందున్నాడు!

తేనెటీగ రకరకాల పూలలోంచి తేనె చుక్కలు సేకరిస్తుందంటారు. అలాగే మార్క్స్ తన అవగాహనకు పనికొచ్చే అంశాలను విభిన్న మూలాల నుంచి సేకరించుకున్నాడు.

✧

1840 దశకం తొలినాళ్లలో మార్క్స్‌ను ప్రగాఢంగా ప్రభావితం చేసిన తాత్విక రచనలు ఫొయెర్‌బాఖ్‌వి. 'రాత ప్రతులు' రాసే నాటికే ఫోయెర్ బాఖ్ ప్రభావంలోనే, భౌతికవాద దృక్పథం ఏర్పర్చుకున్నాడు మార్క్స్. మతపరమైన విశ్వాసాలను వ్యతిరేకించడంతోనే తన స్వతంత్ర ప్రయాణం మొదలుపెట్టాడు ఫోయెర్‌బాఖ్. మనిషికీ ప్రకృతికీ మధ్యన ఉన్న సంబంధం ప్రాతిపదికగా, "వాస్తవ భౌతికవాదం" ప్రతిపాదించాడు ఫోయెర్ బాఖ్. ఆయన వైఖరి హెగెల్ పట్ల సానుకూల, నిర్మాణాత్మక విమర్శన దృష్టి కలిగి వుండడమేనని మార్క్స్ రాశాడు.

చివరి రోజుల్లో, హెగెల్ తన అనిర్దిష్ట మార్గంలో దైవ జ్ఞానం ప్రభావం నుంచి బయటపడడానికి ప్రయత్నించిన మాట నిజమే. కానీ, ఆయన దాని పరిధి నుంచి పూర్తిగా వెలుపలికి రాలేకపోయాడనే మాట కూడా వాస్తవమే మరి. మానవ చరిత్ర సజీవ–నిర్దిష్ట– బాధిత జనుల చరిత్రేనని హెగెల్ గుర్తించడానికి సైతం ఈ అనిర్దిష్ట వైఖరే అడొచ్చింది. చరిత్రను హెగెల్ ఎల్లెప్పుడూ ఓ ఊహాత్మక – కేవల చింతనాత్మక– ప్రక్రియగానే పరిగణిస్తూ వచ్చాడు. అందుకే, "సానుకూల , మానవతావాద, ప్రాకృతికవాద, విమర్శకు ఆద్యుడు ఫోయెర్‌బాఖ్ " అన్నాడు మార్క్స్.

✧

కానీ, ఫోయెర్‌బాఖ్, హెగెల్‌పై చెప్పుకోదగిన విజయం సాధించలేకపోయాడని కూడా అన్నాడు మార్క్స్, మనిషిని కేవలం జాతిపరమైన అస్తిత్వంగా మాత్రమే చూసే విపరీత ధోరణివల్లనే ఇలా జరిగిందని అన్నాడు. ప్రకృతిసిద్ధమైన 'జాతుల' నేపథ్యంలోనే మనిషిని అంచనా కట్టేందుకు ఫొయెర్ బాఖ్ పరిమితమయ్యాడు. సామాజిక నిర్మాణం నేపథ్యంలో మనిషిని చూడలేకపోవడంలోనే ఫొయెర్‌బాఖ్ వైఫల్యం దాగివుందన్నాడు మార్క్స్.

ప్రపంచాన్ని ధార్మిక ప్రపంచంగానూ, వాస్తవ ప్రపంచం గానూ రెండు ప్రతిబింబాలుగా చిత్రించాడు. పరస్పర

ప్రతిబింబాలుగా చిత్రించడంతో, లౌకిక ప్రపంచంలో ధార్మిక ప్రపంచాన్ని లీనం చేశాడు ఫోయెర్‌బాఖ్. అలా చేసినా, మౌలికమయిన కర్తవ్యం అపరిష్కృతంగానే మిగిలిపోయిందని ఆయన గుర్తించలేకపోయాడు. అసలు లౌకిక పునాదిని కూడా, దాని వైరుధ్యాలతో సహా అర్థం చేసుకోవాలి ముందు. ఆ వైరుధ్యాలను తొలగించుకున్న మీదట, ఆచరణలో విప్లవాత్మకతను సంతరించుకోవాలి.

మార్క్స్ తన విశ్లేషణాత్మక వివరణను కొనసాగిస్తూ ఇలా చెప్పాడు: అనిర్దిష్ట ఆలోచనతో సంతృప్తి చెందని ఫోయెర్‌బాఖ్, ఇంద్రియ జ్ఞానంతో కూడిన అవగాహన పెంచుకోవాలని అన్నాడు. కానీ, పాత భౌతికవాదం చెప్పిన పౌరసమాజం అనేదే ఫోయెర్‌బాఖ్ దృక్కోణం కూడా. నూతన భౌతికవాద దృక్కోణంలో, అది మానవ సమాజం, లేదా సామాజిక మానవాళి కావలసివుంది; కానీ కాలేదు. అయితే, ఈ అంశం పట్ల మార్క్స్ పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకున్నది మాత్రం 1844 తర్వాత కాలంలోనే– "థీసెజ్ ఆన్ ఫోయెర్‌బాఖ్", "జెర్మన్ ఐడియాలజీ"లలోనే అది వ్యక్తమయింది.

✧

'రాతప్రతులు' రాసేనాటికి మార్క్స్ వయసు 26 సంవత్సరాలు మాత్రమే! పైగా అప్పటికి కమ్యూనిస్ట్‌గా –ఆ మాటకొస్తే ఆర్థికవేత్తగా కూడా – మార్క్స్ 'పరిణామం' పూర్తి కాలేదు. (ఆర్థికవేత్తగా మార్క్స్ అనే బుక్‌లెట్ రాశాడు మారిస్ డాబ్. దాని తెలుగు అనువాదం కూడా వచ్చింది. అందరూ చదవాల్సిన బుక్ లెట్ అది!)

అయినప్పటికీ బహుముఖంగా వికసిస్తున్న మార్క్స్ మేధస్సు ఈ నోట్స్‌లో ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తుంది. ప్లేటో, కాంట్, స్ట్రాస్, హెగెల్, ఫోయెర్‌బాఖ్, లాంటి ప్రసిద్ధ తత్వవేత్తల ప్రస్తావనలు 'రాతప్రతులు'లో ఉన్నాయి. స్మిత్, రికార్డో, మాల్థస్ లాంటి ప్రసిద్ధ ఆర్థికవేత్తల గురించి విస్తృతమయిన ప్రస్తావనలూ ఉన్నాయి. అంతగా ప్రాచుర్యానికి రాని ఆర్థికవేత్తల గురించి కూడా, ఎన్నో విషయాలను మార్క్స్ వెల్లడించాడు. విలెహెల్మ్ షూల్జ్, జేమ్స్ మిల్, జే.బీ.సే ఎంతో ఉదారమైన, మౌలికమైన భావాలను అప్పుడే ప్రకటించారు. బ్యూరే, క్విస్నే, లయెల్, హంబోల్ట్, మెయ్‌స్లలండ్, షెవాలియె(ర్), డెస్ట్యూట్ డి ట్రేసీ, డెజామీలు కూడా.

కానీ, మనం కాలేజీల్లో చదువుకునే రాజకీయ అర్థశాస్త్ర చరిత్ర పుస్తకాల్లో ఈ విషయం ప్రస్తావించరు. మరో విషయం – వెల్ఫేర్ ఇకనామిక్స్ అనే భావనకు అమర్త్యసేన్ పితృపాదుడన్నట్లు మన వాళ్లు చెప్తారు. వాళ్ళూ వీళ్ళూ కాదు – సాక్షాత్తూ మన్మోహన్ సింగ్ పార్లమెంట్ సెంట్రల్ హాల్లోనే ఈ మాట అన్నారు. వాస్తవానికి అప్పటికి శతాబ్దంనర కిందటే, ఆ భావనలు వ్యక్తం చేసిన అర్థశాస్త్రవేత్తలను మార్క్స్ చదివారు. 'రాతప్రతులు' లో వారి మీద వ్యాఖ్యలు కూడా చేశారు; విమర్శలూ ఉన్నాయి!

ఇవన్నీ మార్క్స్ మార్క్సిస్టు అయ్యే క్రమంలో జరిగినవే– 'మ్యానిఫెస్టో రాసింతర్వాత కాదు! అధ్యయనం చేసే అంశాన్ని అడ్డుకోతగానూ – నిలువుకోతగానూ కూడా విశ్లేషించడం మార్క్స్ విశేషం. 'రాతప్రతులు'లో ఈ లక్షణం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది కనకే ఎంత అసమగ్రంగా వున్నా వాటిని చదవాలి! అంతేతప్ప, 'రాతప్రతులు' అసమగ్రంగా లేవు, అవి స్వయంసంపూర్ణ రచనలని బుకాయించకూడదు. అలా చెయ్యడం మార్క్స్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం!

మన మార్క్స్ దేవుడు కాడు– కష్టపడి తన మేధస్సును పదునుపెట్టుకోగలిగిన మానవమాత్రుడు! ఉన్నదున్నట్లు మాటాడుకుంటేనే, ఏవో అతిశయోక్తులు వల్లించినట్లు అనిపించే ప్రజ్ఞ మార్క్స్‌ది.

ఈ 'రాతప్రతులులోని రచనారీతి – సిద్ధాంత గ్రంథాల్లో కనిపించేటు వంటిది కాదు. ఆ మాటకొస్తే, మార్క్స్ రచనలు ప్రతి ఒక్క దాన్లోనూ ఇలాంటి రచనారీతే కనిపిస్తుంది. రుచీపచీలేని వచనం రాయడం మార్క్స్‌కి చేతకాదు. ఒక్క వాక్యంలోనే బోలెడంత భావం ఇమడ్చగలిగిన మౌలికత ఆయన సొంతం. ముఖ్యంగా, మార్క్స్ విశ్లేషణ సామర్థ్యం అనన్య సాధ్యం !!

ఈ విషయాలు మనకెలా తెలుస్తాయి?

"1844 నాటి అర్థశాస్త్ర తత్వశాస్త్ర రాతప్రతులు' చదివితేనే ఆనాటి మార్క్స్ మేధస్సు ఎలా వుందో తెలుస్తుంది. అందుకే ఈ రచన చదవాలి.

✧

(2020 సెప్టెంబర్ 5న 'వీకెండ్ విత్ వేదిక'లో చదివిన ప్రసంగ వ్యాసం మొదటి భాగం. కాగా సెప్టెంబర్ 6న చదివిన రెండో భాగం కూడా ఇస్తున్నాం)

# '1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు' ఇప్పుడెందుకు చదవాలి?

## (రెండో భాగం)

'రాతప్రతులనే కాదు, క్లాసిక్స్ గురించి తల్చుకోగానే ఒక ఎనెక్డోట్ గుర్తుకొస్తుంది.

మార్క్సిస్ట్ క్లాసిక్స్ క్షుణ్ణంగా చదివిన మొహిత్ సేన్ చెప్పిన కథనమిది–

బొంబాయ్‌లో కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఉండే రోజుల్లో అందులో అద్భుతమైన లైబ్రరీ కూడా ఉండేదట. ఆ లైబ్రరీలో కూర్చుని మార్క్స్ రాసిన పుస్తకమేదో చదువుతున్నారట మొహిత్ సేన్. అంతలో పీ.సీ. జోషీ లైబ్రరీలోకి వచ్చి, నిశ్శబ్దంగా మొహిత్‌సేన్ వెనక్కెళ్ళి ఆయన ఏం చదువుతున్నాడో చూశారట. జోషీ గారు అప్పట్లో పార్టీకి జాతీయ కార్యదర్శి – దాదాపు పుష్కర కాలం ఆ పదవిలో కొనసాగిన నాయకుడు. భారత దేశంలో కమ్యూనిస్ట్ ఉద్యమానికి నిర్మాణ స్వరూపం ఇచ్చినవాడు జోషీ గారే. అలాంటివాడే, మొహిత్ సేన్ మార్క్స్ రచన చదువుతుంటే ఆశ్చర్యపోయాట్ట!

"చూడు కన్నా! మార్క్స్ లెనిన్ కోసం రాశాడు; లెనిన్ స్టాలిన్ కోసం రాశాడు; స్టాలిన్ నా కోసం రాస్తున్నాడు; నేను మీ కోసం రాస్తున్నా, మీరు నేరుగా మార్క్స్‌ను చదవాల్సిన అవసరమేముంది?" అని అడిగాడట జోషీ గారు!

ఆజానుబాహుడయిన పీ.సీ.జోషీ దృక్పథమే అంత దివ్యంగా ఉంటే, ఇవేళ్టి అంగుష్ఠమాత్రుల గురించి చెప్పాలా? ఈ ధోరణి చాలా హానికరమయింది! ప్రపంచమంతా కమ్యూనిస్ట్ ఉద్యమం ఇబ్బందుల్లో పడ్డానికి ఈ ధోరణే కారణం!! మార్క్సిస్ట్ క్లాసిక్స్‌ను ఇంగ్లీష్‌లో చదువుకోగలిగితే ఉత్తమం. కనీసం అనువాదాలయినా సంపాదించి చదవండి!!

✧

'రాతప్రతులు' కేవలం తనకోసమే మార్క్స్ రాసుకున్న నోట్స్ మాత్రమే అని చెప్పుకున్నాం కదా! వాటిని, కూడా అధ్యాయాల ప్రాతిపదికగా రూపొందించి రాసుకున్నాడు మార్క్స్, ఆయన లేఖలకు సైతం నిర్దిష్ట నిర్మాణం వుంటుంది ముఖ్యంగా, ఎంగెల్స్‌కి రాసిన లేఖలు చూడండి! ఈ నిర్మాణం ఆ లేఖల్లో లేదు– అది మార్క్స్ ఆలోచనల్లో ఉంది! పక్కదారులు తీస్తున్నానని మీరనుకోకపోతే, ఓ విషయం చెప్తా–

మార్క్స్ చివరి రోజుల్లో ఆయన ఆరోగ్యం బాగా దెబ్బ తినేసింది – శ్వాసకోశ వ్యాధీ, చర్మ వ్యాధీ ముదిరిపోయాయి. 1882 శీతకాలంలో లండన్‌పై చలిపులి పంజా విసరడం ఖాయమని నిపుణులు హెచ్చరించారు. దాంతో, ఆ టైమ్‌కి మార్క్స్ లండన్‌లో ఉండడానికి వీల్లేదని ఎంగెల్స్, మార్క్స్ కుటుంబ సభ్యులు నిర్ణయించారు. అంతా కలిసి మార్క్స్‌ను అల్జీర్స్ వెళ్ళేందుకు ఒప్పించారు. అక్కడ బహుశా రెండు వారాలున్నాడేమో పెద్దాయన– యూరప్‌కి బయట ఆయన గడిపిన కాలం అదే! ఆ రోజుల్లోనే ఆయన – అక్కడి వేడి భరించలేక – గడ్డం తీసేసి, ఆ అవతారంలో ఓ ఫోటో కూడా తీయించుకున్నాడు. ఎంగెల్స్‌కీ, రెండో కూతురు లారా లఫార్గ్‌కి అల్జీరియా నుంచి రెండు లేఖలు రాశాడు మార్క్స్.

వాటిల్లో, అల్జీరియన్ మూర్స్ గురించి అద్భుతమయిన వర్ణన కనిపిస్తుంది; వాళ్ళ జీవనసరళి అంతటినీ చిత్రించేశాడు! నా చిన్నప్పుడు 'ఏషియా అండ్ ఆఫ్రికా' అనే పత్రికలో దాని పూర్తి పాఠం అచ్చు వేశారు. ఇతరత్రా కూడా ఈ సమాచారం నమోదయింది; ఈ లింక్‌లో మార్క్స్ లేఖలపై ఒక కథనం దొరుకుతుంది.

https://lareviewofbooks.org/article/the-last-journey-of-karl-marx/

ఈ లింక్‌లో లారాకు రాసిన లేఖ పూర్తి పాఠం దొరుకుతోంది

https://hutnyk.wordpress.com/2015/08/18/on-marx-in-algeria

1882/#:~:text=Engels%20writing%20to%20Bernstein% 2022, himself%20wasn%27t%20very%20keen.

ఇవి చదివితే, మార్క్స్, ఎంగెల్స్‌ల ప్రతి అక్షరంలోనూ వాళ్ల ఆత్మ ప్రతిఫలిస్తుందని తెలుస్తుంది. అందుకే వాటిని మనసు పెట్టి చదవాలి! ఈ కారణం చేతనే, మార్క్స్ తన కోసమే రాసుకున్నప్పటికీ 'రాతప్రతులు' శ్రద్ధగా చదవాలి. మళ్లీ చెప్తున్నా – పురాణ ప్రవచనం విని తృప్తి పడినట్లు కాకుండా దయచేసి 'రాతప్రతులు' తప్పకుండా చదవండి!! మార్క్స్ తన దృష్టికి వచ్చిన విషయాలను తానే స్వయంగా అధ్యయనం చేశాడు; తర్వాతే అభిప్రాయాలు చెప్పాడు. మనకి మార్క్స్ మాటల కన్నా ఆయన చేతలు ఎక్కువ ముఖ్యం!!

✧

'రాతప్రతులు' మొత్తం దొరకలేదు కానీ దొరికినమేరకు వాటిని పరిశోధకులు, సంపాదకులు చక్కగా విశ్లేషించారు. మార్క్స్ స్పష్టంగా పేర్కొన్న అధ్యాయాలకు తోడు మిగతా సమాచారాన్ని కూడా స్వతంత్ర అధ్యాయాలుగా పేర్కొన్నారు. ఇవన్నీ చదువరుల సౌలభ్యం దృష్టిలో పెట్టుకుని, మరింత స్పష్టత కోసం చేసిన పనులే!

చివరికి, ఇప్పటి 'ప్రామాణిక' ప్రతిలో –ప్రవేశికతో కలుపుకుంటే – పదకొండు అధ్యాయాలు ఉన్నాయి. ఎంగెల్స్ రాసిన 'రాజకీయ అర్థశాస్త్ర విమర్శ – ఓ రేఖాచిత్రం' అనే వ్యాసాన్ని సంపాదకులు అనుబంధంగా చేర్చారు. దాంతో, 'రాతప్రతుల'కు నిండుదనం సమకూరినట్లయింది.

ఒక్కసారి ఈ 'రాతప్రతుల' విషయ సూచికను చూడండి:

ప్రవేశికను పక్కన పెడితే, శ్రమకు వేతనాలు, పెట్టుబడిపై లాభం భూమి కౌలు, పరాధీన శ్రమ పెట్టుబడి – శ్రమల ప్రతివాదం సొంత ఆస్తి–శ్రమ, సొంత ఆస్తి – కమ్యూనిజం, మానవ అవసరాల అర్థం బూర్జువా సమాజంలో డబ్బుకున్న శక్తి, హెగెల్ గతితర్కం మొత్తం తాత్విక ధోరణిపై విమర్శ అనేవి ఇందులోని అధ్యాయాలు. ఎంగెల్స్ రాసిన రాజకీయ అర్థశాస్త్ర విమర్శ రేఖామాత్ర చిత్రణ అనుబంధంగా అమరింది.

ఆయా అధ్యాయాల్లో మార్క్స్ ఏయే అంశాలను చర్చించాడో స్థూలంగా చూద్దాం. ప్రవేశికను పక్కన పెడితే, మొదటి తొమ్మిది అధ్యాయాలూ రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనంలో భాగమే. పదోది, హెగెల్ మార్క్స్ తెంచుకున్న బొడ్డుతాడు గురించి చెప్పేది; పేరుకు అవి వేరూ, ఇది వేరూ అని చెప్పుకున్నా అన్నీ సమానంగానే ముఖ్యమయినవి!

✧

'రాతప్రతుల' చర్చనీయాంశాలేమిటో మార్క్సే స్వయంగా 'ప్రవేశిక' లో చెప్పాడు.

"రాజ్యం, న్యాయశాస్త్రం, సామాజిక నీతిశాస్త్రం, పౌరజీవితం వగయిరాలకూ– రాజకీయ అర్థశాస్త్రానికీ మధ్య వున్న అంతస్సంబంధాన్ని ఈ రచనలో ప్రస్తావిం"చానని ఆయన అన్నాడు. "ఫ్రెంచ్, ఇంగ్లిష్, జెర్మన్ సోషలిస్టుల రచనలను ఇందులో ఉపయోగించుకున్నా"నన్నాడు మార్క్స్, ఎంగెల్స్, హెస్ జెర్మన్‌లో చేసిన 'మౌలిక, సారవంతమయిన' రచనలు కూడా తనకు ఉపయోగపడ్డాయని చెప్పాడు. "హెగెల్ తర్వాత, ఫొయెర్‌బాఖ్ రచనలే నిజమయిన సైద్ధాంతిక విప్లవాన్ని తమలో ఇముడ్చుకుని వున్నా"యనీ అన్నాడు. చిట్టచివరి అధ్యాయం హెగెల్ తాత్వికత గురించి – ముఖ్యంగా గతితర్కం గురించి– చర్చించేందుకే కేటాయించాడు. "మొత్తంగా హెగెల్ తాత్వికతతో ఉన్న విభేదాలన్నిటికీ అంతిమ పరిష్కారంగానే ఈ అధ్యాయాన్ని ఉద్దేశించా"నన్నాడు.

దీన్ని బట్టి ఏం అర్థమవుతోంది?

లెనిన్ చెప్పిన మూడు మూలాలూ – మూడు భాగాల గురించే 'రాతప్రతులు' చర్చించాయని తేలిపోతోంది!

చిత్రమేమిటంటే, మూడు మూలాలూ – మూడు భాగాల గురించి చెప్పిన లెనిన్ ఈ 'రాతప్రతులు' చూడనే లేదు! ఆయన చనిపోయిన తర్వాత మూడేళ్ళకు గానీ 'రాతప్రతులు' బయటపడలేదు; ఏడెనిమిదేళ్ళకు గానీ అవి అచ్చుకానే లేదు! మరి లెనిన్ అంత స్పష్టంగా మూడు మూలాలూ – మూడు భాగాల గురించి ఎలా చెప్పగలిగారు?

మార్క్స్– ఎంగెల్స్‌ల ప్రధానమయిన రచనలు చదివిన వాళ్లందరికీ ఈ ప్రశ్నకు జవాబు తెలుసు!! 'రాతప్రతులు' రూపుదిద్దుకునే నాటికే వాళ్ళిద్దరూ –ఎవరికి వారుగా – మార్క్సిజం దిశగా ప్రయాణం ప్రారంభించారు. మార్క్స్ మరణానంతరం 'కమ్యూనిస్ట్ పార్టీ ప్రణాళిక'కు రాసిన తొలిముందుమాటలో ఈ విషయాన్ని ఎంగెల్స్ చెప్పారు. ఎత్తుపల్లాలెన్ని ఎదురైనా మార్క్స్, ఎంగెల్స్ వాళ్ళ జీవితకాలంలో ఎన్నడూ ఈ బాటనుంచి పక్కకు తప్పుకోలేదు.

✧

1844 నాటికే మార్క్స్, ఎంగెల్స్ మార్క్సిజం దిశగా ప్రయాణం ప్రారంభించారని చెప్పుకున్నాం కదా.

వాళ్లను ఈ ప్రయాణానికి పురికొల్పిన ప్రధాన కారణం ఏమయివుండొచ్చు? 'రాతప్రతులు' చదివితేనే ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది! ఈ 'రాతప్రతులు' రాసుకున్న కొద్దికాలానికే మార్క్స్ 'థీసెజ్ ఆన్ ఫొయెర్‌బాఖ్' రాశాడని చెప్పుకున్నాం కదా– ఇవి పదకొండు వ్యాసశకలాలు; వాటిల్లో పదకొండోది సుప్రసిద్ధం– అందులోంచి ఓ కొటేషన్ మనం తరచు వింటుంటాం: "ఇప్పటి వరకూ తత్వవేత్తలు ప్రపంచానికి రకరకాలుగా భాష్యాలు చెప్తూ వచ్చారు; కానీ, అసలు విషయం ఏమిటంటే, ఈ ప్రపంచాన్ని మార్చడం!"

ఈ స్ఫూర్తే 'రాతప్రతులు'లో పరుచుకునివుంది!!

✧

'రాతప్రతులు' తొలి అధ్యాయమే 'శ్రమకు వేతనాలు' అనే అంశాన్ని చర్చించింది. హెగెల్ కూడా శ్రమ గురించీ, మానవ జ్ఞానపరిణామం గురించి చెప్పిన మాట నిజమే! కానీ, శ్రమనూ, దాని వేర్పాటునూ, పరాయీకరణ క్రమాలనూ భావవాదం మబ్బు తెరల మాటునుంచే చూపించాడు.

ఆ మబ్బు తెరలను చీల్చిన సూర్యుడు మార్క్స్ – వాటిని దైనందిన, వాస్తవ జగత్తు అనే నేలమీదికి దించాడు! శ్రమకు కార్మికుడు దూరం కావడంలోనూ, పరాయివాడైపోవడంలోనూ

ఓ వాస్తవ – భౌతిక క్రమాన్ని చూశాడు మార్క్స్. రాజకీయ అర్థశాస్త్రంలో ఈ క్రమాలకు సంబంధించిన మర్మాలను వెల్లడించే విషయముందని గ్రహించాడు. అందుకే, 'రాతప్రతులు' తొలి అధ్యాయాల్లో ఆనాటి ప్రముఖ రాజకీయ అర్థశాస్త్రవేత్తల సిద్ధాంతాలపై వ్యాఖ్యలే కనిపిస్తాయి.

✧

వాళ్ళెవరు?

యాడమ్ స్మిత్, రికార్డో, జేమ్స్ హిల్, మెక్ కల్లో, జే.బీ.సీ, డెస్టట్ ద ట్రేసీ, బోయ్స్ గిల్బర్ట్, విల్ హెల్మ్ షూల్జ్ – ఈ పొలిటికల్ ఇకానమిస్టులు రూపొందించిన సిద్ధాంతాలను విశ్లేషించడంతోనే మునుంపట్టాడు మార్క్స్, వీళ్లందరిలోనూ కనిపించే సామాన్య ప్రాథమిక విశిష్టత ఒకటుంది–

వాళ్లందరూ సకల సంపదలకూ శ్రమే మూలమని గుర్తించారు; తమ రచనల్లో అదే విషయం చాటించారు! విలువయిన లోహాలే సంపదకు మూలమన్నది వాణిజ్య ఆర్థికవేత్తల అవగాహన; భూమే సకల సంపదలకూ మూలమన్నది వ్యవసాయార్థికవేత్తల (ఫిజియోక్రాట్ల) అవగాహన;

వాళ్ల అవగాహనలకు విరుద్ధమయిన అవగాహన రాజకీయ అర్థశాస్త్రవేత్తలది.

వ్యవసాయార్థికవేత్తలు శ్రమను వ్యవసాయ పరికరాల్లో భాగంగా పరిగణించారు. పంచభూతాల్లో ఒకానొక రూపమయిన భూమిని సంపదకు మూలకందంగా వాళ్లు ఎంచారు. కానీ, సంపదలన్నిటికీ శ్రమే మూలమని ఆధునిక ఆర్థికవేత్తలు మాత్రమే గుర్తించారని మార్క్స్ రాశాడు.

వీళ్ళందరూ రాజకీయ అర్థశాస్త్రవేత్తలే కావడం కాకతాళీయం కాదు సుమా! కూడబెట్టిన శ్రమే పెట్టుబడి అని గుర్తించి, నిర్వచించిన శాస్త్రం అది!! అలా గుర్తించి, నిర్వచించినందుకే మార్క్స్ వాళ్లని అభిమానించి అధ్యయనం చేశాడు. అంతవరకూ బాగానే వుంది– కానీ, రాజకీయ అర్థశాస్త్రవేత్తల పరిమితులను గుర్తించడంలో మార్క్స్ విఫలం కాలేదు. రాత ప్రతుల్లో కాదు కానీ, ఇతరత్రా– సంపదలకు మూలం కేవలం శ్రమే కాదనీ, భూమి కూడా సంపద నిస్తుందన్నాడు.

✧

నిజానికి, చరిత్ర పరిణామం మొదలయినప్పట్నుంచీ సంపదలకు మూలంగా శ్రమే వుంటూ వచ్చింది. కానీ, ఆ విషయాన్ని ఆధిపత్య వర్గాలూ, వాళ్ళ పోషణలో ఉండే మేధావి వర్గాలూ ఎక్కడా చెప్పలేదు. పైపెచ్చు, "మంత్రాధీనం జగత్సర్వం – తన్మంత్రం బ్రాహ్మణాధీనం" అని ఒకడన్నాడు. మాణిక్యం, ముక్తాఫలం, విద్రుమం, మరకతం, పుష్పరాగం, వజ్రం, నీలం, గోమేధ, వైడూర్యాలే (అంటే మణులు, ముత్యాలు, పగడాలు, పచ్చలు, రత్నాలు, వజ్రాలు, నీలాలు, గోమేదికాలు, వైడూర్యాలే) సకల సంపదలకు మూలమన్నాడు మరొకడు – ఈ నవరత్నాలకూ, నవగ్రహాలకూ ముడిపెట్టాడింకొకడు! ఏ సంపదనయినా, మనకు అందించేది మాత్రం శ్రమేనని రాజకీయ అర్థశాస్త్రవేత్తలే తేల్చిచెప్పారు.

అవసరమయిన ప్రతి సందర్భంలోనూ మార్క్స్ – ఎంగెల్స్ రాజకీయ అర్థశాస్త్రవేత్తల వాదాలను తొక్కి నారతీశారు! ఉదాహరణకి యాడమ్ స్మిత్ పై వాళ్ల విమర్శలను తీసుకుందాం– స్మిత్ లెక్క ప్రకారం సంపదంతా పారిశ్రామిక సంపదే. సొంత ఆస్తి యొక్క వికసిత రూపం పారిశ్రామిక వ్యవస్థ అన్నాడు స్మిత్. అదే విధంగా, శ్రమ యొక్క వికసిత రూపమే పరిశ్రమ అని కూడా ఆయన సిద్ధాంతీకరించాడు.

ఈ వాదంలో ఉన్న దగుల్బాజీతనాన్ని ఎంగెల్స్ ఒక్క పోలికతో వెల్లడించాడు. ఎంగెల్స్ యాడమ్ స్మిత్‌ని అర్థశాస్త్రం పాలిట మార్టిన్ లూథర్‌గా అభివర్ణించాడు. సంపదలకు మూలం, మనిషికి ఆవల ఉందని భావించే వాణిజ్య వ్యవసాయార్థికవేత్తలు క్యాథలిక్కుల్లాంటి వాళ్ళు క్యాథలిక్కుల భ్రష్టాచారాలను వ్యతిరేకించి క్రైస్తవ ధార్మికతను మనుషుల ఆత్మిక జగత్తుకు మళ్లించిన వాడు లూథర్. అదే రీతిలో, స్మిత్ కూడా మనిషికి ఆవలగా ఉన్న సంపద మూలాన్ని తుడిచిపెట్టి, దాన్ని మనుషులలోనే పాదుకొల్పాడు. అంతవరకూ బాగానే వుంది కానీ, అసలయిన మర్మం ఇక్కడే వుంది మరి!

✧

మతాన్ని మనుషుల ఆత్మిక వ్యవహారంగా మార్చడం ద్వారా లూథర్ మతాన్ని నిర్మూలించలేదు. సొంత ఆస్తిని, శ్రమనుంచి పుట్టినదానిగా నిర్ధరించడం ద్వారా స్మిత్ కూడా సొంత ఆస్తిని రద్దుచెయ్యలేదు. అయితే, సొంత ఆస్తి రూపుదిద్దుకునే క్రమంలో మానవ శ్రమ పాత్రను నిర్ధరించడం ద్వారా ఓ వాస్తవం గుర్తించాడు. ఈ క్రమం మనుషుల అమానవీకరణ – డీహ్యూమనైజేషన్– క్రమానికి దారితీస్తుందని గుర్తించాడు స్మిత్. దాంతో సొంత ఆస్తికి సారంగా మనిషి నిలబడుతున్నాడు. ఈ విధంగా, సొంత ఆస్తి మనిషిని తన గుప్పిట్లో పెట్టుకునేలా చేస్తోంది రాజకీయ అర్థశాస్త్రం. సొంత ఆస్తి సృష్టించే బీభత్సాన్ని సహజమయిన, అవసరమయిన పరిణామంగా చిత్రిస్తోంది ఈ 'శాస్త్రం!'

మానవ సారం పట్ల, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల రాజకీయ అర్థశాస్త్రం, తన ఆవేదనను వ్యక్తం చేస్తూనే ఉంటుంది. ఈ క్రమంలో బూర్జువా రాజకీయ అర్థశాస్త్రం ఆత్మ వంచనను

వదిలించుకోక తప్పలేదు. యాడమ్ స్మిత్ నుంచి జే.బీ.సే, రికార్డో, మిల్ వరకూ– ఎవరిని చదివినా ఈ విషయం బోధపడుతుంది. అనగా – రాజకీయ అర్థశాస్త్రం వికసించే క్రమంలో కటిక నిస్పృహవాదం ప్రకటించక తప్పదు! ఆ విధంగా మనుషులు ప్రకృతికీ, సాటివారికీ పరాయివారుగా మారే క్రమాన్ని అది మరింతగా వెలుగులోకి తెచ్చింది. ఇక్కడే మార్క్స్ ఈ రాజకీయ అర్థశాస్త్రంతో తెగతెంపులు చేసుకుని, పరిపూర్ణ కార్మిక వర్గ దృక్పథాన్ని ప్రకటించాడు.

✧

ఆ ప్రకటన ఎంత శక్తిమంతంగా ఉందో ఒక్క ఉదాహరణ చూడండి :

"పెట్టుబడి అంటే తనకు తాను సంపూర్ణంగా కోల్పోయిన మనిషనే అర్థం.

ఈ వాస్తవానికి వైయక్తిక వ్యక్తీకరణే కార్మికుడు.

ఇదే వాస్తవానికి వస్తుగతమయిన వ్యక్తీకరణే పెట్టుబడి. కానీ, కార్మికుడు సజీవమూలధనంగా –అది కూడా, అవసరాలెన్నో ఉన్న పెట్టుబడిగా బతకవలసిరావడం, అతడి దురదృష్టం.

పనిచెయ్యకుండా ఉండే ప్రతి ఒక్క క్షణమూ ఈ సజీవ మూలధనంపై వడ్డీ –అంటే కార్మికుడి జీవన భృతి నష్టపోవలసి వస్తుంది.

పెట్టుబడిగా కార్మికుడి విలువ, సరఫరా, గిరాకీలపై ఆధారపడి పెరుగుతూ వుంటుంది.

అతగాడి భౌతిక అస్తిత్వాన్ని, సరుకు సరఫరాగా మాత్రమే పరిగణిస్తారు. అంటే కార్మికుడి జీవితాన్ని, మిగతా అన్ని సరుకులతో సమానంగానే చూశారు. ఇక ముందు కూడా చూస్తారు.

కార్మికుడు పెట్టుబడిని సృష్టిస్తాడు– పెట్టుబడి కార్మికుణ్ణి సృష్టిస్తుంది.

అంటే, అతగాడు తనను తానే సృష్టించుకుంటాడన్నమాట.

ఈ మొత్తం ఆవృత్తానికి ముగింపుగా మనిషి కార్మికుడిగా అంటే ఓ సజీవ సరుకుగా అవతరిస్తాడు.

కార్మికుడు కావడం తప్ప మరేమీ కాని మనిషి – అంటే కేవల కార్మికుడి– మానవ లక్షణాలన్నీ, అతగాడికి పరాయిదయి పోయిన పెట్టుబడిలోనే ఉనికిలో ఉంటాయి.

మనిషి, పెట్టుబడి పరస్పరం పరాయివి.

ఒకానొక యాదృచ్ఛిక, నిర్లిప్త, బాహిర బంధం పుణ్యమా అని వారికి కత్తు కలిసివుండొచ్చు.

కానీ, పరస్పరం ఈ పరాయితనం అనేది వాస్తవ రూపం తీసుకోవడమనేది అనివార్యం.

పెట్టుబడిదారుకు (అవసరం కారణంగానో, లౌల్యం కారణంగానో) కార్మికుడి అక్కర తీరిందనుకున్న ఉత్తర క్షణం కార్మికుడి అక్కర స్వయంగా అతడికి సైతం తీరిపోతుంది.

అతగాడికి ఇకపై పనివుండదు కనుక, జీతమూ ఉండదు.

అతగాడికి కార్మికుడిగా తప్ప మానవమాత్రుడిగా వేరే ఏ ఉనికీ లేదు.

ఆ కారణంగా పని పోయిన వెంటనే తనను తాను పాతరేసుకోవచ్చు.

లేదా ఆకలికి మాడి తనువు చాలించనూవచ్చు.

తనకు తాను పెట్టుబడిగా పనికొచ్చినంత కాలమే కార్మికుడు కార్మికుడిగా బతికివుంటాడు.

కార్మికుడి అక్కర తెలిసిన పెట్టుబడి ఏదైనా ఉన్నంత వరకే అతను తనకు తాను పెట్టుబడిగా పనికొస్తాడు.

అంటే పెట్టుబడి అస్తిత్వమే కార్మికుడి అస్తిత్వం అదే అతగాడి బతుకు.

ఎందుకంటే, ఆ పెట్టుబడే అతగాడి ఆయుష్షును నిర్వికల్పంగా, నిర్లిప్తంగా నిర్ణయిస్తుంది.

పనిలో లేని వాణ్ణి, ఈ సంబంధానికి అతీతంగా పనిచేసుకునే కార్మికుణ్ణి, రాజకీయ అర్థశాస్త్రం గుర్తించదు.

మోసకారి, దొంగ వంచకుడు బిచ్చగాడు, నిరుద్యోగి, ఆకలితో మాడేవాడూ నీచుడూ నేరస్థుడు– లాంటి ఆకృతులు, ఇతరులకు కనిపించవచ్చు కానీ, రాజకీయ అర్థశాస్త్రం లెక్క ప్రకారం అవి అస్తిత్వంలో లేవు.

వైద్యులు న్యాయమూర్తులూ సమాధులు తవ్వేవాళ్లు అప్పులు వసూలు చేసే చిరుద్యోగులూ రాజకీయ అర్థశాస్త్రం అనే లోకానికి ఆవల తిరుగాడే భూతాలూ దెయ్యాలూను. అంచేత, రాజకీయ అర్థశాస్త్రం మేరకు కార్మికుల అవసరాలు రెండే లక్ష్యాల కోసం ఉద్దేశించినది.

పని చేస్తున్నంత సేపు అతగాణ్ణి బతికించి వుంచడం; కార్మిక జాతి అంతరించిపోకుండా చూసుకోవడం !

ఆ విధంగా, ఉత్పాదక సామర్థ్యం కలిగిన పరికరాల నిర్వహణకూ వాటిని ఉపయుక్త స్థితిలో ఉండేలా చూసేందుకూ చేసే సేవలకు ఉండే ప్రాముఖ్యమే శ్రమశక్తికి చెల్లించే వేతనాలకు సైతం ఉంటుంది.

పెట్టుబడి పునరుత్పత్తి –అది కూడా వడ్డీతో సహా– జరిగేలా

చూసే నిమిత్తం మూలధనాన్ని వినియోగించడం లాంటిదే ఇది కూడా.

యంత్రంలో చక్రాలు నిర్నిరోధంగా తిరిగేందుకు కందెన పూయడం లాంటిదే ఇది కూడా.

అంచేత, వేతనాలు పెట్టుబడిలో భాగంగా ఉండేవే; అవి పెట్టుబడిదారుడు తప్పని ఖర్చులు మాత్రమే.

ఈ అవసరానికి ఉండే ప్రాముఖ్యం పరిమితులను అది మించకూడదు.

1834 నాటి సవరణ బిల్లు అమల్లోకి రాకముందు పేదరికం శాతం ప్రాతిపదికగా కార్మికులకు ప్రభుత్వం అందించే దానధర్మాల మొత్తాన్ని వారి వేతనాల్లోంచి మినహాయించేవారు ఇంగ్లీష్ పరిశ్రమాభిపతులు.

ఈ మొత్తాన్ని కూడా వేతనంలో అవిభాజ్య భాగంగా భావించేవారు.

వాళ్లలా భావించడం ఎంతయినా హేతుబద్ధమే మరి!

✧

పైన, “1834 నాటి సవరణ బిల్లు” అనే దాని ప్రస్తావన వచ్చింది కదా, అదేమిటో చూద్దాం - 1834లో బ్రిటిష్ పార్లమెంట్ “పేదరికం చట్టసవరణ శాసనం” తీసుకొచ్చింది. దీన్నే “కొత్త పేదరికం శాసనం” (న్యూ పూర్ లా) అని వ్యవహరించడం కద్దు! అది అమల్లోకి రాకముందు బ్రిటిష్ కార్మికులకు ఇచ్చే దానధర్మాల మొత్తాన్ని వారి వేతనాల్లోంచే మినహాయించేవారు.

ఎంతయినా బ్రిటిష్ పరిశ్రమాధిపతులు ధర్మప్రభువులు- వాళ్లని అందుకే జెంటిల్మెన్ అంటారు మరి! చిన్న విషయం - పిడకలవేట లాంటిది- చెప్పాలనిపిస్తోంది; బ్రిటిష్ న్యాయ కోవిదుడు, సోవియెట్ జ్యూరిస్ప్రుడెన్స్ నిపుణుడు, రాజ్యాంగ అధ్యయనంలో నిష్ణాతుడు, పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ అనే స్వతంత్ర అధ్యయన విభాగానికి పితామహుడు, హెరాల్డ్, లాస్కీ ఆయన “ద డేంజరాఫ్ బీయింగ్ ఎ జెంటిల్మన్” అనే గొప్ప రచన చేశాడు. అందులో బ్రిటిష్ పెద్దమనిషి తరహాను ఏకి పారేశాడు. ఆయన మార్క్సిస్ట్ కాదు కానీ, మార్క్స్ “రాతప్రతులు” అంటే లాస్కీకి ప్రాణం- ఎందుకో వివరించాలా??

చర్చనీయాంశానికి వస్తే, మార్క్స్ రాజకీయ అర్థశాస్త్రవేత్తల వాదాలను బేషరతుగా అంగీకరించలేదు! అవసరమైనప్పుడల్లా మార్క్స్ - ఎంగెల్స్ రాజకీయ అర్థశాస్త్రవేత్తల వాదాలను తొక్కి నార తీశారు! వర్తమాన పౌర - బూర్జువా వ్యవస్థను సమర్థించడానికి బదులుగా దానిపై దాడికి దిగాడు మార్క్స్, పెట్టుబడిదారీ వ్యవస్థలోని మూడు ప్రాథమిక ఆదాయ మార్గాలను విశ్లేషించి ఆ వ్యవస్థ స్వభావాన్ని వెల్లడించాడు.

వేతనాలు, లాభాలు, కౌలు- ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ తాలూకు ప్రాథమిక ఆదాయ మార్గాలు. వాటిలో సకల సంపదల సృష్టికర్తలయిన శ్రామికులకు దక్కేవి వేతనాలు మాత్రమే! పెట్టుబడిదార్లకు దక్కేవి పెట్టుబడిపై వచ్చే లాభాలు! ఇక, భూస్వాములకు -అంటే, ఫ్యూడల్ భూస్వాములు కాదు, భూమి యజమానులకు- దక్కేది భూమి కౌలు. ఇలా, లోతుగా విశ్లేషించడం ద్వారా ఈ వ్యవస్థ తాలూకు అమానుష స్వభావాన్ని మార్క్స్ బట్టబయలు చేశాడు.

✧

మార్క్స్ ఈ వాస్తవాన్ని వెల్లడి చేసిన తీరు ఎంత స్పష్టంగా ఉందో వివరించి చెప్పాలంటారా? దాన్ని వివరించడానికి ఎక్కువ మాటల అవసరం లేదు! సంపదలన్నింటికీ శ్రమే మూలం కానీ, శ్రామికుడికి అందులో అతి తక్కువ భాగమే చేతికొస్తోంది. బతికి బట్టకట్టడానికి కటాకటిగా సరిపోయేంత మాత్రమే కార్మికులకు దక్కుతుంది; కాదు- దక్కనిస్తారు! అంటే, శ్రామికుల శ్రమ ఫలితంలో అత్యధిక భాగం - అదనపు విలువ రూపంలో - పెట్టుబడిదారుల గుప్పిట్లోకి పోతోంది. ఫలితంగా, పెట్టుబడికీ శ్రమకూ మధ్య తీవ్రమయిన వైరుధ్యం తలెత్తుతుంది; అది పోరాటానికి దారితీస్తుంది! కానీ, ఈ పోరాటంలో పరిస్థితులన్నీ పెట్టుబడిదారుల పక్షానికి అనుకూలంగా ఉంటాయనేమాట ఓ చేదు నిజం!! వేతనాలను కనిష్ఠ స్థాయిలో ఉండేలా చెయ్యడమే ఈ పోరాటం ద్వారా పెట్టుబడిదారులు ఆశించే లక్ష్యం. కార్మికుడు ఆర్థికంగా ఎలా దిగజారుతున్నాడో, పెట్టుబడిదారులు ఎలా సంపన్నులవుతున్నారో మార్క్స్ నిరూపించాడు.

✧

సంపద నానాటికీ అత్యల్ప సంఖ్యాకుల చేతిలో కేంద్రీకృతమయ్యే ధోరణిని ఆనాడే గుర్తించాడు మార్క్స్, ఆ ధోరణి ఇవేళ విపరీత ప్రమాణాలకు చేరుకుందని మనకందరికీ తెలుసు. ముఖ్యంగా భారత దేశంలో ఈ ధోరణి వికృత స్వరూపం ఇటీవల మరింతగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గుత్త పెట్టుబడిదారులు మరిన్ని లాభాలు నొల్లుకుపోయే ధోరణినీ గుర్తించాడు మార్క్స్, పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాలు పరస్పరం పోటీ పెంచుకోవడానికి దారితీస్తాయి; ఇది పరిశ్రమలకూ, వ్యవసాయానికి సమానంగా వర్తిస్తుంది- ఎందుకంటే, మట్టికి ఆపాదించిన మనోహరమయిన కల్పనలను, పెట్టుబడిదారీ దోపిడీ ధ్వంసం చేస్తుంది. పర్యవసానంగా ఆ వ్యవస్థ కుప్పకూలిపోతుంది. నిజమయిన విముక్తి సాధించిన కార్మికుడి పురిటిగడ్డగా మారుతుంది భూమి!

'రాతప్రతులు' లో శ్రామికుడి వాస్తవ పరిస్థితులను వర్ణించి ఊరుకున్నాడా మార్క్స్ ? లేదు– అంతకే పరిమితమయివుంటే, 176 ఏళ్ల తర్వాత ఈ 'రాతప్రతులు' గురించి మనం మాట్లాడుకోనక్కర్లేదు.

✧

ముందే చెప్పినట్లు 'రాతప్రతులు' చిట్టచివరి అధ్యాయంలో తన నూతన తాత్విక భూమిక గురించి చెప్పాడు మార్క్స్,

సహజంగానే, ఇది హెగెల్ తాత్వికత గురించి లోతుగా విశ్లేషించడానికే అంకితమయింది. హెగెల్‌లో మనకి కొట్టొచ్చినట్టు కనిపించేది ఆయన ఆశావాదం.

ఈ ప్రపంచం సమస్తాన్నీ –అంటే, చైతన్య ప్రపంచం మొత్తాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమేనని హెగెల్ చాటించాడు. ఈ క్రమంలో కేవల తాత్వికత, కేవల హేతువాదం విజయం సాధించాయని హెగెల్ తేల్చి చెప్పాడు. హెగెల్ ఏమంటున్నాడో చూడండి:

"మనిషి తనను తాను గౌరవించుకుని, అత్యున్నతుడనని భావించాలి.

ఆత్మ (పరమాత్మ?) ఔన్నత్యం గురించీ, శక్తిసామర్థ్యాల గురించీ అతిగా అంచనా వెయ్యకూడదు.

గుప్తమయి, మార్మికమయి వుండే విశ్వసారం, తనను తాను ఇకపై రక్షించుకోజాలదు.

అర్థం చేసుకోవడానికి తెగువ చూపించే మన సాహసం నుంచి దానికి రక్షణ లేదు!

దాని ఆంతరిక నిధినిక్షేపాలు వెల్లడి రావలసిందే!

దాని లోతు మనం కనుక్కోవలసిందే, ఆనందంగా అనుభవించాల్సిందే!

హెగెల్ సాధించిన ఒకానొక విషయం గురించి మార్క్స్ ఈ సందర్భంగా చెప్తాడు. మానవుడి సృజన శక్తిని ఒక పరిణామ క్రమంగా చెప్తాడు హెగెల్. 'వస్తునిష్టీకరణ'ను 'బాహ్యీకరణ'గా ఆయన అభివర్ణించాడు. దాని అధిగమనాన్ని శ్రమ ఫలంగా చెప్పాడు హెగెల్. ఇక్కడ ఒక్కచోటే హెగెల్ మనిషిని వాస్తవ రూపంలో చూశాడు.

శ్రమ పరిణామ సారాన్ని ఆయన అర్థం చేసుకున్నాడు ఈ సందర్భంలో. జాతిపరమయిన అస్తిత్వంగా మనిషి, తన జాతిపరమైన సామర్థ్యాలన్నింటినీ, శ్రమ ద్వారానే సాధించాడు. మరో మాటల్లో చెప్తే, మానవాళి శ్రమ ద్వారా మాత్రమే మానవ సామర్థ్యాలన్నింటినీ సృష్టించుకుంది! ఈ విషయాన్ని ఎత్తి చూపించడం ద్వారా, హెగెల్, మిగిలిన తత్వవేత్తల కన్నా పది అంగలు ముందుకు వేశాడు.

✧

ఆ మాట నిజమే కానీ, హెగెల్ ఇక్కడా అసమగ్రతనూ, పాక్షికతలనే ప్రదర్శించాడని మార్క్స్ వ్యాఖ్యానించాడు. రాజకీయ అర్థశాస్త్ర సిద్ధాంతాలను హెగెల్ ఒక రకంగా ఆమోదించాడని మార్క్స్ అంటాడు. శ్రమ మౌలికపాత్రను గురించి నొక్కి చెప్తూ స్మిత్ చెప్పిన సిద్ధాంతాలను హెగెల్ ఒకరకంగా ఆమోదించా డన్నాడు. జాతిజీవిగా మనిషి సృజన క్రమంలో శ్రమ పోషించిన సకారాత్మక పాత్రను గురించి మాత్రమే హెగెల్ గ్రహించాడు. ఈ సృజనశక్తి క్రమానికి పరాయీకరణ క్రమంగా భాష్యం చెప్పాడు హెగెల్.

కానీ, ఈ సందర్భంగా మార్క్స్ ఎత్తిచూపించిన అంశం ఒకటుంది. అనిర్దిష్ట ప్రపంచంలో జీవిస్తూ ఉండిన హెగెల్, అనిర్దిష్ట మానవ శ్రమను మాత్రమే – అనగా, మేధో శ్రమను, ఆలోచనకూ జ్ఞానానికి సంబంధించిన శ్రమను మాత్రమే– గుర్తించాడు. అందువల్లనే హెగెల్ చెప్పిన పరాయీకరణ, మానసిక క్రమంగా మాత్రమే అధిగమన రూపం తీసుకుంది.

దృగ్విషయ శాస్త్రానికీ, మానవ చరిత్రకూ కూడా కీలకమయినది శ్రమ ప్రక్రియే! తన దైనందిన జీవనంలో భాగంగా మనిషి చేసేది నిర్దిష్ట, సజీవ శ్రమ ప్రక్రియే! ఈ ప్రక్రియలో భాగంగానే మనిషి మనుగడ సాగిస్తాడు, తింటాడు, ప్రేమిస్తాడు, బాధలు అనుభవిస్తాడు. పరాయీకరణకూ, దాని అధిగమనానికీ కూడా మూలాలు మానవశ్రమలో, దైనందిన జీవనంలో ఉండాలి.

ఈ వాస్తవాన్ని గ్రహించడంలోనే హెగెల్ విఫలమయ్యాడు. ఈ అంశం చెప్పుకోదగిన – బహుముఖ – వివరణలతో కూడిన సిద్ధాంత రూపం తీసుకుంది. హెగెల్ ప్రతిపాదించిన అనిర్దిష్ట, మార్మిక భావవాద సిద్ధాంతానికి జవాబు ఇది – మార్క్స్ ప్రతిపాదించిన భౌతికవాద సిద్ధాంతమిది. మార్క్స్ సిద్ధాంతం కూడా –హెగెల్, ఫోయెర్‌బాఖ్ ఉపయోగించిన పారిభాషిక పదజాలంతోనే నిండివుంది. నిపుణులకు తప్ప సామాన్య పాఠకులకు అది కొరుకుడుపడదనే మాట నిజం. అయితే, ఈ సిద్ధాంత సారం మాత్రం సుస్పష్టం. మనిషిని "వస్తునిష్టం కాని ఆధ్యాత్మిక అస్తిత్వం"గా పరిగణించాడు హెగెల్. మనిషి ప్రకృతిలో భాగమయిన అస్తిత్వమనీ, ప్రాకృతిక జీవశక్తులను కలిగి వున్నవాడనీ మార్క్స్ నొక్కి చెప్పాడు.

–––

హెగెల్ చెప్పిన గతితర్కంలో సానుకూలమయిన అంశాలు కూడా ఉన్నాయి. వస్తీ్వకరణ, బాహ్యీకరణ, అభావీకరణ,

పరాయీకరణ, దాని అధిగమనం – ఇవన్నీ వాస్తవ జగత్తులో సంభవించే క్రమాలుగా పేర్కొంది హెగెల్ గతితర్కం. వాటిని అభావం అభావం చెందే క్రమంలోని వాస్తవాంశాలుగా పేర్కొంది హెగెల్ గతితర్కం. దైవభావానికి అభావంగా నిరీశ్వరవాదం, సొంత ఆస్తికి అభావంగా కమ్యూనిజం కేవలం భావనలే కావీనాడు! అవి, కేవలం భావనా జగత్తులోనే సంభవమయ్యే విషయాలు కావిప్పుడు. నిజమయిన మానవత్వం దిశగా రూపుదిద్దుకున్న వాస్తవ సామర్థ్య రూపాలుగా నిలిచివున్నాయవి.

---

ఓపికా, తీరికా ఉంటే కొన్ని విషయాల గురించి చర్చించుకుందామని ముందే అనుకున్నాం కదా– మార్క్స్ కొన్ని విషయాల గురించి "రాతప్రతులు" రాసిన తర్వాతి రోజుల్లో లోతుగా విశ్లేషించలేదనే మాట –పాక్షికంగా– వాస్తవమే! వాటిల్లో ముఖ్యమయింది 'పరాయీకరణ' అనే భావన. అయితే, దీని గురించి రాతప్రతుల్లో మార్క్స్ విస్తృతంగా చర్చించాడు. తర్వాత దాని గురించి చర్చించకపోవడానికి ఉద్దేశాలు ఆపాదించే మహానుభావుల్ని వాళ్ళ ఖర్మకు వదిలేద్దాం. కుట్రసిద్ధాంతాలు పుట్టించి వ్యాపింపచేసే పుణ్యాత్ములకు అందులో ఏదో ఆనందం దక్కుతుంది. కోవిడ్–19 గురించిన కుట్రసిద్ధాంతాలే ఇందుకు నిదర్శనం! పోతే, 'రాతప్రతులు'లో పరాయీకరణ గురించిన విశ్లేషణ ఉన్న మాట నిజమే! ఈ పరాయీకరణ గురించి వేరే వాదాలు కూడా చర్చించిన మాట నిజమే!!

అలాంటి వాదాల్లో ముందుగా చెప్పుకోవలసింది 'అస్తిత్వవాదం' (ఎగ్జిస్టెన్షియాలిజం) గురించి.

ఈ వాదం, మార్క్సిజం కన్నా గొప్పదని వాదించే మాదన్నలను అలా వదిలిపెట్టండి. అస్తిత్వవాదం చెప్పే "పరాయీకరణ", 'రాతప్రతులు'లో మార్క్స్ ప్రస్తావించిన 'పరాయీకరణ' ఒకటేనా? మార్క్సిస్టులకూ, అస్తిత్వవాదులకూ మధ్య పరాయీకరణ గురించి చర్చ జరిగిన సంగతి మనకు తెలుసు. ఇది అరవై దశకంలో మాట. ఆ తర్వాత అరవై ఏళ్ళు గడిచిపోయాయి! పరాయీకరణ పాత్రకు సంబంధించిన ఈ చర్చలో, ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం ఒకటుంది.

ఈ రెండు దృక్పథాలూ కూడా హెగెల్ తాత్వికతలోని అనిర్దిష్టత పట్ల వ్యతిరేకతలోంచే రూపుదిద్దుకున్నవే. హెగెల్ తాత్వికతలో వాస్తవ మానవుడు కాల్పనిక పురాణ పురుషుడిగానే కనిపిస్తాడు. ఎందుకంటే, హెగెల్ వాస్తవ వ్యక్తినీ, ఆతగాడి వ్యక్తిగత వాస్తవ జీవితాన్ని స్పృశించనే లేదు.

మార్క్సిజమూ, అస్తిత్వవాదమూ కూడా కొన్ని విషయాలు నొక్కి చెప్తాయి– మనుషుల హుందాతనాన్ని గురించి, కనీసం అటువంటి గౌరవ ప్రదమయిన జీవితాన్ని కలిగి వుండే హక్కు గురించీ– మానవుడి అద్వితీయ విశిష్టత గురించీ, అతగాడి ప్రాముఖ్యం గురించీ– ఈ రెండు వాదాలూ నొక్కి చెప్తాయి!

కానీ, ఇక్కడినుంచి మార్క్స్ మరింత ముందుకుపోయి తన తాత్విక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. సంఘజీవయిన మనిషి వర్గపోరాటం ద్వారా తన పరాయీకరణను అధిగమిస్తాడని ఆయన స్పష్టం చేశాడు. తన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు వాస్తవ రూపం ఇవ్వగల సమాజాన్ని నిర్మించుకుంటాడని కూడా ఆయన స్పష్టం చేశాడు.

అస్తిత్వవాదానికి మూలపురుషుడుగా చెప్పుకునే సొరేన్ కీర్క్ గార్డ్ (1813–55) మార్క్స్‌కు సమకాలికుడే. కానీ, కీర్క్ గార్డ్ ప్రతిపాదించిన సిద్ధాంతం ఇందుకు విరుద్ధంగా ఉంది. వ్యక్తికీ, దేవుడికీ మధ్య తలెత్తే ఘర్షణ ప్రాతిపదికగా కీర్క్ గార్డ్ తన సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం మనిషిని పాపం తాలూకు స్పృహ వెంటాడుతూ ఉంటుంది. తీవ్రమయిన అంతస్సంఘర్షణాత్మక స్థితిలో మనిషి తన పరాయీకరణపై విజయం సాధించగలడు. అతగాడికి ఆ విజయం ఒకవేళ సాధ్యమయితే, అది గహనమయిన వ్యష్టితత్వంతో కూడిన మతం ద్వారానే సాధ్యం. ఈ సిద్ధాంతంలో, ఒక రకమయిన పరాయీకరణ స్థానంలో మరొకదాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం జరిగింది. అప్పటికి వెనుకబడిన డెన్మార్క్ సమాజంలో నెలకొని వున్న ఆర్థిక పరిస్థితులు కీర్క్ గార్డ్ వైఖరిలో ప్రతిఫలించాయి.

ఈ విషయాన్ని మార్క్సిస్టులు తేలిగ్గానే గుర్తించగలరు. మార్క్సిస్టు దృక్పథం ప్రధానంగా ఆశావాదం. ప్రపంచ కార్మిక వర్గమంతా కలిసి సమష్టిగా సమాజ పునర్నిర్మాణం చేపడుతుందని మార్క్స్ భావించాడు.

కానీ, అస్తిత్వ వాదం మౌలికంగా నిరాశావాదం. మనిషి దైవాన్ని కోల్పోతే, శూన్యత పాలబడతాడని చెప్తుంది. తన మీద కత్తిగట్టిన పాడు లోకంలో వ్యక్తి –మనిషి కాదు, 'వ్యక్తి'– ఒంటరి వాడయిపోతాడని అస్తిత్వవాదం చెప్తుంది. ఘర్షణ పాలయిన వ్యక్తి ఒంటరితనంలోనే స్వేచ్ఛను సాధిస్తాడంటారు అస్తిత్వవాదులు.

మార్క్స్ దృష్టిలో స్వేచ్ఛ అనేది ఓ చారిత్రిక భావన. సంఘజీవి ప్రకృతితోనూ, మానవాళి మొత్తంతోనూ సత్సంబంధాలు కలిగి వుండి సాధించుకోవలసినదే స్వేచ్ఛ,

ఒక్క ముక్కలో చెప్తే, అస్తిత్వవాదం వ్యక్తివాదం – మార్క్సిజం సామాజిక వాదం. వాటికి పొంతన కుదిరే ప్రశ్నే లేదు!! అందుకే, ఈ చర్చ ఇప్పటికి షష్టిపూర్తి చేసుకున్నా ఓ కొలిక్కి రానేలేదు– ఇప్పట్లో వచ్చే సూచనా లేదు!! ❑

# గ్రాంసీ దృక్కోణంలో దళిత ఉద్యమం

**(ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు పుస్తకం నుండి ఆంధ్రజ్యోతి దినపత్రిక సెప్టెంబర్ 4న ప్రచురించిన భాగం)**

***ఇటాలియన్ మార్క్సిస్టు మేధావి ఆంటోనియో గ్రాంసీ (1891-1937) ఆలోచనల వెలుగులో సమకాలీన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల విశ్లేషణే డివివిఎస్ వర్మ రచన 'ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు 1952-2020'. ఇరవయ్యో శతాబ్దంలో విస్తరించిన పౌర సమాజానికి మార్క్స్ భావజాలాన్ని వర్తింపజేసి గ్రాంసీ హెజమనీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆధిపత్య వర్గాలు తమ అధికారానికి అనుకూలంగా ప్రజాసమ్మతిని పొందడాన్ని హెజమనీగా గ్రాంసీ నిర్వచించారు. ఏడు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఐదు దశలుగా ఆ ప్రజాసమ్మతి పొందిన మార్పులను ఆ సిద్ధాంత నేపథ్యంలో వర్మ ప్రతిభావంతంగా వివరించారు. 1985లో కారంచేడులో ఆధిపత్య వర్గాలకు చెందిన కుల దురహంకారులు దళితవాడపై సాగించిన మారణకాండ నేపథ్యంగా దళిత మహాసభ ఆవిర్భావం ఆ ఐదు దశలలో మూడోది. సమకాలీన చరిత్రలో ఆ ఉద్యమ సంస్థ నిర్వహించిన పాత్రపై కొత్త చూపుతో చేసిన నిశిత విశ్లేషణ ఇది.***

***ఆరు దశాబ్దాల ప్రత్యక్ష రాజకీయ అనుభవమున్న మేధావి, నిరంతరం ప్రజల హితం కోరుతూ కొత్త బాటలు వెదికే అన్వేషి డివివిఎస్ వర్మ.***

***దళిత మహాసభ ఒక ఉద్యమంగా జయప్రదం కాకపోయినా దాని ప్రభావం రాజకీయ రంగం మీద దళిత, బహుజన శక్తుల ప్రాధాన్యతని పెంచింది. దళిత మహాసభ ఉద్యమాలు చరిత్రలో భాగం అయ్యాయి. అవి ఆయా సమూహాల ఆలోచనలలో భాగంగా కొనసాగుతున్నాయి. మరో ప్రయత్నానికి అది పునాది అవుతుంది***

ఆంధ్రప్రాంతంలో 1980 దశకంలో కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయి. వాటి పర్యవసానంగా ఆంధ్ర ప్రాంతంలో దళిత ఉద్యమం విస్తరించింది. దళిత మహాసభ పేరుతో అది సంస్థాగత రూపం పొందింది. కోస్తా జిల్లాలలో హరిత విప్లవం తర్వాత ఈ 15 సంవత్సరాల కాలంలో ధనిక రైతుల వ్యవసాయ ఆదాయం పెరిగింది. అది గ్రామీణ ప్రాంతంలో అంతరాలను మరింతగా పెంచింది. ఇది స్థానికంగా ఆధిపత్య కులాలకి, పేదలకి మధ్య వైరుధ్యాన్ని పెంచింది.

1985లో కారంచేడులో ఆధిపత్య కులానికి చెందిన భూస్వామ్య దురహంకార శక్తులు తమ బలగాలతో దళితుల వాడపై సామూహిక దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు దళితులని వెంటాడి చంపారు. చాలామందిని తీవ్రంగా గాయపరిచారు. ఇద్దరు మహిళలను మానభంగం చేశారు. దళితులు అక్కడి నుంచి తప్పించుకుని మొదట చీరాల చర్చిలో తలదాచుకున్నారు. తరువాత వారు ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ శిబిరాన్ని నిర్వహించడానికి రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలతో పాటు దళితేతర సంఘాలు తోడ్పాటునిచ్చాయి. ఈ శిబిరానికి ప్రముఖ హక్కుల పోరాట నాయకుడు బొజ్జా తారకం, ప్రముఖ హేతువాది కత్తి పద్మారావులు చేరుకుని ఈ ఉద్యమానికి కొత్త విశ్వాసాన్ని కల్పించారు. వారే ఈ దళిత



ఆంధ్రజ్యోతి

గ్రాంసీ దృక్కోణంలో దళిత ఉద్యమం

శిబిరానికి నాయకత్వంగా నిలిచారు. ఈ శిబిరం కేంద్రంగా కారంచేడు హత్యాకాండకు కారకులైన వారిపై కేసులు నమోదు చేసి శిక్షించాలని, బాధితులకు చీరాలలోనే నివాస వసతి కల్పించాలని, వారి ఉపాధికి ప్రత్యేకంగా భూ పంపిణీ చేయాలని కోరుతూ ఆందోళనలు సాగించారు. అయిదు లక్షల మందితో చలో హైదరాబాద్ సమీకరణతో ప్రభుత్వం దిగివచ్చి ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించింది. కానీ ఇతర డిమాండ్లు అలాగే ఉండిపోయాయి. వీటి కోసం వేలాది మందిని సమీకరించి ఉద్యమించారు. ఈ ఉద్యమాలలో అంబేద్కర్, జ్యోతిబా పూలే,

మార్క్సు భావజాల స్రవంతుల వారు హేతువాదులు, రాడికల్స్ అందరూ భాగస్వాములయ్యారు.

1986లో తెనాలిలో దళిత మహాసభ తొలి మహాసభ నిర్వహించారు. అక్కడ దళిత మహాసభ మేనిఫెస్టోని విడుదల చేశారు. ఈ మేనిఫెస్టోలో పై స్రవంతుల ప్రభావం కనిపిస్తుంది. ఈ భావజాల వ్యాప్తికి దళిత పత్రికలు కీలక పాత్ర పోషించాయి. దళిత శక్తి, నలుపు, ఎదురీత, ఈనాటి ఏకలవ్య, కుల నిర్మూలన వంటి పత్రికలు భారత చరిత్ర, సమాజం, రాజకీయాల మీద శక్తిమంతమైన చర్చలు సాగించాయి. మార్క్సిజం మీద, అంబేద్కరిజం మీద సిద్ధాంత పరమైన చర్చ సాగించాయి. వర్గ, కుల సమస్యల మీద, భారతదేశంలో కులానికున్న ప్రత్యేక ప్రాధాన్యత మీద చర్చలు సాగించాయి.

దళిత మహాసభ చొరవతో మహాత్మాపూలే, పెరియార్, నారాయణ గురు, అంబేద్కర్ రచనలకు తెలుగులో అనువాదాలను ప్రచురించారు. ఈ దళిత మేధావుల రచనలను చర్చకు పెట్టి వాటి ద్వారా కుల – వర్గ దృక్పథంతో చరిత్రని పునర్నిర్మించడానికి, సమాజాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించారు. సాంస్కృతిక దళాలు బుర్రకథ, జముకుల కథలు తదితర రూపాలలో ప్రచారాన్ని నిర్వహించాయి. మొత్తం మీద దళిత మహాసభ తన ప్రారంభ దశలో బహుముఖ కార్యకలాపాల ద్వారా పీడిత వర్గాలలో కొత్త చైతన్యానికి పునాదులు వేసింది. ఆంధ్రప్రదేశ్లో దళిత– బహుజన హెజమనీకి, ఆధిపత్య పాలక వర్గాలకు ప్రత్యామ్నాయంగా రాజ్యాధికారం కోసం జరిగిన తొలి ప్రయత్నం ఇది. ఆంటోనీ గ్రాంసీ ఉప శ్రేణుల హెజమనీ మీద రూపొందించిన భావజాలానికి ఇక్కడ దళిత మహాసభ చేసిన ప్రయత్నాలకు కొన్ని పోలికలు ఉన్నాయి. దళిత మహాసభ నాయకులకు గ్రాంసీ భావజాల పరిచయం ఉన్నట్లు ఈ ఉద్యమాన్ని పరిశోధించినవారు ప్రస్తావించలేదు. అలాంటి ప్రస్తావన దళిత మహాసభ నాయకుల ప్రసంగాలలో ఉన్న దాఖలాలు కనిపించడం లేదు. అందుచేత ఈ ఉద్యమంలో కనిపించే గ్రాంసీ భావజాల పోలికలు సద్యోజనితమైనవి గానే భావించవచ్చు. అయితే పోలికలు ఉన్నందువల్ల ఈ ఉద్యమ విశ్లేషణకు గ్రాంసీ భావజాలం నిస్సందేహంగా ఉపకరిస్తుంది.

గ్రాంసీ ఉప శ్రేణుల నిర్వచనాన్ని విస్తృతపరిచాడు. కార్మిక వర్గంతో సహా పలు రూపాలలో దోపిడీకి, అణచివేతకు గురవుతున్న సమూహాలన్నింటితో పాటు, భాషాపరంగా, ప్రాంతీయపరంగా అణచివేతకు గురవుతున్న తరగతుల అస్తిత్వవాద ఉద్యమాలు, వివక్షకు గురవుతున్న మహిళల సమూహాలను మైనారిటీలను ఉప శ్రేణుల పరిధిలో నిర్వచించాడు ప్రత్యామ్నాయ హెజమనీలో ఈ ఉప శ్రేణుల సంఘటన వహించే కీలక పాత్రను పేర్కొన్నాడు.

దళిత మహాసభ తన మేనిఫెస్టోలో దళిత పదానికి కూడా విశాలమైన నిర్వచనాన్ని ఇచ్చింది. ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీలు అందరూ దళితులేనని కుల వర్గ దోపిడీకి, అణచివేతకు గురైన వారి అందరి ఐక్య సంఘటనకు దళిత పదం ప్రాతినిధ్యం వహిస్తుందని ప్రకటించింది. ఇది పౌర సమాజంలో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న ఉప శ్రేణి కులాల సంఘటనగా ప్రకటించారు.

గ్రాంసీ భావజాలం ప్రకారం ఈ ఉప శ్రేణులకు నాయకత్వం వహించే వర్గం కేవలం తన వర్గ ప్రయోజనాలకే పరిమితం కాకూడదు. అది ఈ ఐక్య సంఘటనలోని అన్ని సమూహాల ఆకాంక్షలను తన ఆకాంక్షలుగా వ్యక్తం చేయడం ద్వారా దీని కోసం అవసరమైన మేరకు తన ప్రయోజనాలను కొన్నింటిని వదులుకోవడానికి, మార్చుకోవడానికి సిద్ధపడాలి. దీనికి ఒక ఉమ్మడి భావజాలాన్ని అందరూ దానిని తమ స్వంత భావజాలంగా భావించే రీతిలో రూపొందించాలి. దీని ద్వారా ఒక ఉమ్మడి సమ్మతిని సాధించాలి.

దళిత మహాసభ కూడా కుల వర్గ నిర్మూలనను అందరి ఆకాంక్షలనూ సాధించే ఉమ్మడి అంశంగా ప్రతిపాదించింది.

గ్రాంసీ ఉప శ్రేణుల ఐక్యత విడి విడి సంఘటన కాకుండా అది ఒక సమ్మేళనంగా ఒక చారిత్రక ముద్దగా రూపొందినప్పుడే ఈ ఉప శ్రేణులు సమాజంలో హెజమనీ సాధించే స్థితి వస్తుందని సూత్రీకరించాడు.

దీనిని దళిత మహాసభ సాధించలేకపోయింది. దళిత పదానికి విశాలమైన నిర్వచనం ఇచ్చినా అది ఎస్సిలకే పరిమితం అయ్యింది. ఎస్టిలు, బిసిలు తాము కూడా దళితులమేనని ప్రకటించుకున్న సందర్భాలు లేవు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ వారిని విడి విడి సమూహాలుగా ఉంచింది. అది దళిత పదం గొడుగులో ఒక చారిత్రక ముద్దగా రూపొందలేదు.

గ్రాంసీ ఇలాంటి చారిత్రక ముద్దను రూపొందించడానికి తమ సవర్గ మేధావులను రూపొందించుకోవలసిన ఆవశ్యకతను వివరించాడు. ఈ సవర్గ మేధావులు ఉప శ్రేణులను కలిపి ఉంచే చరిత్రను, సామాజిక, సాంస్కృతిక భావజాలాన్ని పెంపొందించడం మాత్రమే కాదు. వారితో సజీవ సంబంధాల ద్వారా ఈ ఐక్యతను ప్రోది చేసేవారు కావాలని సూచించాడు.

☞ మిగతా 47వ పేజీలో

# ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ ప్రయోగాలు

## ప్రత్యామ్నాయ రాజకీయానికి కొత్త దారి

ప్రజాపక్షం దినపత్రికలో సెప్టెంబర్ 14న ప్రచురించిన పుస్తక పరిచయం

**రమేష్ చంద్ర భూపతిరాజు**

1952-2020 మధ్య కాలపు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్ని ఇటాలియన్ మార్క్సిస్ట్ మేధావి ఆంటోనియో గ్రాంసీ దృష్టి కోణం నుంచి విశ్లేషించిన పుస్తకం ఇది. విశ్లేషకులు ఆరు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న డివివియస్ వర్మ. తెలుగు పాఠకులకు మేధావులకు అంతగా పరిచయం లేని గ్రాంసీ ఆలోచనల్ని అర్థమయ్యేటట్టు చేస్తూ బాగా పరిచయం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు అన్వయిస్తూ చేసిన ఈ అనుశీలన గ్రాంసీనే కాదు మన రాజకీయాల్నీ కూడా కొత్తగా పరిచయం చేసింది.

ముందుగా గ్రాంసీ గురించి చేసిన పరిచయంలో అతని జీవితం, కృషి లను వివరించడం పాఠకుడికి ఉపకరించే విధంగా ఉంది. ఇటాలియన్ కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శిగా ఇటలీ పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న గ్రాంసీని దేశ ఫాసిస్ట్ ప్రభుత్వం తన అధినేత ముస్సోలిని మీద హత్యాప్రయత్నం అనే నేరారోపణ చేసి నిర్బంధించడం, ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన న్యాయవాది గ్రాంసీ మెదడును కనీసం ఇరవై ఏళ్లు పని చెయ్యకుండా ఆపాలని సిఫారసు చెయ్యడం గురించి చెప్పిన రచయిత ఈ క్రమంలో గ్రాంసీ ప్రతిపాదిత హెజిమొనీ సిద్ధాంతాన్ని పరిచయం చేశారు. హెజిమొనీ అంటే అధికారమేనని అయితే అది పోలీసులు, సైన్యం, కోర్టులు వంటి అణచివేత సాధనాల ద్వారా మాత్రమే సాధించేదికాదని మత, విద్య, సామాజిక, సాంస్కృతిక సంస్థల ద్వారా పౌర సమ్మతిని రాబట్టుకుని తమ వర్గ యథాస్థితిని కొనసాగించడాన్ని హెజిమొనీగా గ్రాంసీ నిర్వచించినట్టు చెప్పారు. అయితే హెజొమొనీ అనేది పాలక వర్గం మాత్రమే సాధించుకునేది కాదనీ ఆ వ్యవస్థను పడగొట్టడానికి ప్రజలు కూడా ప్రత్యామ్నాయ లేదా కౌంటర్ హెజిమొనీ సాధించవచ్చునంటూ అందుకు కృషి చేసే వర్గం ఇతర ఉపశ్రేణుల్ని కలుపుకోవాలనీ, సవర్గ మేధావుల్ని రూపొందించుకోవాలని, ప్రజల లోకజ్ఞానాన్ని విచక్షణాజ్ఞానంగా మార్చాలని, అందుకు నైతిక నాయకత్వం అవసరమని సంక్షిప్తంగానే అయినా స్పష్టంగా విశదీకరించారు. ఇది తర్వాతి భాగం లో ఆంధ్రదేశ రాజకీయాలతో గ్రాంసీ భావజాలాన్ని అన్వయించినపుడు దాన్ని సులభంగా అర్థం చేసుకునేందుకు ఉపయోగపడింది.




కాగా, డివివియస్ వర్మ ఆంధ్రదేశ రాజకీయాల్ని ఈ పుస్తకం లో హెజిమొనీ దృక్పథం నుంచి ఐదు దశలుగా విభజించడం ఆసక్తిని రేకెత్తించే అంశం.

మొదటి దశగా 1952 లో కమ్యూనిస్టులు కాంగ్రెస్ కంటే అధికంగా శాసనసభలో సీట్లు సాధించుకోవడం వెనుక 1942 తో మొదలై కమ్యూనిస్టు పార్టీ ప్రజాసంఘాల ద్వారా ముఖ్యంగా కార్మిక, వ్యవసాయ కూలీ, రైతు, విద్యార్థి, యువ, మహిళ, బాల సంఘాలు అరసం, ప్రజానాట్యమండలి వంటి సాంస్కృతిక సంఘాలద్వారా ఒక అసాధారణ బలాన్ని పుంజుకుని ప్రబల రాజకీయ శక్తిగా మారిన క్రమాన్నీ, ఈ పౌరసమ్మతి సాధనలో సద్యోజనితమై ఉన్న గ్రాంసీ భావజాలాన్ని వివరించారు. తరువాత దాన్ని నిలబెట్టుకోవడం లో విఫలం కావడంతో ఆ ప్రజాహెజిమొనీ చేజారి పోయిన వైనాన్ని కూడా చెప్పారు.

రెండవ దశగా యన్ టి రామారావు అధికారంలోకి రావడాన్ని సీజర్ తరహా హెజిమొనీగా చెబుతూ పాలక పార్టీ అధికారాన్ని కొనసాగించలేని పరిస్థితి, ప్రతిపక్షం దాన్ని కూలదోయలేని పరిస్థితి ఏర్పడిన అనిశ్చితిలో సమ్మోహన శక్తులెలా రంగప్రవేశం చేస్తాయో గ్రాంసీ చెప్పిన విషయాన్ని ఆంధ్రదేశానికి అన్వయించారు. ఎన్ టి ఆర్ అధికారంలోకి రావడానికి సినీ గ్లామర్ కారణం కాదనీ అప్పటికి నెలకొన్న ప్రత్యేక రాజకీయ సంక్షోభమే అసలు కారణం అనీ అంటూ చిరంజీవి, పవన్ కల్యాణ్ లు విజయం సాధించలేక పోవడానికి ఆ ప్రత్యేక పరిస్థితులు లేకపోవడమేనని అన్నారు. ఈ దశలోనే రాష్ట్ర రాజకీయంలో కుల సమీకరణల సంఘర్షణకి బీజం పడిందని కూడా గుర్తించారు.

మూడవదశగా రాష్ట్రంలో దళిత చైతన్యం పెరిగి దళిత మహాసభ ఆవిర్భవించడం వెనుక గ్రామాల్లో హరిత విప్లవం వల్ల ధనిక రైతుల ఆదాయం హెచ్చి వారికీ పేదలకీ మధ్య అంతరం పెరగడం, అందులోనే అగ్రకుల దళిత వర్గాల తారతమ్యం ప్రతిఫలించడం, విద్యావ్యాప్తి జరిగి దళితుల్లో ఆత్మగౌరవం హెచ్చి అణచివేతను ప్రతిఘటించేతత్వం పెరగడం, అగ్నికి ఆజ్యం పోసినట్టు కారంచేడు సంఘటన జరగడం వంటి పరిణామాలున్నట్టు గుర్తించారు. దళిత మహాసభ మేనిఫెస్టో లో అంతర్లీనంగా మార్క్స్ భావజాలాన్ని గుర్తించిన పరిశోధకుల్ని ఉటంకించిన విశ్లేషకులు దళిత మహాసభ కృషిలోనూ గ్రాంసీ ఆలోచనలు ఇమిడి ఉన్నట్లు అర్థం చేసుకున్నారు. మహాసభ దళితులంటే యస్ సి, యస్ టి, బిసి, మైనారిటీలందరూ అని ఇచ్చిన విస్తృత నిర్వచనాన్ని గ్రాంసీ కార్మిక వర్గం దోపిడీకి గురయ్యే అన్ని ఉపశ్రేణుల్నీ కలుపుకోవాలని ఇచ్చిన పిలుపుతో సంధానించారు. ముఖ్యంగా సవర్ణ మేధావుల్ని రూపొందించు కోవడంలో దళిత మహాసభ గ్రాంసీని తెలియకుండానే అనుసరించిందన్నారు. 1994 లో దళితులు బహుజనులు ఐక్యంగా బహుజన్ సమాజ్ పార్టీ రూపంలో చేసిన ఎన్నికల ప్రయత్నం విఫలం కావడం వెనుక అట్టడుగున ఆయా వర్గాల ప్రజాసమ్మతి లేకపోవడంగా గుర్తించారు. మహసభ తాత్కాలికంగా విఫలమైనా అది నిర్మించిన చైతన్యం మరో ప్రయత్నానికి పునాది అవుతుందనే ఆశను వ్యక్తం చేశారు.

బాస్టర్డ్ హెజిమొనీ గా పేర్కొనబడిన నాల్గవ దశ ఈ పుస్తకం లో ప్రత్యేకమైన అధ్యాయం. విశ్లేషకుడి రాజకీయ అనుభవం, సైద్ధాంతిక అవగాహన, అన్వయ సామర్థ్యం వ్యక్తమైన విభాగమనిపిస్తుంది. రాష్ట్రంలో ఏర్పడిన రెండు ప్రాంతీయ పార్టీల వెనుక ఉన్నది ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గమనీ ఇది సంపన్న వర్గాల కులాల సమ్మేళనమనీ అది ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తన వర్గ ప్రయోజనాలను కాపాడుకుంటుందనే కొత్త అవగాహన కల్పించారు. ఈ వర్గం రెండు పార్టీల రూపంలో కుల సమీకరణల రాజకీయం చేస్తూ తమ మిత్రవర్గాలుగా భావించే ఉపశ్రేణుల నుంచి క్రియాశీలమైన నేతలను ప్రలోభాలతో పదవులతో తన వైపుకు లాక్కుని ప్రజా సమ్మతిని పొందడానికి ప్రయత్నిస్తుందనీ, ఇట్లా నీతిబాహ్యమైన అవినీతి పద్ధతులతో పరోక్ష సమ్మతిని సాధించడాన్నే గ్రాంసీ బాస్టర్డ్ హెజొమొనీగా నిర్వచించాడని వివరించారు. రాష్ట్రంలోని రెండు ప్రాంతీయ పార్టీలు ఈ పద్ధతినే అనుసరిస్తూ ఎన్నికలను కుబేరుల ఆటగా మార్చివేశాయని విశ్లేషించారు.


ప్రజాపక్షం Telugu National Daily

# ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు

## ప్రత్యామ్నాయ రాజకీయానికి కొత్త దారి

దీనికి ప్రత్యమ్నాయంగా ప్రజా హెజిమొనీని నిర్మించాల్సిన అవసరాన్ని ఐదవ దశలో ప్రతిపాదించారు. పాలక వర్గ హెజిమొనీని నిర్మూలించడానికి నిర్మించే ఈ కౌంటర్ హెజిమొనీ నిర్మాణంలో గత అనుభవాలను విశ్లేషించుకోవాలని మారిన పరిస్థితుల్ని అంచనా వేసుకోవాలని అంటూ గ్రాంసీ ఆలోచనలననుసరించి ఉపశ్రేణుల చరిత్రాత్మక ఐక్యత సాధించబడాలని, అందుకు నాయకత్వం వహించే వర్గం లేదా ఉపశ్రేణి అందరి ఆకాంక్షలను తన ఆకాంక్షలుగా వ్యక్తీకరించాలని అందుకు వర్గ దోపిడిని అంతం చేసే మార్క్స్ భావజాలాన్ని, కుల వివక్షను నిర్మూలించే పూలే అంబేద్కర్‌ల భావజాలాన్ని సమన్వయ పరచాలని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు వర్గ దృక్పథం ఉన్న మేధావుల నుంచీ వర్ణ వ్యతిరేక దృక్పథం ఉన్న మేధావుల నుంచి ఉమ్మడి భావజాలం గల సవర్ణ మేధావులను రూపొందించు కోవాలనీ, ప్రజల లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చడానికి ఒక సాంస్కృతిక విప్లవమే రావాల్సి ఉందని సూచిస్తూ ముగించారు.

రాజకీయాలకు సిద్ధాంతాలకు బొడ్డుతాడు తెగిపోయి ఎన్నికలు, అధికారం, పరిపాలన అనేవి వ్యక్తిగత అంచనాలు అభిరుచుల మీద ఆధారపడిపోయిన వర్తమానంలో ఒక సిద్ధాంత ప్రతిపాదనతో వచ్చిన ఈ పుస్తకం నాలుగు రోడ్ల కూడలిలో ఒక సైన్ బోర్డ్ లా కనిపిస్తున్నది. ఆంధ్రదేశ రాజకీయాల మీద ఆసక్తి ఉన్న వాళ్లందరూ విధిగా చదివి చర్చించాల్సిన ప్రాతిపదిక ఇందులో ఉంది.

ప్రత్యామ్నాయ హెజిమొనీ సాధించడంలో సాంస్కృతిక విప్లవానిది ప్రాధాన్యత కావడంతో రచయితలూ కళాకారులు తప్పక ఈ పుస్తకాన్ని చదవవలసిన అవసరం ఉంది. ఇటీవలే కార్ల్ మార్క్స్, ఫ్రెడెరిక్ ఏంగెల్స్‌ల ద్వి శతజయంతులూ, ఇప్పుడు లెనిన్ నూటయాభయ్యో జయంతి జరుగుతున్న నేపథ్యంలో గ్రాంసీ ఆలోచనల అధ్యయనమూ, ఆచరణ కొత్త ద్వారాలు తెరిచే అవకాశం ఉంది. మార్క్స్ అంబేద్కర్ ల మధ్య జరిగిన తులనాత్మక అధ్యయనానికి కొనసాగింపుగా గ్రాంసీ అంబేద్కర్‌ల అధ్యయనమూ జరగాల్సిన అవసరాన్ని చెబుతున్నది.

సాధారణంగా సైద్ధాంతిక గ్రంథాల్లో కనిపించే పడికట్టు పదాలూ, అన్వయ క్లిష్టత లేకుండా సులభతరంగా రాయబడి ఏకబిగిన చదివించే లక్షణాన్ని కలిగి ఉంది. ముఖచిత్రం మీద ఉపశీర్షికలే డిజైనుగా ముద్రించబడిన తీరు ఆసక్తిని కలిగిస్తూ ఆకర్షణీయంగా ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ పరిణామాల్ని ప్రయోగాలుగా చూసిన ఈ పుస్తకమే ఒక ప్రయోగం. ❑


**ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ ప్రయోగాలు**
**1952-2020**

**వెల : 30/-**

**ముద్రణ : గోదావరి ప్రింటర్స్ ఏలూరు**

**అభిప్రాయాలు పంపవలసినది : డి వి వి యస్ వర్మ**
**వాట్సాప్ : 8500678977**
**ఈ మెయిల్ : dvvsvarma1946@gmail.com**

**పుస్తకాలు అన్ని విశాలాంధ్ర, ప్రజాశక్తి పుస్తకాల షాపులలో దొరుకుతాయి.**


---

## గ్రాంసీ దృక్కోణంలో దళిత ఉద్యమం

**(44వ పేజీ తరువాయి)**

దళిత మహాసభ కూడా తన రచయితల విభాగాన్ని ఏర్పాటు చేసింది. వారు చరిత్ర, సామాజిక ఉద్యమాల పైన, ప్రచార సాహిత్యంపైనా చాలా కృషి చేశారు. ఎంతో వైవిధ్యం గల సాహిత్య సృష్టి చేశారు. అయితే ఈ ఉప శ్రేణులు ఎవరికి వారు తమ కులపరమైన అస్తిత్వ వాదానికి పరిమితం అయ్యారు. ఇవి విడి విడి అస్తిత్వ వాద సాహితీ ఉద్యమాలు గానే ఉండిపోయాయి.

గ్రాంసీ ఈ ఉపశ్రేణుల భావజాలాన్ని ఒక సాంస్కృతిక ఉద్యమంగా సాగించి భావ విప్లవాన్ని సాధించాలని ప్రతిపాదించాడు. ప్రజలను నిత్యజీవితంలో నడిపించేది వారికి అందుబాటులో ఉన్న లోకజ్ఞానం అనీ దానిని విచక్షణా జ్ఞానంగా మార్చడం ఈ భావ విప్లవ లక్ష్యంగా ప్రకటించారు. దళిత మహాసభ ప్రత్యేక సాంస్కృతిక రంగాన్ని ఏర్పాటు చేసినా అది ఉమ్మడి భావజాలాన్ని ప్రచారం చేసేదిగా సామాన్య ప్రజల లోకజ్ఞానాన్ని, విచక్షణా జ్ఞానంగా మార్చే ఉమ్మడి భావ విప్లవాన్ని సాధించే దిశగా అడుగులు పడలేదు.

గ్రాంసీ ఈ రాజకీయ సైద్ధాంతిక, సామాజిక సాంస్కృతిక ఉద్యమం కింది నుంచి నిర్మాణం కావాలని అప్పుడే అది విజయం సాధించే స్థితికి చేరుకుంటుందని విశ్లేషించారు.

బహుజన సమాజ్ పార్టీ రూపంలో 1994 ఎన్నికలలో పై నుంచి ఏర్పాటు చేసిన ఉప శ్రేణి కులాల రాజకీయ సంఘటన ప్రయోగం జయప్రదం కాలేదు. అది అట్టడుగు స్థాయిలో దళిత బహుజనుల ఉమ్మడి చైతన్యం నుంచి పుట్టింది కాదు. 1988లో దళిత మహాసభ రెండోసారి జరిగింది. ప్రారంభంలో దీని కార్యకలాపాలు ప్రధానంగా సామాజిక, సాంస్కృతిక రంగానికే పరిమితంగా ఉన్నాయి. ఈ సభలో నాయకత్వంలో వచ్చిన విభేదాలతో దళిత మహాసభ చీలిపోయింది. 1991లో పద్మారావు గ్రూపు విజయవాడలో, బొజ్జా తారకం గ్రూపు ఒంగోలులో వేరు వేరుగా సభలు నిర్వహించారు. ఇవే దళిత మహాసభ చివరి సమావేశాలు అయ్యాయి. ఆ తర్వాత దళిత ఉద్యమం అంతర్గత కుల వైరుధ్యంతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిగా, మాల మహానాడుగా చీలిపోయింది. దీనితో దళిత మహాసభ తన అస్తిత్వాన్ని కోల్పోయింది. దళిత, బహుజన హెజమనీ ఆలోచనగానే మిగిలిపోయింది.

దళిత మహాసభ ఒక ఉద్యమంగా జయప్రదం కాకపోయినా దాని ప్రభావం రాజకీయ రంగం మీద ఈ శక్తుల ప్రాధాన్యతని పెంచింది. దళిత మహాసభ ఉద్యమాలు చరిత్రలో భాగం అయ్యాయి. అవి ఆయా సమూహాల ఆలోచనలలో భాగంగా కొనసాగుతున్నాయి. మరో ప్రయత్నానికి అది పునాది అవుతుంది.

('ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు' పుస్తకంలో ఒక భాగానికి ఇది సంక్షిప్త రూపం) ❑


**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao** at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**